సంపుటి:57 • సంచిక:270
• సోమవారం 14 జనవరి 2019
• హైదరాబాద్ ❋ పేజీలు:12+12 • వెల: 5.00
• Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore

Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!



సంపద.. సందడి.. క్రాంతి.. శాంతి.. తిరునాళ్ళు.. తియ్యని అనుబంధాలు.. సంక్రాంతి అంటే పల్లెలకు పట్టంగట్టే పండుగ. సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేసే పండుగ. ప్రకృతిలో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసే పండుగ. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది పండుగలకే పండుగ.. పెద్దపండుగ. భోగినుంచి ప్రారంభమై సంక్రాంతి, కనుమ, ముక్కనుమ అంటూ వారంరోజులపాటు తనివితీరా చేసుకుంటారు ఈ పండుగ. పల్లెల్లో ఈ సంక్రాంతి సంప్రదాయం తెలుస్తుంది నిలువెల్లా. అందుకనే ఉద్యోగ వ్యాపారాల నిమిత్తం పట్టణాలకు వెళ్ళేవారంతా ఈ పండుగకోసం రెక్కలు కట్టుకుని సొంతూరుకు వాలిపోతుంటారు. కాంక్రీటు కీకారణ్యంలో కొట్టుమిట్టాడే పట్టణవాసులంతా ఈ పెద్దపండుగ పుణ్యమా అంటూ స్వగ్రామాలకు చేరుకుని మట్టివాసనను నెమరువేసుకోవడమే కాక బంధుత్వాలు, స్నేహాల పునాదులు కదిలిపోకుండా కాపాడుకుంటూ ఉంటారు. ఈ పండుగ విశేషాలపై ప్రత్యేక కథనం...

వివరాలు 3లో...

ఉట్టిపడే తెలుగు కాంతి...



ఊరంతా సంక్రాంతి

ధరణి ప్రత్యక్షం

పైలట్ ప్రయోగంపై సంతృప్తి

ప్రభుత్వ వెబ్‌సైట్ అందుబాటులోకి

ఇక ఆన్‌లైన్‌లో భూముల వివరాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : చాలా కాలంగా ఎదురుచూస్తున్న ధరణి ప్రత్యక్షమైంది. ఎట్టకేలకు భూముల వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించేలా ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. రాష్ట్రంలోని భూముల వివరాలను తెలిపే ధరణి. తెలంగాణ. జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను ఇప్పుడు ఎవరైనా సందర్శించే వెసులుబాటు వచ్చింది. తమ భూములకు చెందిన సమగ్ర సమాచారాన్ని ప్రజలు ఈ వెబ్ సైట్ ద్వారా తెలుసుకునేందుకు వీలు కల్గుతోంది. ధరణి పేరుతో అమలులోకి వచ్చిన వెబ్‌సైట్‌లో భూముల క్రయ విక్రయాల సమాచారం కూడా నమోదవుతుంది. 2.38 కోట్ల ఎకరాలకు చెందిన భూముల రికార్డులను భూరికార్డుల ప్రక్షాళన సందర్భంగా నమోదు చేసిన సంగతి తెలిసిందే. వివాదాల్లోని దాదాపు12 లక్షల ఎకరాలతో పాటు, నిషేధిత జాబితాలో ని మొత్తం భూముల విస్తీర్ణం 12.71 లక్షలుగా గుర్తించి

➪ 2వ పేజీలో...

సగం కొత్తముఖాలే?

మంత్రివర్గ విస్తరణలో ఎవరెవరికి పదవులు దక్కనున్నాయో సీఎం కేసీఆర్ వారిని పిలిపించుకుని ముఖాముఖీ సమావేశమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులను ఇస్తున్న విషయాన్ని చెప్పినట్లు సమాచారం. తాను చెప్పిన అంశాలన్నీ గోప్యంగా ఉంచాలని, ఎక్కడా మాట్లాడవద్దని హెచ్చరించినట్లు తెలుస్తోంది.



- పాతవారిలో సగం మందికి నో చాన్స్
- కేబినెట్ కూర్పులో కేసీఆర్ మార్క్
- ఒకరిద్దరికి మంత్రి పదవులపై స్పష్టత
- ఎమ్మెల్యేలను పిలిపించి సీఎం దిశానిర్దేశం
- మాజీ మంత్రులకు భద్రత తొలగింపు
- ఎమ్మెల్యేలకు ఇచ్చే భద్రత కొనసాగింపు
- సచివాలయంలో మంత్రుల కార్యాలయాలు సీజ్
- మంత్రుల పీఎస్‌లు, అధికారులు మాతృసంస్థలకు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బాగా పనిచేయాలి.. సమర్థతను నిరూపించుకోవాలి.. వచ్చే పదేళ్లు నియోజకవర్గంలో తిరుగులేని విధంగా అభివృద్ధి చేయాలి... నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తే వరుస విజయాలు నీవే.... ఈ మాటలు ఎవరన్నారో తెలుసా? సాక్షాత్తూ తెలంగాణ సీఎం కేసీఆర్ అన్న మాటలివి. త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణలో ఉత్తర తెలంగాణకు చెందిన ఓ యువ ఎమ్మెల్యేను పిలిపించుకుని నీకు మంత్రి పదవి ఇస్తున్నా.. కష్టపడి పనిచేయి... సిద్దిపేట లాగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి తిరుగులేని నాయకుడిగా పేరు తెచ్చుకోమంటూ భుజం తట్టి చెప్పిన విషయాలివి. మంత్రివర్గ విస్తరణలో ఎవరెవరికి పదవులు దక్కనున్నాయో తెరాస అధినేత కేసీఆర్ వారిని పిలిపించుకుని ముఖాముఖీ సమావేశమవుతు న్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులను ఇస్తున్న విషయాన్ని చెప్పినట్లు తెలుస్తోంది. తాను చెప్పిన అంశాలన్నీ గోప్యంగా ఉంచాలని, ఎక్కడా మాట్లాడవద్దని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలతో కేసీఆర్ మాట్లాడిన అంశాలను బట్టి చూస్తుంటే గత మంత్రివర్గంలో పనిచేసిన వారిలో సగానికి పైగా ఎమ్మెల్యేలకు ఈ దఫా పదవులు దక్కే అవకాశాలు కనిపించడం లేదు. ఉత్తర తెలంగాణకు చెందిన మాజీ మంత్రులిద్దరికీ ఇప్పటికే వారికున్న భద్రతను కుదించినట్లు సమాచారం. ఈ ఇరువురు మాజీ మంత్రులు ఈ ఎన్నికల్లోనూ విజయం సాధించి మంత్రి పదవులపై గంపెడాశలు పెట్టుకున్నారు. రెండ్రోజుల క్రితం ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ ఉన్నతాధికారులు ఈ మాజీ మంత్రులకు ఉన్న భద్రతా సిబ్బందిని, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను వెనక్కి తెప్పించి ఎమ్మెల్యేలకిచ్చే భద్రతను కల్పించినట్లు తెలుస్తోంది. సీఎం కేసీఆర్ ఆదేశం మేరకే భద్రతను కుదించినట్లు ప్రచారం జరుగుతోంది. రెండు మూడ్రోజుల్లో మరికొంత మంది మాజీ మంత్రులకు ఉన్న భద్రతను తొలగించే అవకాశాలున్నట్లు సమాచారం. సచివాలయంలో మంత్రుల కార్యాలయాలను సైతం సాధారణ పరిపాలన శాఖ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకుని కార్యాలయాలను సీజ్ చేశారు. మంత్రుల దగ్గర పనిచేసిన కార్యాలయ సిబ్బంది సైతం తమ మాతృసంస్థల్లో చేరిపోయారు. బంజారాహిల్స్‌లోని మంత్రులకు కేటాయించిన నివాసాలను సైతం ఖాళీ చేయాలని రహదారుల భవనాల శాఖ అధికారులు నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఆదర్శ్‌నగర్‌లోని కొత్త ఎమ్మెల్యేల నివాస

➪ 2వ పేజీలో...

మైనర్‌పై గ్యాంగ్‌రేప్



- 16 ఏళ్ల బాలికపై 11 మంది నాలుగేళ్లుగా అత్యాచారం
- హైదరాబాద్‌లో దారుణం
- పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితురాలి బంధువుల బైఠాయింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పదహారేళ్ల మైనర్ బాలికపై మానవ మృగాలు అత్యాచారానికి పాల్పడ్డాయి. ఒకరు కాదు... పదకొండుమంది... పదేపదే... నాలుగేళ్లుగా ఆమెపై అత్యాచారానికి పాల్పడుతూనే ఉన్నారు. గ్యాంగ్‌రేప్ చేస్తూ వీడియో తీసి... ఎవరికైనా చెబితే వాటిని సోషల్ మీడియాలో పెడతామంటూ బెదరించి... లొంగదీసుకున్నారు. అఘాయిత్యానికి పాల్పడిన కామాంధుల

➪ 5వ పేజీలో...

హీరోలు గీత దాటారు

- ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘనలో టాలీవుడ్ నటులు
- మహేశ్, పవన్, బాలకృష్ణ, నితిన్, సునీల్ వాహనాలపై చలాన్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వెండితెరపై హీరోలుగా వెలిగి.. ప్రజలకు స్ఫూర్తినిచ్చే సెలబ్రిటీలుగా ముద్రపడిన ప్రముఖ నటులు ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం విశేషం. పైగా నిబంధనల ఉల్లంఘించినందుకు విధించిన చలాన్ల చెల్లింపు పైనా వారు అశ్రద్ధచూపడం మరీ దారుణం. తెలుగు సినీ పరిశ్రమలో హీరోలుగా వెలుగుతున్న

➪ 2వ పేజీలో...

సామ్రాజ్యం కోసం వాళ్లు.. సాధికారత కోసం మేము..

- వారిది అవకాశవాద కూటమి
- బీజేపీది ఓటు బ్యాంక్ రాజకీయం కాదు
- సేవే పరమావధిగా పనిచేస్తున్నాం
- యువత, రైతుల ఆశయ సాధన దిశగా ముందడుగు వేస్తున్నాం
- బీజేపీ కార్యకర్తలతో ప్రధాని నరేంద్ర మోడీ



బస్టాండ్‌లో ప్రసవం

- బస్సు కోసం వేచి ఉండగానే గర్భిణికి పురిటి నొప్పులు
- ఆర్టీసీ అధికారులు అప్రమత్తం.. తక్షణ చర్యలు.. ఆవరణలోనే ప్రసవం



హైదరాబాద్, ప్రభన్యూస్ : వైద్య చికిత్స నిమిత్తం నగరానికి చేరుకున్న నిండుగర్భిణి, కొన్ని కారణాలతో చికిత్స చేయించుకోలేక, స్వగ్రామానికి వెళ్లేందుకు మహాత్మాగాంధీ బస్ స్టేషన్‌కు ఆదివారం సాయంత్రం చేరుకుంది. అయితే బస్సుకోసం వేచిఉన్న సమయంలో ఆమెకు తీవ్ర నొప్పులు రావడంతో అప్రమత్తమైన విధుల్లో ఉన్న అసిస్టెంట్ స్టేషన్ మేనేజర్

➪ 2వ పేజీలో...

జౌరా..!



వీసా లేకుండా కర్తార్‌పూర్‌కు

- సిక్కుల కల నెరవేర్చాం.. సిక్కు అల్లర్ల బాధితులకు న్యాయం చేస్తాం: ప్రధాని
- గురుగోవింద్ సింగ్ 350వ జయంత్యోత్సవ స్మారక నాణెం విడుదల


8లో



మహారాష్ట్ర నుంచి శ్రీశైలంకు యాత్రికులతో వెళ్తున్న బస్సు అదుపు తప్పి ఘాట్‌రోడ్డులోని చిన్నారుట్ల వద్ద లోయలోకి దూసుకెళ్లింది. 50 మంది ప్రయాణికులు సురక్షితం

తెరాసలో జిల్లా కమిటీలు?

● వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కసరత్తు ● ముందు ఇన్‌ఛార్జ్‌ల నియామకం ● ప్లీనరీ తర్వాత పూర్తిస్థాయి కమిటీలు



ఆంధ్రప్రభ, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రసమితి మళ్ళీ జిల్లాకమిటీలు ఏర్పాటుచేయబోతున్నదా? గత ప్లీనరీలో నిర్ణయం తీసుకున్న పార్లమెంటరీ కమిటీల కంటే జిల్లా అధ్యక్షపదవే మేలన్న నిర్ణయానికి పార్టీ వచ్చిందా? తాజా ఎన్నికల అనుభవాలతో పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావులు ఈమేరకు నిర్ణయానికొచ్చారా? టీఆర్ఎస్ వర్గాల్లో జరుగుతున్న చర్చ ప్రకారం వీటికి ఔననే సమాధానం వినిపిస్తోంది. కొత్తజిల్లాల వారీగా జిల్లా కార్యాలయాలను నిర్మించాలని నిర్ణయించిన గులాబీదళపతి పార్టీ కమిటీలను కూడా అదేరీతిన వ్యవస్థీకరించేయోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్ఎస్ 16లోక్‌సభ స్థానాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకోగా, నియోజకవర్గ ఇన్‌ఛార్జిల కంటే జిల్లా ఇన్‌ఛార్జిలే బెటరన్న ఆలోచనకు తాజాగా వచ్చినట్లు తెలుస్తోంది. గతంలో ఉన్న 31జిల్లాలకు తోడు కొత్తగా ఏర్పాటు చేసే రెండుజిల్లాలకు కలిపి 33జిల్లాలకు పార్టీ ఇన్‌ఛార్జిలను నియమించే ఆలోచనలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పార్లమెంట్ నియోజకవర్గాలకు లేదా మూడు, నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలుగా ఉన్నారు. కొందరు ప్రధాన కార్యదర్శులుగా ఉన్న నేతలు ఎమ్మెల్యేలుగా ఎన్నికకావడంతో తమ పదవులకు రాజీనామా చేశారు. వీరి స్థానంలో కొత్తగా నియామకం చేస్తామని ఇటీవల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. శాసనసభ సమావేశాలు, చండీయాగం ముగిసిన తర్వాత పూర్తిస్థాయిలో పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి సారించాలని నిర్ణయించిన కేసీఆర్ ఈకమిటీలు, ఇన్‌ఛార్జిల వ్యవహారంపై దృష్టిపెట్టనున్నట్లు సమాచారం. ఇప్పటికే పార్టీవర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎవరికి ఏ బాధ్యత అప్పగించాలి? ఎవరిని ఎక్కడ కూర్చోబెట్టాలి అన్న అంశాలపై పూర్తిస్థాయి కసరత్తు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఇన్‌ఛార్జిలుగా పనిచేసిన రాష్ట్రప్రధాన కార్యదర్శులు మంచి ఫలితాలు రావడంలో క్రియాశీల పాత్ర పోషించారని, పార్లమెంట్ ఎన్నికలకు కూడా మళ్ళీ వారినే ఇన్‌ఛార్జిలుగా నియమించాలన్న ప్రతిపాదనను కూడా కేటీఆర్ పరిశీలిస్తున్నారు. ఆయా నియోజకవర్గాలపై పూర్తి అవగాహన నేతలకు ఉండడం, పార్టీ బలాబలాలు నేతల వ్యవహారశైలి, ప్రత్యర్థుల తీరు అన్నింటిపైనా సమగ్ర అవగాహన ఉండడంతో ఇన్‌ఛార్జిలను క్రియాశీలం చేయాలని నిర్ణయించినట్లు కనబడుతోంది. ఇక నియోజకవర్గాలలో నేతల మధ్య సమన్వయలోపం ఉన్నచోట ఎందుకలా జరిగింది? ఎవరు కారణం అన్న అంశాలపై కూడా కేటీఆర్ నివేదికలు తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. శాసనసభ సమావేశాల తర్వాత ఈ పార్టీపదవులపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

కార్యాలయాల నిర్మాణం కూడా

పార్టీ కార్యాలయాల నిర్మాణ పనులు కూడా జనవరి 26తర్వాత మొదలయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికే దీనిపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టిసారించి స్థలాలపై ప్రధానకార్యదర్శులను ఆదేశించారు. ప్లీనరీలోగా కార్యాలయాల నిర్మాణానికి రూపునివ్వాలని టీఆర్ఎస్ యోచిస్తోంది.



అసెంబ్లీ కవరేజీకి మీడియాకు లక్ష్మణ రేఖ

● నిబంధనలు, నియంత్రణలు

● మార్గదర్శకాలతో కూడిన బులెటిన్ విడుదల

● త్వరలో మీడియాకు స్వైపింగ్ కార్డులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ 2వ శాసనసభ మొదటి సమావేశాల మీడియా కవరేజీపై శాసనసభ స్పష్టమైన లక్ష్మణరేఖను నిర్ధేశించింది. జర్నలిస్టులకు నియంత్రణలను, నియమాలను నిర్దేశిస్తూ తెలంగాణ అసెంబ్లీ బులెటిన్ జారీ చేసింది. ఈనెల 17న ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాలను కవర్‌చేసే ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులకు నియమాలు, నిబంధనలను ప్రకటిస్తూ ఈ బులెటిన్‌లో అనేక అంశాలను పొందుపర్చారు. తెలంగాణ శాసనసభ స్పీకర్ పేరుతో మార్గదర్శ కాలు ఖరారైనట్లుగా బులెటిన్‌ను శాసనసభ కార్యదర్శి వేదాంతం నర్సింహాచార్యులు ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియమావళి అమలుకు పోలీసులకు స్పష్టమైన సూచనలు చేసినట్లుగా పేర్కొన్నారు. ఈ మార్గదర్శకాలను అనుసరించే మీడియా ప్రతినిధులు ప్రవర్తించాలని, ఖచ్చితంగా వీటిని పాటించాలని, ఇందుకు పోలీసులు పర్యవేక్షణ చేస్తారని బులెటిన్‌లో పేర్కొంది.

నియమాలు ఇవీ...

- గ్యాలరీ, లాబీలలోకి ప్రవేశాలను పూర్తిగా కట్టడి. గుర్తింపుకార్డు ఉండి, వాటిని స్వైప్ చేసిన తర్వాతే లోనికి ప్రవేశం
- ఫోటోలు తీయడం నిషేదం, ఇన్నర్ లాబీలోకి ప్రవేశం పూర్తిగా నిషిద్ధం
- అసెంబ్లీ లోపలి ఆవరణలోకి ఏ మీడియా ప్రతినిధికి అనుమతి లేదు. స్పీకర్, సీఎం, మంత్రుల చాంబర్ల సమీపంలోకి కూడా అనుమతిలేదు. కారిడార్లలో కూడా మంత్రులను కలిసే ప్రయత్నం చేయడం ఇక నిషిద్ధమే
- లాబీ పాసులున్న ప్రతినిధులు లాబీల వరకే పరిమితం
- మీడియా పాయింట్ ప్రతినిధులు అక్కడివరకే
- మీడియా పాయింట్ మినహా అసెంబ్లీలోని ఇంకెక్కడా ఇంటర్వ్యూలు, మాట్లాడ్డాలు చేయరాదు
- మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కానివారి ఇంటర్వ్యూలను, వ్యాఖ్యలను అసెంబ్లీ పరిధిలో తీసుకోరాదు
- మీడియా వాహనాల పార్కింగ్ పబ్లిక్ గార్డెన్ వరకే
- ఎలక్ట్రానిక్ మీడియా ఓబి వ్యాన్లు, డీఎస్ఎన్‌జీ వ్యాన్లు ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ మేరకే పార్కింగ్‌కు అనుమతి
- గ్యాలరీలో ప్రతినిధులు నిల్చునేందుకు అనుమతి లేదు. మూకుమ్మడిగా లేచి నిలబడటం, మాట్లాడుకోవడం నిషిద్ధం. గ్యాలరీ నిండిపోతే సందర్శకుల గ్యాలరీలోకి వెళ్లేందుకు అవకాశం
- గ్యాలరీలో కెమెరాలు, ఫోన్లకు అనుమతిలేదు. వాటిని నిర్ధేశిత ప్రాంతంలో డిపాజిట్ చేయాలి
- ఇన్నర్ లాబీలు కేవలం మెంబర్లకే పరిమితం. ఇతరుల ప్రవేశం నిషిద్ధం
- సమావేశాల రోజులలో లాబీ పాస్ ఉన్న మీడియా ప్రతినిధులు మీడియా లాంజ్‌లో కూర్చోవాలి



సగం కొత్తముఖాలే?

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంగణం, హైదర్‌గూడలోని పాత ఎమ్మెల్యేల నివాస ప్రాంగణాల్లో ఉంటున్న ఓడిపోయిన ఎమ్మెల్యేలు, వారి నివాసాలను వెంటనే ఖాళీ చేయాలని శాసనసభ కార్యదర్శి నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమయ్యారు. శాససభ సమావేశాలు తర్వాత స్వయంగా ఈ నోటీసులను ఎమ్మెల్యేలకు అందించే అవకాశం ఉందని తెలుస్తోంది. జరుగుతున్న పరిణామాలు, సీఎం కేసీఆర్ చేస్తున్న కసరత్తును బట్టి చూస్తుంటే మంత్రి మండలిలో ఎక్కువగా కొత్తవారికి మాత్రమే ఛాన్స్ ఉందని.. మాజీ మంత్రుల్లో ఒకరిద్దరికి మాత్రమే ఈసారి మంత్రివర్గంలో అవకాశం ఉందని తెరాస వర్గాల్లో చర్చ జరుగుతోంది. జిల్లాల్లో పార్టీని బలోపేతం చేయడంతో పాటు గ్రూపు రాజకీయాలను కొందరు మాజీ మంత్రులు పెంచి పోషించి పార్టీని అప్రదిష్ట పాలు చేసేలా ప్రయత్నించారని, దీంతో, ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లో ప్రభావం చూపిందని కేసీఆర్ భావిస్తున్నట్లు సమాచారం.

ఉత్తర తెలంగాణ నేతలపై అసంతృప్తి

ఉత్తర తెలంగాణలో కీలకమైన కొందరు మంత్రులు కేవలం హైదరాబాద్‌కే పరిమితమై జిల్లాలను ఏ మాత్రం పట్టించుకోలేదని, ఎన్నికల్లో ఆ మంత్రులు సాధించిన మెజారిటీనే ఇందుకు నిదర్శనమని సీఎం కేసీఆర్ తేల్చినట్లు సమాచారం. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి అమలు చేసిన పథకాలను, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ మంత్రులు విఫలమయ్యారని లబ్ధిదారులకు ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాల లబ్ధిని అందించడంలోనూ వారు ఆశించినంతగా పనిచేయలేదన్న భావన కేసీఆర్ మదిలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో మంత్రివర్గ కూర్పులో కేసీఆర్ ఆచితూచి అడుగులేస్తున్నట్లు సమాచారం. కేసీఆర్‌తో పాటు మహమూద్ అలీని మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. మరో 16 మందిని మంత్రి మండలిలో చేర్చుకునే అవకాశం ఉన్నా విస్తరణలో ఆరు లేదా ఎనిమిది మందిని ఎంపిక చేసే అవకాశం ఉందని అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. వీరిలో ఇప్పటికే ముగ్గురి అభ్యర్థిత్వాలను ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతుండగా.. మిగతా వారు ఎవరై ఉంటారనే అంశంపై సస్పెన్స్ కొనసాగుతోంది. సంక్రాంతి తర్వాత 18వ తేదీన మంత్రివర్గ విస్తరణ జరగవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నా ఆ రోజున ఈ కార్యక్రమం ఉండకపోవచ్చన్న సంకేతాలు వెలువడుతున్నాయి. మంత్రి మహమూద్ అలీతోనే నాలుగు రోజుల పాటు జరిగే శాసనసభ సమావేశాలను జరిపించి ఫిబ్రవరి ఏడవ తేదీన కొత్త మంత్రులను చేర్చుకునేందుకు ముహూర్తాన్ని ఖరారు చేయాలని కేసీఆర్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ తేదీ ఖరారుకు సంబంధించి ఆయన ఇప్పటికే వేదపండితులతో చర్చించి సమయాన్ని కూడా నిర్ధారించారన్న ప్రచారం జరుగుతోంది.

జీఏడీకి సమాచారం

సాధారణ పరిపాలన శాఖ అధికారులకు ముఖ్యమంత్రి కార్యాలయం ఇప్పటికే మంత్రివర్గ విస్తరణపై సమాచారం అందించిందని ముహూర్తం ఎప్పుడు ఖరారు చేసినా అందుకు అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేసి ఉంచాలని ఆదేశాలు జారీ



అయినట్లు తెలుస్తోంది. నాలుగు రోజుల పాటు జరిగే శాసనసభ సమావేశాలకు సంబంధించి కేసీఆర్ అధికారులు, తన కార్యాలయంకు సంబంధించిన మిగతా వారితో సంప్రదింపులు జరిపి ఏర్పాట్లపై సమీక్షించినట్లు తెలుస్తోంది. 16వ తేదీ సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌తో ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్ ఖాన్‌తో ప్రమాణ స్వీకారం చేయించిన తర్వాత మరుసటి రోజు 17వ తేదీ ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. సభా నాయకునిగా సీఎం కేసీఆర్ తొలుత ప్రమాణ స్వీకారం చేస్తారు. ఆ తర్వాత పేర్ల ప్రకారం ఆయా పార్టీల ఎమ్మెల్యేలతో వరుస క్రమంలో పిలిచి వారితో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఉదయం 10-30 గంటలకు ప్రారంభమయ్యే ప్రమాణ స్వీకార కార్యక్రమం మధ్యాహ్నం వరకు కొనసాగనుంది. మరుసటి రోజు తిరిగి 18వ తేదీ ఉభయసభలనుద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తారు. ఆ తర్వాత శాసనసభ సమావేశాలు వాయిదా పడనున్నాయి. నాలుగు రోజుల శాసనసభ సమావేశాలను పటిష్టంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికార పక్షం అన్ని ఏర్పాట్లు చేస్తుండగా పోలీసు యంత్రాంగం బందోబస్తు ఏర్పాట్లలో నిమగ్నమైంది.

వచ్చే నెలాఖరులో బడ్జెట్



ఫిబ్రవరి చివరి వారంలో తిరిగి వారం పదిరోజుల పాటు శాసనసభ సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లోపే మంత్రివర్గ విస్తరణ పూర్తి చేసి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ దఫా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతుండగా రాష్ట్రప్రభుత్వం కూడా అదే బాటలో పయనించాలని నిర్ణయించింది. ఈ మేరకు సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌లో ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమావేశమై ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించారు. ప్రభుత్వంలోని అన్ని శాఖలు బడ్జెట్ ప్రతిపాదనలను అధ్యయనం చేసి త్వరగా నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించారు. ఈ నెల 20వ తేదీ లోపు ఆయా శాఖల ఉన్నతాధికారులు తమ శాఖలకు సంబంధించిన నిధుల వినియోగం, వచ్చే బడ్జెట్‌లో కావాల్సిన నిధులు తదితర అంశాలను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించనుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి త్వరలోనే ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

హీరోలు గీత దాటారు

(మొదటిపేజీ తరువాయి)

ప్రముఖ నటులు ఇలా చేయడంపట్ల విమర్శలు వస్తున్నాయి. హైదరాబాద్‌లో లక్షలాది వాహనాలు ఉపయోగంలో ఉన్నాయి. ప్రతి రోజు వేలల్లో ట్రాఫిక్ ఉల్లంఘనలు జరుగుతూంటాయి. అలా ఉల్లంఘించినవారి వాహనాలను గుర్తించి చలాన్లు విధించి జరిమానా వసూలు చేయడం మామూలే. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఉల్లంఘించిన వారిలో ప్రముఖ సెలబ్రిటీస్ ఎక్కువంది ఉన్నారన్నది ఇప్పుడు వార్త. టాలీవుడ్‌కి చెందిన పలువురు ట్రాఫిక్‌ను ఉల్లంఘించడంతో పాటు అందుకు సంబంధించిన చలానాలు చెల్లించకుండా మిన్నకుంటున్నారు. యువ హీరో మహేష్‌బాబుకు చెందిన కారు మూడు సంవత్సరాల కాలంలో 7 సార్లు ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించిందట. అందుకుగానూ మహేష్ కారుపై మొత్తం 8,745 రూపాయల జరిమానా ఉంది. ఆ ఫైన్‌ను ఇప్పటికీ మహేష్ బాబు చెల్లించలేదు. మరో మూడుసార్లు మహేష్ కారు రూల్స్‌ను బ్రేక్ చేస్తే కోర్టులో చార్జిషీట్ దాఖలు కావడం ఖాయమని అంటున్నారు. ఇక పవన్ కల్యాణ్ కారు కూడా మూడు సార్లు నిబంధనలు అతిక్రమించిందని, పవన్ కారుపై మొత్తం రూ.505 రూపాయల చలానా చెల్లించాల్సి ఉందంటున్నారు. బాలకృష్ణ కారుపై కూడా చలానా ఉందని, ఆయన రెండు సార్లు నిబంధనలు అతిక్రమించినట్లుగా పోలీసు రికార్డుల్లో ఉంది. రూ.1035 రూపాయల జరిమానాను బాలయ్య చెల్లించాల్సి ఉందని చెబుతున్నారు. సునీల్ ఔటర్ రింగ్‌రోడ్డుపై అతివేగంగా వెళ్లడం వల్ల జరిమానా కట్టాల్సిన పరిస్థితేర్పడిందని, సునీల్ రూ.4,540 రూపాయలు చలానా బాకీ ఉన్నాడనిఅంటున్నారు. నితిన్ కూడా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించాడని, ఇందుకు గానూ రూ.1035 రూపాయల జరిమానా కట్టాల్సి ఉందని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి జరిమానా పడ్డ ఎంతోమంది సినీ స్టార్స్ జరిమానాలు కట్టారని, ఇంకా కొందరు ఫైన్ కట్టాల్సి ఉందంటున్నారు. ఇదిలా ఉండగా పది చలానాలు ఉంటే చట్టపరమైన చర్యలు తప్పవని ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు.

ఎంజీబీఎస్‌లో ప్రసవం

(మొదటిపేజీ తరువాయి)

జి. బాబు వెంటనే తక్షణ సహాయ చర్యలు చేపట్టగా, సదరు మహిళ పండంటి మగశిశువుకు జన్మనిచ్చింది. వివరాల్లోకెళితే.... నాగర్ కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ ప్రాంతానికి చెందిన చెంచు మణెమ్మ (25) నిండు గర్భిణి. రెగ్యులర్ చెకప్ కోసం నగరంలోని ఓ ఆసుపత్రికి వెళ్లగా అక్కడ సిబ్బంది, రిపోర్టులు లేని కారణంగా వైద్యం చేసేందుకు నిరాకరించారు. దీనితో ఆమె స్వగ్రామానికి వెళ్లేందుకు ఎంజీబీఎస్‌కు చేరుకోగా, బస్సుకోసం వేచిచూసే సమయంలో తీవ్ర నొప్పులు రావడంతో, సత్వరమే ఆమెకు వైద్య సహాయం అందించడంతో మగ శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం ఎంజీబీఎస్ ఏఎస్ఎం జి. బాబు 108 సమాచారం అందించగా, అక్కడికి చేరుకున్న 108 వైద్య సహాయ బృందం మణెమ్మను తదుపరి చికిత్స కోసం పేట్ల బురుజు ప్రభుత్వ మెటర్నరీ ఆసుపత్రిలో చేర్పించారు.



ధరణి ప్రత్యక్షం

(మొదటిపేజీ తరువాయి)

ఇందులో పొందుపర్చారు. వీటిని పార్ట్ బిలో చేర్చగా, రాష్ట్రంలోని 11200 గ్రామాలకు చెందిన 10,250 రికార్డులను డిజిటలైజ్ చేశారు. దీంతో సేత్వారీ, డిజిటలైజేషన్ విలేజ్ మ్యాప్‌లు సిద్ధం చేశారు. గురువారం క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా రెవెన్యూ స్పెషల్ సీఎస్ రాజేశ్వర్ తివారీ, భూ రికార్డుల ప్రక్షాళన డైరెక్టర్ వాకాటి కరుణ వికారాబాద్ జిల్లా పరిగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు,, మ్యుటేషన్లు, మార్పులు, చేర్పులు తదితర అంశాలు, వాటి పనితీరును పరిశీలించారు. ధరణి వెబ్‌సైట్ పనితీరుపై పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు. ధరణి వెబ్‌సైట్‌లో లాగిన్ అయిన తర్వాత సర్వే నెంబర్‌ను ఎంటర్ చేయగానే భూములకు సంబంధించిన వివరాలు కనబడుతాయి. అయితే రిజిస్ట్రేషన్, రెవెన్యూ అనుసంధానం మాడ్యూల్‌ను అందుబాటులోకి తేలేదు.

భూ పరిపాలన, రిజిస్ట్రేషన్ సేవలు రెండింటినీ అనుసంధానం చేసే అధునాతన సమీకృత భూ రికార్డుల నిర్వహణా వ్యవస్థ(ఐఎల్ఆర్ఎమ్ఎస్) ధరణి విధానంతో నిర్వహించేందుకు సమస్తం పూర్తయింది. వాస్తవ రికార్డుల ఆధారంగా మాన్యువల్ రికార్డులేవీ లేకుండా నిర్దేశిత లక్ష్యాలను చేరేలా అందరికీ ఏకరీతిలో సేవలందించేందుకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆటోమిషన్ ఆఫ్ వర్క్‌ఫ్లో ద్వారా సమర్థవంతమైన భూ పరిపాలన, డిజిటలైజేషన్‌తో వివిధ శాఖలకు మల్టిపుల్ అప్లికేషన్ అనుసంధానం అందుబాటులోకి రానుంది. వ్యవసాయ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్, భూ రికార్డులను ఏక తాటిపైకి రావడంతో ఏక గవాక్ష విధానంలో రాత పూర్వక భూ రికార్డులు, మ్యాపులు, సర్వేల నిర్వహణ, సెటిల్‌మెంట్ వ్యవహారాలు, స్థిరాస్తి రిజిస్ట్రేషన్ ఒక్కచోటికే చేరనున్నాయి. రాష్ట్రంలోని మొత్తం భూముల వ్యవహారాలు, రుణాలు, పంటల తీరు, భూమి తీరు, గతంలో పంటలు, ఇప్పటి పంటలు, ఏ తరహా భూములు వంటి సమగ్ర వివరాలు బ్యాంకర్‌తోసహా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఇంటర్‌లింక్ కానున్నాయి.

ఇంటికే పట్టాదార్ పాస్ పుస్తకం

రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగియగానే మ్యుటేషన్‌కు ఆటోమాటిక్ ట్రిగ్గర్ విధానంతో ఇంటికే పట్టాదార్ పాస్ పుస్తకం కొరియర్‌లో చేర్చేలా అద్భుత సాంకేతికత అమలులోకి తెస్తున్నారు. డిఐఎస్ పరికరాలను ఉపయోగించి స్పేయల్ డాటాను మెర్గుపర్చి భూముల హద్దులను వాస్తవీకరించనున్నారు. రెవెన్యూ శాఖలోని అన్ని కార్యాకలాపాలు సిస్టం ఆధారిత వర్క్‌ఫ్లో ద్వారా డిజిటల్ చేస్తున్నారు. దీంతో అన్ని లావాదేవీలకు పకడ్బందీగా భద్రత చేకూర్చనున్నారు. యూనికోడ్ ఫార్మాట్‌ద్వారా తెలుగులో డేటా స్టోరేజ్‌లో నిక్షిప్తం చేసి రికార్డులను సరళతరం చేస్తున్నారు. ఈ విధానంతో భూముల పూర్తిస్థాయి సమీకృత రికార్డులు ఆన్‌లైన్‌లో నిక్షిప్తమవుతున్నాయి. సమీకృత భూ రికార్డుల యాజమాన్య విధానం(ధరణి) వెబ్‌సైట్‌ను ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఐఎల్ఎఫ్ఎస్) త్వరితగతిన రూపొందించింది. ఇందుకు రూ. 116.05 కోట్లతో ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి.

బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో సమస్యలకు చెక్

బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో నడిచే విధానంలో ఎన్నో అవాంతరాలు తొలగనున్నాయి. ధరణి సమాచారం ఆధారంగానే 55 లక్షల కమతాలు, 71లక్షల వ్యవసాయ ఖాతాలకు పట్టాదార్ పాస్ పుస్తకాలు అందించనుంది. తొలిదశలో 54 లక్షలకు పాస్ పుస్తకాలు సిద్ధమవుతున్నాయి. 1.24 కోట్ల ఎకరాల వ్యవసాయ భూములకు చెందిన వివరాలను ఈ వెబ్‌సైట్‌లో పొందుపర్చనున్నారు. కౌలు, రుణ అర్హత కార్డులు, భూ యజమాని, ఖాతా నెంబర్, సర్వే నెంబర్, మొత్తం విస్తీర్ణం. ఎన్నేళ్లుగా పొజిషన్‌లో ఉన్నారు, వాటిలో ఏ పంట వేస్తున్నారు...భూమికి ఉన్న నీటి వసతి, వాటిపై ఉన్న రుణాలు వంటివన్నీ ఈ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి రానున్నాయి.

రాష్ట్రంలో 1,12,077 చదరపు కిలోమీటర్ల భూభాగం ఉండగా ఇందులో 2.80 కోట్ల ఎకరాల భూభాగపు లెక్కలు డిజిటలైజ్ చేయనున్నారు. తాజా భూ రికార్డుల సర్వేలో 1.42కోట్ల ఎకరాల వివాదరహిత వ్యవసాయ భూమి ఉందని తేలింది. మరో 17.89లక్షల ఎకరాల భూమి వివిధ న్యాయపరమైన చిక్కుల్లో ఉన్నట్లుగా తేల్చారు. మరో 11.95లక్షల ఎకరాల వ్యవసాయేతర భూమి ఉండగా, 84.00లక్షల ఎకరాల్లో చెరువులు, కుంటలు, కాలువలు, రైల్వేలైన్, సబ్‌స్టేషన్లు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు, ఇతర ప్రభుత్వ ఆస్తుల కింది భూములు, కోర్టు కేసుల్లోని అటవీ భూములు ఉన్నట్లుగా నిర్ధారించారు. 24 లక్షల ఎకరాల భూములు నగరాలు, పట్టణాలు, గ్రామాల్లోని నివాస ప్రాంతాలు, వివాదాలు లేని అటవీ భూములుగా నివేదించిన విషయం వెల్లడైంది. ఇక ఇప్పుడు వీటికి కట్టుదిట్టమైన రికార్డుల రూపకల్పన సిద్ధమవుతోంది. ఇందుకే ప్రత్యేకంగా ధరణి ప్రాజెక్టు రెడీ అయింది. ఒక్కో మండలానికి ఒక్కో ఐటీ నిపుణుడు ఎప్పటికప్పుడు ఆయా లెక్కలను ఈ వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేస్తారు. దీంతో భూ రికార్డులకు సమగ్రమైన విధానంతో మరింత స్పష్టత రానున్నది.

పక్కా అప్‌డేషన్

ప్రతీ ఎకరం భూభాగం వివరాలు ధరణి వెబ్‌సైట్‌లో అప్‌డేట్ అయ్యాయి. మొత్తం తెలంగాణ భూభాగం ప్రతీ అంగుళం ఇందులో నిక్షిప్తమైంది. ఇందుకు ఐటీ నిపుణుడు ప్రతీ కార్యాలయంలో ఉంటారు. ఇందుకు ప్రత్యేకంగా ఐటీ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ వివరాలు, పేరు మార్పిడి వివరాలు ఏరోజుకారోజే ధరణిలో నమోదు అవుతాయి. తద్వారా మండల కార్యాలయంనుంచి మొదలుకొని రాష్ట్రస్థాయిలో అన్నిచోట్లా ఈ వెబ్‌సైట్ నుంచే ఎవరైనా కావాల్సిన వివరాలు పొందొచ్చు. విదేశాల్లో ఉన్న ఎన్నారైలు కూడా ధరణి ద్వారా అందే సమాచారంతో క్రయ, విక్రయాలు జరుపుకునే వీలు కల్గుతుంది.

నకిలీలకి చెక్...

భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు, భూ రికార్డుల నిర్వహణలో నూటికి నూరు శాతం పారదర్శకత సాధించడం, అవినీతిని నిరోధించడం, నకిలీ పాస్‌పుస్తకాలను అరికట్టడం ప్రధాన లక్ష్యంగా ధరణి ఏర్పాటవుతోంది. రైతులు, ఇతరులు తరచూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తప్పించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. పాస్ పుస్తకం కొనుగోలుదారుడి ఇంటికే కొరియర్ ద్వారా అందనుంది. ఒక్క రోజులోమొత్తం పని పూర్తిచేసి అవినీతికి ఆస్కారం లేకుండా ప్రభుత్వం ధరణిని రూపొందించింది. నకిలీ పాస్‌పుస్తకాలు, ఇతర డాక్యుమెంట్లు లేకుండా ఈ వెబ్‌సైట్‌తో కట్టడి చేయనున్నారు.

ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: శుద్ధ అష్టమి రా.7.24 వరకు అనంతరం నవమి; నక్షత్రం: రేవతి ఉ.8.42 వరకు అనంతరం అశ్వని; అమృతకాలం: రా.2.15 నుండి 3.55 వరకు; వర్జ్యం: రా.తె.5.23 నుండి...; దుర్ముహూర్తం: మ.12.24 నుండి 1.12 వరకు, మ.2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు; మకర సంక్రమణం, భోగి పండుగ; ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం

టోలుతీస్తున్నారు..!

● ప్రభుత్వం రద్దు చేసినా పాటించని టోల్‌గేట్లు ● ఎన్‌హెచ్ఏఐ నుంచి ఆదేశాల్లేవంటూ వాదన ● రంగంలోకి పోలీసులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ టోలు రుసుమును వసూలు చేస్తున్నందున వాహనదారుల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది. జాతీయ రహదార్ల సంస్థ (ఎన్‌హెచ్ఎఐ) నుంచి తమకు ఏ విధమైన ఆదేశాలు అందలేదంటూ వాహనదారులను నిలిపేసి టోలు రుసుము వసూలు చేయడంతో పలువురు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఉత్తర్వుల ఉల్లంఘన, వాహనదారుల ఆగ్రహంతో సీరియస్ అయిన ప్రభుత్వం పోలీసులను రంగంలోకి దింపి దిద్దుబాటు చర్యలను ప్రారంభించింది. పోలీసుల రంగప్రవేశంతో కొన్ని ఒకటి రెండు చోట్ల టోల్ ప్లాజా నిర్వహకులు దారికి వచ్చినప్పటికీ మరికొన్ని జిల్లాల్లో 'డోంట్ కేర్' అనే ధోరణి కొనసాగుతోంది. సంక్రాంతి వేడుకలకు వెళ్లే వారితో జాతీయ రహదార్లపై ట్రాఫిక్ నిలిచిపోవడం, టోలు రుసుము కట్టేందుకు గంటల వ్యవధి వేచి ఉండాల్సి రావడంతో ప్రభుత్వం రంగంలోకి దిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం రాత్రి టోలు వసూలు చేయవద్దంటూ ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో రుసుము వసూళ్లు ఉండవం టూ వచ్చిన



వాహనదారులకు టోలు ప్లాజాల వద్ద చుక్కెదు రైంది. రాష్ట్రప్రభుత్వ నిబంధనలు తమకు వర్తించవని చెప్పి న టోలు ప్లాజాల నిర్వహకులు జాతీయ రహదార్ల సంస్థ నుంచి ఏ విధమైన ఆదేశాలు రాలేదంటూ వాహనదారులకు స్పష్టం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకొని ఉద్రిక్తలకు దారితీసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. పంతంగి టోల్‌ప్లాజా నిర్వాకులతో చర్చించి సోమవారం మధ్యా హ్నం నుంచి వసూలును నిలిపివేశారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న టోల్ ప్లాజాలకు ప్రభుత్వ నిబంధనలు వర్తించవని చెప్పడాన్ని సీరియస్‌గా తీసుకొని పోలీసు బలగాలను రంగంలోకి దించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు టోల్ ప్లాజాల వద్ద మొహరించిన పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందుల పేరిట గేట్లు ఎత్తివేయిం చారు. ఆదివారం సాయంత్రం వరకు కూడా వీరికి పోలీసు అధికారులు నచ్చచెపుతూనే ఉన్నారు. అయినప్పటికీ పలు టోల్‌ప్లాజా నిర్వాహకులు ఖాతరు చేయడం లేదు. ఆదివార ం సాయంత్రానికి కొంత రద్దీ తగ్గడంతో టోల్ ప్లాజాల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గాయి. ఏదో విధంగా టోల్‌ప్లాజా నిర్వహకులను ఒప్పించి తిరుగు ప్రయాణంలోనైనా సమస్య లేకుండా చూడాలనే నిర్ణయంతో అధికారులు న్నారు. ఈ నెల 16 న కూడా టోల్ వసూలు చేయద్దన్న ఆదేశాలను ఖచ్చితంగా అమలయ్యేలా చూసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.



ఉట్టిపడే తెలుగు కాంతి...
ఊరంతా సంక్రాంతి

మన సంస్కృతి సంప్రదాయాల్లో విశిష్టమైనవి పండుగలు. కాలానుగుణంగా మనం మారాల్సిన అవసరాన్ని చెప్పేవే ఈ పండుగలు. అనుబంధాలను పటిష్టంచేస్తాయి. అలాంటి వాటిల్లో తెలుగువారికి ముఖ్యమైనది సంక్రాంతి. అందరూ తమదగ్గరే ఉన్నారని విర్రవీగే పట్టణం ఈ పండుగకు చిన్నబోవాల్సిందే. రెక్కలొచ్చి ఎగిరిన పిల్లలు తిరిగొచ్చినట్లు పల్లె భుజాలెగరేయాల్సిందే. బాధరాయన సంబంధంలోనైనా మరొకరితో కలిసిపోగల తెలుగువారికి పండుగ వస్తే.. బంధాలు అరిసెలపాకంలా మరింత గట్టిపడతాయి. క్షీరసాగరమథనంలోంచి ఒక్కో అద్భుతమూ పైకివచ్చినట్లు వంటింట్లోంచి ఘుమఘుమలు పుట్టుకొస్తాయి. అంతా బాగుంది గానీ.. మరేపండుగకు లేని ప్రత్యేకత ఈ పెద్దపండుగకు ఏముంది?

(కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి)

భోగికి ముందు, తర్వాత చలిమంటలుగా పిలిచేవాటిని ఈరోజు మాత్రం భోగిమంటలు అంటారు. దక్షణాయణంలోని వర్షాలకు, చలికి దేహంలో పెరిగిన వాతలక్షణాలు, అనారోగ్యాలు నువ్వులనూనెతో, మూలికాగుణాలు గల కట్టెలు, కంపలతో కాగిన నీళ్లతో అభ్యంగన స్నానంతో తొలగుతాయి. ఆరోగ్యం, నూతనోత్సాహం ఉత్తరాయణం వైపు నడిపిస్తుంది. భోగిమంటల్లో ఇంత అంతరార్థం ఉంది. దీన్నిబట్టి ఈ పండుగ ప్రాధాన్యత గ్రహించాలి. ఏడాది పొడవునా ఎన్నో పండుగలు జరుపుకుంటాం. ప్రతి పండుగకు ఏదో ఒక నేపథ్యం ఉంటుంది. కానీ భోగి అరుదైన స్వతంత్రం ఉన్న పండుగ. భోగి అనే పేరులోనే ఎంతో అంతరార్థం ఉంది. ఇది ఏ దేవుడిని, దేవతను సూచించదు. మరి భోగి అనే పేరు ఎందుకొచ్చింది? ఎలా వచ్చిందో తెలుసుకుందాం..

తుళ్ళిపడుతున్న పల్లెలు

పట్టణాల్లో యాంత్రికజీవనం గడిపేవారిని సేదతీర్చేవి పల్లెలే. కాలుష్యంతో పొగచూరిన జీవనశైలికి స్వచ్ఛమైన పల్లెగాలి తగిలితే కొత్తఉత్సాహం వస్తుంది. నా అనే నలుగురు దొరికేది పల్లెల్లోనే. మట్టివాసన ముక్కుకు తాకగానే తెలుస్తుంది.. స్వచ్ఛమైన గాలి కమ్మదనం. ఎలాగున్నావురా అబ్బాయి.. అని బాబాయ్‌లు, మావయ్యలు పలకరించినప్పుడు తెలుస్తుంది ఆప్యాయతలో మధురానుభూతి. అల్లరి చూసి తియ్యగా కసిరే తాతయ్యలను చూస్తే పెద్దరికం కనిపిస్తుంది. ఉల్లిగారెలు, పులిహోరా, బొబ్బట్లు.. అమ్మమ్మ, నానమ్మలు కొసిరికొసిరి వడ్డించినప్పుడు అర్థమవుతుంది ప్రేమంటే ఏంటో. అందుకే ఉపాధికోసం ఎక్కడికెక్కడికో తరలిన వలసపక్షులు వీలుచేసుకుని మరీ సొంతగూటికి రెక్కలు కట్టుకుని వాలిపోతారు. అలాగే ఇప్పుడు కాంక్రీటు కీకారణ్యం నుంచి బయటకొచ్చిన వలసపక్షులు సొంతూళ్లలో చేసే సందడి అంతాఇంతా కాదు. పాతస్నేహితులను ఎక్కడున్నా వెతికి మరీ కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ మురిసిపోతున్నారు.



రాజభోగాలు

భోగములంటే సుఖములను అనుభవించేవాడు భోగి. తెలుగు నేల వ్యవసాయ ప్రధానమైనది. ఈ ఏడాది పొడవునా కష్టపడిన రైతు పండిన పంటతో ఆనందంగా ఇంటికొచ్చి భార్యాపిల్లలు, బంధుమిత్రులతో రాజభోగాలను అనుభవించే పండుగ కనుక దీన్ని భోగి అంటారు. దక్షిణాయానాంలో చివరిరోజు ఇది. ఆనాడు ఐహికమైన, భౌతికమైన సుఖాలను, భోగాలను అందరితో పంచుకోవాలి. పండిన పంటలను పనివారికి, హరిదాసులకు, యాచకులకు, పశుపక్ష్యాదులకు వితరణ చేయడం రాజభోగం. "సంపదను పదిమందికీ త్యాగంచేయడం భోగం, తానొక్కడే తినడం రోగం" అనే సత్యాన్ని తెలిపేదే భోగిపండుగ. మరునాటి ఉత్తరాయానాంలో ఆధ్యాత్మిక పారమార్థిక చింతనలో ప్రధానమైన త్యాగగుణాన్ని భోగి అందిస్తుంది. అన్నిలోహాలను బంగారంగా మార్చే పరుషవేదిని తయారుచేయడానికి వేమన తన స్నేహితులతో చాలా ప్రయోగాలు చేసి వైఫల్యాలు ఎదుర్కొన్నాడు. చివరికి విజయం లభించి మేలిమిబంగారం తయారయ్యేసరికి వైరాగ్యంవచ్చి యోగి అయ్యాడు. అదే భోగిపండుగ రహస్యం.

పురుషులకు పండుగ భోగం

పాతబట్టలను పేదలకు పంచాలి. పాడైపోయిన పాతవస్తువులను తగులబెట్టి అందరూ అందులో చలికాసుకుంటూ ఆనందించాలి. వేడినీళ్ళు పెట్టుకుని తలంటుపోసుకోవాలి. బంధాలే దుఃఖాలకు కారణమని తెలుసుకోవాలి. ఎండిపోయిన చెట్టుకొమ్మలను విరిస్తే రాబోయే వసంతానికి కొత్తకొమ్మలు వస్తాయి. గత వర్షాకాలంలో మొలిచిన కలుపుమొక్కలను తగలబెడితే నేల శుభ్రమవుతుంది. చలికి పెరిగిన దోమలు భోగిమంట పొగతో, మంటలతో తగ్గిపోతాయి. ఇలా ఇది పురుషుల భోగి.



గొబ్బెమ్మలను సాగనంపే భోగం

నెలరోజులు గొబ్బెమ్మలు పెట్టి పూలతో అలంకరించి పూజిస్తారు. పిడకలపై ఆవుపాలతో, కొత్తబియ్యంతో పొంగలి వండుతారు. భోగి పండుగనాడు సాయంకాలం సంధిగొబ్బెమ్మలను పెట్టి పూజిస్తారు. పాటలు పాడి కోరికలు కోరుకుంటారు. పెద్దముత్తైదువులకు వాయినాలు, గొబ్బెమ్మలను గోపికలుగా భావిస్తారు. తల్లికి ప్రత్యామ్నాయంగా గోమాత చెప్పబడింది. తల్లిపాలు లేని పిల్లకు ఆవుపాలే దిక్కు. భోగినాడు గోదా శ్రీరంగనాథుల కళ్యాణం జరిగింది. ధనుర్మాసం నెలరోజులు ఆమె గోపికాభక్తితో పాటలు పాడింది. ఇల్లు పాడిపంటలతో వర్ధిల్లడానికి గోపికలవలే ప్రార్థించి గొబ్బెమ్మలను సాగనంపడమే భోగిపండుగల స్త్రీల పాత్ర. ఆవుపేడ మనకెంతో పూజనీయంగా, ఆరోగ్యకరంగా ఉపయోగపడుతుంది. దాంతో ధనుర్మాసం

పిల్లలకు ఆరోగ్యభోగం

భోగిపళ్ళు, బొమ్మల కొలువులు కూడా ఈ పండుగకు ప్రధానమైనవి. రేగిపండ్లు చిన్నపిల్లల తలపై పోసి పేరాంటం జరుపుతారు. రేగిపండును అర్కఫలం అంటారు. సూర్యునికి ప్రతినిధిగా సౌరశక్తిని, జ్ఞానాన్ని, ఆరోగ్యాన్ని ఇచ్చే శక్తి రేగిపండ్లకు ఉంది. ఉత్తరాయానాంలో రాబోతున్న మొదటి చాంద్రమానమాసం మాఘమాసం. అది సూర్యారాధనకాలం. చిన్నపిల్లలకు రేగిపండ్లు తలపై పోయడంవలన వాటి స్పర్శ వారికి ఆరోగ్యాన్నిస్తుంది. సూర్యుని ఆశీస్సులను అందించినట్లవుతుంది. భోగినాడు బొమ్మలకొలువులకు హారతి ఇస్తారు. పిల్లల్లో సృజనాత్మకతను, పరిసరాల విజ్ఞానాన్ని, పరిజ్ఞానాన్ని, నిర్మాణశాస్త్ర దృష్టిని పెంపొందించే బొమ్మలకొలువులను ఆ రోజు ఏర్పాటుచేస్తారు. అందుకే ఇది పిల్లల భోగిపండుగ.

దంపతులకు ఇంద్రభోగం

ఇంద్రభోగాలు అన్నిటికంటే గొప్పవి. దేవతలరాజుగా స్వర్గంలోనే కాక యజ్ఞయాగాదికర్మలలోనూ పెద్దభాగాన్ని పొందుతారు. భోగి అనే పదానికి ఇంద్రుడే సరిపోతాడు. తూర్పుదిక్కుకు, మేఘాలకు అధిపతిగా భూమికి వర్షాన్నిచ్చేవాడు ఇంద్రుడే. భోగిపండుగ ఇంద్రపూజ కోసం ఏర్పడింది. ఉత్తరాయణం దేవయాణంకాలం కనుక ముందురోజు దేవతల అధిపతి అయిన ఇంద్రుడ్ని పూజించి ప్రసన్నం చేసుకోవాలి.

ఉత్తరాయణ పుణ్యకాలం

శ్రీరామనవమి, వినాయకచవితి.. ఇలా మన పండుగలన్నీ దాదాపుగా చంద్రమాన ప్రకారమే ఉంటాయి. కానీ సంక్రాంతిని సౌరమాన ప్రకారం జరుపుకుంటారు. సూర్యుడు ప్రతి మాసంలోనూ ఒక్కో రాశిలోకి వెళ్ళడాన్ని సంక్రమణం లేదా సంక్రాంతి అంటారు. అలా 12 రాశుల్లోకి వెళ్ళినప్పుడు 12 సంక్రమణలు వస్తాయి. వాటిల్లో మకరసంక్రాంతి ముఖ్యమైనది. అప్పటివరకు భూమధ్య రేఖకు దక్షిణ దిక్కులో ఉండే సూర్యుడు ఉత్తరానికి మారతాడు. అందుకే ఈ ఆరునెలల కాలాన్ని ఉత్తరాయణం అంటారు.

పశువులను పూజిస్తారు

సంక్రాంతి మరునాడు కనుమ. పశువులతో మనుషులకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసే రోజు ఇది. ఆ రోజున రైతన్న వాటికి పనిచెప్పడు. సొంతబిడ్డలా ఆదరిస్తాడు. అందంగా అలంకరిస్తాడు. తన పాలిట దైవం అనుకుని పూజిస్తాడు. అలాగే రైతులంతా ఈ పశువులను పోటాపోటీగా అందంగా ముస్తాబుచేసి అభిమానాన్ని చాటుకుంటారు. ఇటీవలకాలంలో ఈ పశువులకు అందాలపోటీలు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకోసం పశువులకు వీరతిలకాలు దిద్ది, రిబ్బన్‌లతోనూ, పూలమాలలతోనూ ముస్తాబుచేసిన తీరు ఔరా అనిపిస్తోంది.



గవర్నర్, సీఎం సంక్రాంతి శుభాకాంక్షలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంక్రాంతి పర్వదినం సందర్భంగా తెలుగు ప్రజలందరికీ ఉభయ రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు శుభాకాంక్షలు తెలిపారు. అన్ని వర్గాలు సుఖ సంతోషాలతో, సకల సౌభాగ్యాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. పాడి, పంటలు ఇంట్లోకి వచ్చిన వేళ రైతు కుటుంబాలు వైభవంగా జరుపుకునే సంబురాల సాంప్రదాయమే సంక్రాంతి అని ఆదివారం వేర్వేరు పత్రికా ప్రకటనల్లో పేర్కొన్నారు.



ఎల్‌బీ నగర్‌లో ఆదివారం రాత్రి సంక్రాంతి ప్రయాణ సందోహం



నారావారి పల్లెల్లో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి

ఘేవర్...సూపర్

మధురం... మధురం

- సంక్రాంతి స్పెషల్ ఘేవర్ స్వీట్
- అరిసెలు, సకినాలకు ఇది బోనస్
- భైంసాలో క్రేజీక్రేజీ స్వీట్
- తెలంగాణలో డిమాండ్



ఆంధ్రప్రభ, హైదరాబాద్: పండుగలు అనగానే అందరికీ గుర్తు కువచ్చేది ప్రత్యే కవంటకాలు. ఏ పండుగకు ఆ వంటకాలను ఆరగించడం మన ఆనవాయితీ కాగా నిర్మల్ జిల్లా భైంసా ప్రాంతం లో ఘేవర్ అనే స్వీటు సంక్రాంతి వంటకాలకు అదనంగా ప్రత్యేకత చాటుకుంటోంది. రాజస్థాన్‌కు చెందిన ఈ తినుబండారం ప్రజల నోరూ రిస్తోంది. సంక్రాంతి అనగానే సకినాలు, మురుకులు, అప్పాలు, చెగోడీలు ఇలా చెప్పుకుంటూ పోయే మెనూకు ఘేవర్ స్వీటును కూడా ఇపుడు తెలంగాణ ప్రజలు అదనంగా జోడిస్తున్నారు.

పిండివంటల ఘుమఘుమ

పల్లెలన్నింటికీ సంక్రాంతిశోభ వచ్చింది. ఎక్కడచూసినా పండుగ సందడి కనిపిస్తోంది. ఇంటింటా పిండివంటకాల ఘుమఘుమలాడుతున్నాయి. నిర్మల్ జిల్లా భైంసా ప్రాంతానికి మాత్రమే ప్రత్యేకం అయిన ఘేవర్ స్వీట్లు తినేందుకు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు భారీగా తరలివస్తుంటారు. స్వీట్‌షాపుల ముందు క్యూకట్టి కొనుగోలు చేస్తున్నారు. మిఠాయి రుచితో మైమ రిచిపోతు న్నారు. చిన్నా, పెద్దా, పేదా, ధనిక తేడాలేకుండా ప్రతి ఒక్కరూ ఈ మిఠాయి కోసం అర్రులు చాస్తారు. ఎంతో ప్రత్యేకత కలిగిన ఈ స్వీట్ సంక్రాంతికి వారంరోజుల ముందు నుండి మాత్రమే అందుబాటులో ఉంటుంది. పండుగ అయిపోగానే ఈ స్వీట్ తయారీని దుకాణదారులు ఆపేస్తారు. రాజస్థాన్‌కు చెందిన ఈ పిండివంటకం గత 20ఏండ్లుగా భైంసా వాసులకు పరిచయం. రాజస్థాన్‌కు చెందిన వ్యాపారులు భైంసా వచ్చి నివాసం ఏర్పాటు చేసుకోవడంతో ఘేవర్ స్వీట్ భైంసావాసులకు పరిచయమైంది. మొదట్లో అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉండగా స్వీట్ మాధుర్యం వల్ల ఇది ఫేమస్ అయిపోయింది.

మూడురకాల మురిపెం

ఘేవర్ స్వీట్లు మూడురకాలుగా అందుబాటులో ఉన్నాయి. సాధారణ ఘేవర్, మలై ఘేవర్, షుగర్‌లెస్ ఘేవర్ ఇలా మూడురకాల స్వీట్లను పాలు, మైదా, గోధుమపిండి, నెయ్యితో తయారుచేస్తారు. వేడివేడి ఘేవర్‌ను ఆస్వాదించేందుకు మహారాష్ట్ర నుండి సైతం భైంసాకు ప్రజలు వస్తుంటారు. ఘేవర్ స్వీటు మధురమైన సువాసనతో ఉంటుంది.

విదేశీ వనితలు ముగ్గులు వేసి.. గొబ్బెమ్మలు పెట్టి..



వరంగల్ బాలవికాస్‌లో ముగ్గులు వేస్తున్న విదేశీమహిళలు

కాజీపేట, ప్రభన్యూస్ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ అర్బన్ జిల్లా, కాజీపేట మండలం ఫాతిమా నగర్ బాల వికాస కేంద్రంలో బాలవికాస వ్యవస్థాపకురాలు బాలక్క ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కెనడా, సుబాన్, బంగ్లాదేశ్, శ్రీలంక నుంచి 40 మంది విదేశీయులు హాజరయ్యారు. విదేశీయులు తెలంగాణ సంక్రాంతి ముగ్గులు వేసి, గంగిరెద్దులతో ఆట పాటలు ఆడిపాడారు. సంక్రాంతి పిండి వంటలను రుచి చూసి బాలవికాస ప్రాంగణంలో ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా బాలవికాస వ్యవస్థాపకురాలు బాలక్క మాట్లాడుతూ తెలుగు ప్రజల విశిష్టత సంక్రాంతి పండుగ విశిష్టత దేశ విదేశాల్లో తెలియచేసే భారతీయ సంస్కృతికి అద్దం పట్టేలా నిర్వహించడం జరిగిందని తెలిపారు. కెనడా దేశం సంబంధించిన విదేశీయులు సంక్రాంతి సంబరాలను ప్రత్యేకంగా చిత్రీకరించడానికి రావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగారెడ్డి, శివరాం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకాశమే హద్దు!

- కోరికలను సాకారం చేసుకోవాలి
- పతంగుల పండుగలో

ఉపరాష్ట్రపతి వెంకయ్య





హైదరాబాద్,ఆంధ్రప్రభ: పతంగుల్లాగే ప్రజల కోరికలు ఆకాశంలో విహరిస్తాయని అయితే ఆకోరికలను సాకారం చేసుకునేందుకు అవకాశాలను అందిపుచ్చుకోవాలని భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కోరారు. ఆదివారం సికింద్రాబాద్ పెరెడ్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌ను ఉపరాష్ట్రపతి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాతి పండగ ప్రతి ఇంటా సంతోషాలను నింపుతుందన్నారు.తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి , పేరుతో ఈ పండుగను జరుపుకుంటున్నట్టే దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో సంక్రాంతిని జరుపుకుంటారన్నారు. సంస్కృతి , సంప్రదాయాలకు పునరంకితమవుతూనే వాటిని కాపాడుకుంటూ సమైక్యభావంతో ముందుకుసాగు దామన్నారు. దేశంలో 64రకాల కళలు ఉన్నాయని అందులో పతంగుల పండుగ ఒకటన్నారు. దేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోడి ,రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటువంటి పండుగలను ప్రోత్సహించటం అభినందనీయం అన్నారు. పతంగులు ఎగురవేసినా , ముగ్గులు వేసినా సంతోషం కలిగిస్తాయన్నారు. మనం ఎంత ఎత్తుకు ఎదిగినా మన మూలం నేలేనని తెలియచేసే భావనలు గాలిపటం ఎగరేయడంలో కనిపిస్తాయన్నారు. మంచిని కోరుతూ తీపిని పంచడం మన సంప్రదాయమని , అంతర్జాతీయంగా వివిధ దేశాల వారికి మనవైన తీపిరుచులను పరిచయం చేసే అంతర్జాతీయ స్వీట్స్ ఉత్సవం వారి రుచుల్లో ఉండే గొప్పదనాన్ని ఆస్వాదించే ఆస్కారం కల్పిస్తాయన్నారు. భారతీయ సంస్కృతిలో ప్రతి పండుగ వెనుక ఒక కారణం, ప్రతి సంప్రదాయం వెనుక ఒక విశేషం ఉంటుందన్నారు. మన జీవనానికి ఆహారం మూలమని , సరైన ఆహారం ద్వారా ఆరోగ్యం , ఆయుష్షు రెండూ పెరుగుతాయన్నారు. భారతీయ ఆహారం కాల పరీక్షలకు నిలబడిందన్నారు. మనదైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ సంక్రాతికి తెలుగురాష్ట్రాల్లోని ప్రతి ఇల్లు అల్లుళ్లతో కూతుళ్లతో ఉత్సాహంగా ఉంటుందన్నారు. తీపి వంటకాలు ప్రతి ఒక్కరిలో మధురానుభూతులను మిగిల్చుతాయన్నారు. అంతర్జాతీయ నగరంగా ఎదుగుతున్న హైదరాబాద్ అంతర్జాతీయ పతంగుల పండుగతో మరింత ఖ్యాతి గడిస్తుందన్నారు.

అలరించిన పతంగుల ఉత్సవం

మూడు రోజులపాటు జరిగే కౌట్ ఫెస్టివల్‌లో 20 దేశాలకు చెందిన ప్రతినిధులు పతంగులతో సందడి చేశారు. మనదేశంలోని 25 రాష్ట్రాలకు చెందిన ఔత్సాహికులు పంతంగుల పోటీల్లో పాల్గొన్నారు. స్వీట్ ఫెస్టివల్‌లో కూడా 1200రకాల మిఠాయిలు ఆహుతులను నోరూరింప చేశాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేజానపద నృత్యాలు పాటలు కనువిందులు చేశాయి.

ఆంధ్రప్రభ సారస్వత వేదిక

సాహితీ గవాక్షం

ఓ సంక్రాంతి కుమారా..!



ఓ సంక్రాంతి కుమారా
సడిచేసే క్రాంతి కుమారా
రండి రండి స్వాగతం!
విభ్రాంతిని వీడే రోజుకి
ఇదే ఘన స్వాగతం!
భ్రాంతి నింపిన కాలానికి
ఇదే ఘన వీడ్కోలు!
సంక్రాంతి ఆనవాళ్లను
నెమరువేసుకుందాం రండి!
మంచుతెరల్లో చలినెగళ్లకు
విచ్చేసేదే సంకురాత్రి!
ఎడ్లబళ్ల మువ్వల చప్పుళ్లకు
మురిసి విరిసేదే సంకురాత్రి!

ఇంటి ముంగిటి వడ్లపురులకు
నిండు సంతకమే సంకురాత్రి!
ఇంటి నిండా ధాన్యపు గాదెలు
ఇచ్చే వెచ్చదనమే సంకురాత్రి!
గొబ్బెమ్మల పూల సువాసనలు
విరజిమ్మే వేకువే సంకురాత్రి!
హరిదాసుల తంబురనాదపు
సంకీర్తనల సవ్వడులే సంకురాత్రి!
గంగిరెద్దుల అలంకారాల్లో
కాలిగిట్టల ఆటపాటల్లో
పెదవి కలిపి పాదం వేసేదే
అసలు సిసలు సంకురాత్రి!
పంటలొచ్చిన కాలంలో
పల్లెలు మురిస్తేనే సంకురాత్రి!

ఇవన్నీ చిన్నప్పటి తీపిగుర్తులు
వీటికోసమే వేకువన లేచేవాళ్లం
చూసిన వాళ్లకు చూసినంత
ఈ కళ్లనిండా ఆ ఆనవాళ్లే
ఈ మనసంతా ఆ సందళ్లే
అందుకే పల్లెకు పరుగులు
ఎంత వెదకినా కానరాదేమి?
తుపాన్లతో రోజూ చలికాలమే
సంకురాత్రి చలిని గుర్తించడమెలా?
వరద ముంపులో మునిగిపోతుంటే
వడ్లబస్తాలు మోసుకెళ్లే టైరుబళ్లెక్కడ?
ఇంట్లో పిల్లలే లేరు..గొబ్బెమ్మలెక్కడ?
పొట్టకూటి కోసం పట్నం పోయి
వేషం మారి..పేర్లే మారితే

హరిదాసులు ఇంకెక్కడ?
ఎండిన డొక్కల ఎడ్లు యాచకానికి
వస్తుంటే గంగిరెద్దుల రూపమెక్కడ?
నేనిప్పుడు వేకువనే లేవడం లేదు
వేటికోసం ఎదురుచూపుల్లేవు!
పాతరోజుల్ని పంచిచ్చేదెవ్వరు?
ఓ సంక్రాంతి కుమారా..
ఈ తరాన్ని ఆ తరానికి దరిచేర్చు
ఆ తరాన్ని ఈ తరంతో సంధానించు
అప్పుడే కొత్త క్రాంతి చిగురించేది!
అప్పుడే నీవు సంక్రాంతి కుమారుడివి
నేటి ప్రపంచానికి క్రాంతి కుమారుడివి!!

- వయ్యస్సారెస్
9000013367

తెలంగాణ ప్రగతిని చూపిన జ్వాలా వ్యాసాలు

ఖమ్మం జిల్లా సాగునీటి అవసరాలకు సంబంధించిన ప్రాజెక్టుల రూపకల్పన గురించి, అలాగే ఖమ్మం జిల్లా చరిత్ర గురించి సవివరంగా వివరించారు "అధునాతన పట్టణం ఖమ్మం" అనే వ్యాసంలో నరసింహారావు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ భూములకు సంబంధించిన పూర్వ చరిత్రను ఈ గ్రంథం ద్వారా తెలుసుకోవచ్చు.

వనం జ్వాలా నరసింహారావు ఈ పేరు సుపరిచితమైనది. ఆయన రచయితగా ఇంగ్లీషు, తెలుగు భాషల్లో అనేక గ్రంథాలను అందించారు. ఆయన రచనలు అందరికీ ఎంతో ఉపయోగకరమైనవి. నిత్య అధ్యయన శీలి ఆయన. జ్వాలా నరసింహారావు ఏది రాసినా ఒక పరిశోధనతో, సునిశిత పరిశీలనతో రాస్తారు. హైదరాబాద్, చెన్నై, గోవా, ఎసింక్రోనస్ హిస్టరీ, స్క్రాప్ బుక్, యాన్ ఎజెండా ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఏపి, గవర్నెన్స్ విత్ డిఫరెన్స్ వంటి ఇంగ్లీషు గ్రంథాలను, తిలక్ జ్ఞాపకాలు, అనుభవాలే అధ్యాయాలుగా, సుందరకాండ మందార మకరందం, బాలకాండ మందార మకరందం, అయోధ్యకాండ మందార మకరందం, ధర్మధ్వజం వంటి తెలుగు గ్రంథాలను అందించి ప్రతిభ చాటుకున్నారాయన. జ్వాలా నరసింహారావు ప్రతిభను గుర్తించి నాటి ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తన వద్ద పౌరసంబంధాల అధికారిగా నియమించుకున్నారు. మళ్లీ 25 సంవత్సరాల తర్వాత నేటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సీ.పీ.ఆర్వోగా జ్వాలా నరసింహారావును తీసుకున్నారు. ఇద్దరు ముఖ్యమంత్రుల పరిపాలనా తీరును, వారు ప్రవేశపెట్టిన పథకాలను, వాటి అమలుకు వారు చూపిన శ్రద్ధను అతి దగ్గరగా గమనించే అవకాశం ఆయనకు కలిగింది. ముఖ్యంగా కే.సి.ఆర్. పరిపాలనకు సంబంధించి, ఆయన సాధించిన విజయాలను గురించి ఒక రచయితగా ఆయన అత్యంత శ్రద్ధతో ఇదీ సుపరిపాలన (51 నెలల కేసిఆర్ ప్రభుత్వం) పేరుతో ఒక గ్రంథాన్ని వెలువరించారు.

కేసిఆర్ పరిపాలన ప్రారంభించిన నాటి నుండి 2018 సెప్టెంబర్ వరకు జ్వాలా నరసింహారావు వివిధ పత్రికల్లో రాసిన వందకు పై చిలుకు వ్యాసాలు ఈ గ్రంథంలో ఉన్నాయి. ప్రతి వ్యాసంలోనూ కే.సి.ఆర్ చేపట్టిన ఒక్కో అంశాన్ని విపులంగా చర్చించారు. అయితే ఆయన ఈ వ్యాసాల్లో భజన చేసినట్లుగాక ఒక శాస్త్రీయ అవగాహనతో విపులంగా చర్చిస్తూ కే.సి.ఆర్ పాలనను సమర్థించారు. సుపరిపాలన ఎలా ఉండాలో తెలియజేశారు. ఈ గ్రంథం ద్వారా మనకు తెలియని అనేకాంశాలు తెలుసుకోవచ్చు. ఒక పరిణతి చెందిన రచయితగా ఆయన అందించిన ప్రతి వ్యాసమూ మనల్ని ఆలోచింపజేస్తుంది. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలాంటి వ్యాసాలు రాయాలంటే ఒకవిధంగా కత్తిమీద సాములాంటిదే. ఏమాత్రం అజాగ్రత్తగా రాసినా అది ఎటు పోతుందో తెలియదు. అతి జాగ్రత్తగా, పూర్తి అవగాహనతో పాలనలో కే.సి.ఆర్ మార్క్‌ను బలంగా ఈ వ్యాసాలలో నరసింహారావు చూపించటంలో వందకు వందశాతం సఫలీకృతమయ్యారని ఘంటాపథంగా చెప్పవచ్చు.

దీని ద్వారా హైదరాబాద్ పూర్వ చరిత్ర, ఉద్యమ నేపథ్యాలు, వర్తమాన చరిత్ర, హైదరాబాద్ విశ్వనగరంగా రూపుదిద్దుకుంటున్న దశను కూడా మనం తెలుసుకోగలుగుతాము. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అభివృద్ధి దిశగా ఎలా శరవేగంగా పరుగులు పెడుతుందో ఈ వ్యాసాల ద్వారా సంపూర్ణంగా అవగాహన చేసుకోవచ్చు. కే.సి.ఆర్ దార్శనికత ఎలాంటిదో కూడా ఈగ్రంథం ద్వారా తెలుసుకోవచ్చు. కే.సి.ఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేసే దిశగా సాగించిన ప్రయాణం గురించి రెండు వ్యాసాలు ఈ గ్రంథం మొదట్లో కనిపిస్తాయి. దూరదృష్టి అనేది తెలంగాణ సి.ఎం. కున్న అత్యంత ముఖ్య లక్షణాల్లో ఒకటి. ఇచ్చిన మాటకు ఆయన కట్టుబడతారు. చెప్పింది తప్పకుండా చేస్తారు. ఆయన ప్రారంభించిన ప్రతీ పథకంలోనూ, చేసిన ప్రతి వాగ్దానంలోనూ దీన్ని మనం చూడవచ్చునంటారు జ్వాలావారు "నవ్య తెలంగాణ పథనిర్దేశకుడు కే.సి.ఆర్ అన్న వ్యాసంలో. ఓటుకు నోటు కుంభకోణంలో తమ పార్టీ శాసనసభ్యుడు ఒకరిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని, అరెస్టు చేసి, ఇంటరాగేషన్ చేసిన నేపథ్యంలో, తాను అరెస్టు అవుతాననే భయంతో చంద్రబాబు నాయుడు ఏపి పోలీసులతో రక్షణ ఏర్పాటు చేసుకున్న విషయాన్ని "సెక్షన్ 8 అవినీతికి రక్షణా?" అన్న వ్యాసంలో కూలకుషంగా చర్చించారాయన. ఏడాది పాలనలో బంగారు తెలంగాణకు బలమైన పునాది వేసిన నేపథ్యాన్ని ఒక వ్యాసంలో చర్చించారాయన. కే.సి.ఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందరెందరో దేశవిదేశాలకు చెందిన వారు ఆయన్ను కలుసుకుని అభినందించారు. తమ వంతు కృషిని అందిస్తామని కే.సి.ఆర్ తెలియజేశారు. ఇలాంటి విషయాలు ఈ గ్రంథంలో దొరుకుతాయి. గోదావరి పుష్కరాల సందర్భంలో కే.సి.ఆర్ చేసిన ఏర్పాట్ల గురించి, పుష్కరాల ప్రాచీనత గురించి, దాని ప్రాముఖ్యత గురించి జ్వాలావారు ఒక వ్యాసంలో చర్చించారు. తెలంగాణ హరితహారం గురించి ఒక వ్యాసంలో చూడ వచ్చు. ఇది కే.సి.ఆర్ చేపట్టిన మరో ప్రజాయజ్ఞంగా ఆయన వర్ణించారొక వ్యాసంలో.



"రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు గవర్నరుకు, రాష్ట్రపతికి పాదాభివందనం చేయడాన్ని వక్రీకరించి భాష్యం చెప్పిన సామాజిక శాస్త్రవేత్త కంచ ఐలయ్య ఇలా రాయడం (ఆంధ్రజ్యోతి-ఎడిట్ పేజి 5-7-2015) మాట్లాడటం కొత్తేమీ కాదు. తన వ్యాసాలలో, పుస్తకాలలో అనునిత్యం బ్రాహ్మణ్యాన్ని, బ్రాహ్మణులను 'బాపనోడు' అనే పదాలతో కించపరిచే వ్యాఖ్యలు చేయడం, అది తప్పని చెప్పినవారితో వాగ్వాదానికి దిగడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. హిందూ మతాన్ని అర్థపర్థం లేని వ్యాఖ్యలతో విమర్శించడం కూడా ఆయనకు నిత్యకృత్యం అంటూ భారతీయ సంస్కృతిలో పెద్దలకు, జ్ఞానవంతులకు, దైవత్వాలకు ఇచ్చే గౌరవం పాదవందనం అంటూ వివరిస్తారు "ఒక సామాజిక వేత్త అర్థరాహిత్యం" అనే వ్యాసంలో జ్వాలా నరసింహారావు. "విశ్వ నగరంగా భాగ్యనగరం అన్న" వ్యాసంలో హైదరాబాద్ గత చరిత్రను తెలియజేస్తా రాయన.

"అనర్హత విషయంలో నిర్ణయాధికారం పూర్తిగా సభాపతిదే. పదవ షెడ్యూల్ కింద పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి సంబంధించి, సభాపతి ఎటువంటి నిర్ణయమైనా, న్యాయస్థానాల తీర్పు పరిధిలోకి రావు. పదవ షెడ్యూల్ నిబంధనలను అమలు పరిచే విషయంలో తదనుగుణమైన విధి, విధానాలను రూపొందించుకునే అధికారం సభాపతికి ఉంది అంటూ వివరిస్తారు జ్వాలా నరసింహారావు ఒక వ్యాసంలో. ప్రజల భాగస్వామ్యంతో గ్రామజ్యోతి, నాటిరోజుల్లో గ్రామీణ జన జీవనం, వ్యయంలేని వ్యవసాయం కావాలి, అందరికీ విద్య దిశగా అడుగులు వంటి వ్యాసాలు ఆలోచింపదగినవిగా ఈ గ్రంథంలో ఉన్నాయి. ముఖ్యమంత్రి చైనా పర్యటనకు సంబంధించిన విశేషాలతో కూడిన వ్యాసమొకటి ఈ గ్రంథంలో లభిస్తుంది. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు తలపెట్టిన "ఆయుత చండీయాగం" పై కొందరు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శిస్తారు జ్వాలా ఒక వ్యాసం లో. క్రీమీలేయర్, భావన, చరిత్ర అన్న వ్యాసంలో బీ.సీ.రిజర్వేషన్ల అమలు ప్రక్రియకు సంబంధించిన అంశాలను లోతుగా చర్చించారాయన. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించిన విషయా లను సంపూర్ణంగా రెండు వ్యాసాల్లో జ్వాలా చర్చించారు. ఖమ్మం జిల్లా సాగునీటి అవసరాలకు సంబంధించిన ప్రాజెక్టుల రూపకల్పన గురించి, అలాగే ఖమ్మం జిల్లా చరిత్ర గురించి సవివరంగా వివరించారు "అధునాతన పట్టణం ఖమ్మం" అనే వ్యాసంలో నరసింహారావు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ భూములకు సంబంధించిన పూర్వ చరిత్రను ఈ గ్రంథం ద్వారా తెలుసుకోవచ్చు. కే.సీఆర్ ప్రభుత్వం బ్రాహ్మణులకు అందిస్తున్న ఆసరా గురించి ఒక వ్యాసంలో ఆయన వివరించారు. సంక్షేమానికి వారూ-వీరూ అనే తార తమ్యం చూపించకుండా, పేదవారెవరైనా సరే, ఆదుకోవాల్సిందే అన్న దృక్పథంతో సరికొత్త సామ్యవాద భావనతో, బ్రాహ్మణుల సంక్షేమానికి నిధిని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుగారు అభినందనీయులు"అంటారాయన ఒక వ్యాసంలో. తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీరు అందించ డానికి కేసిఆర్ చేస్తున్న కృషిని సంపూర్ణంగా వివరించారాయన ఒక వ్యాసంలో. అలాగే కే.సి.ఆర్ 31-3-2016న శాసనసభలో సాగునీటి ప్రాజెక్టుల గురించి చేసిన ప్రసంగపాఠం ఈ గ్రంథంలో లభిస్తుంది. గవర్నరు ప్రసంగంపై గొడవ అనుచితం అనే వ్యాసాన్ని కొత్త జిల్లాల ఏర్పాటు గురించిన వ్యాసాన్ని ఇందులో చూడవచ్చు. అలాగే జిల్లాల గత చరిత్ర కూడా ఇందులో లభిస్తుంది. "సంక్షేమ రాష్ట్రం అంటే ఇది!" అన్న వ్యాసంలో కే.సి.ఆర్ ప్రవేశపెట్టిన అనేక పథకాల గురించి వివరిస్తారు జ్వాలా. భూపరిపాలనలో సంస్కరణలు, పర్యావరణం కన్నా అభివృద్ధే మిన్న, నిర్వాసితులపై రాద్ధాంతం వద్దు!: బహుళ ప్రయోజనకారి...మల్లన్న సాగర్ రిజర్వాయర్. అంతరాష్ట్ర జల ఒప్పందాలలో నూతన ఒరవడి, అన్యాయానికి సజీవ సాక్ష్యం నాగార్జున సాగర్, బ్రాహ్మణ సంక్షేమం..ఈశ్వరుడికి సంతోషం, నాటి నగదు రహిత లావాదేవీలు, మొక్కులు ప్రభుత్వ పక్షానే...తప్పేంటీ?, అభివృద్ధి కోసమే అప్పులు, తెలుగు మహాసభలు! అప్పుడు, ఇప్పుడూ వంటి వ్యాసాలు ఈ గ్రంథంలో లభిస్తాయి. ఈ వ్యాసాలలోనూ ఆయా అంశాలపై ఆలోచనాత్మకంగా జ్వాలా చర్చించారు. రుణమాఫీ నుంచి పెట్టుబడిదాకా, సంక్షేమానికి ప్రాధాన్యం, దేశానికి ఆదర్శం. రాహుల్‌జీ, ఇవీ నిజాలు వంటి వ్యాసాలు ఈ గ్రంథంలో లభిస్తాయి. క్రైస్తవ సోదరులు విశ్వసించే ఏసు ప్రభువును "గుడ్‌షెపర్డ్"గా ఆరాధిస్తుంటారు. అదేవిధంగా రానున్న రోజుల్లో ఇన్ని వెసులుబాట్ల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కే.సి.ఆర్‌ను యాదవులు, కురుములు సమిష్టిగా తమ పాలిట "గుడ్‌షెపర్డ్"గా కీర్తిస్తారు అనటంలో అతిశయోక్తి లేదంటారు జ్వాలా, యాదవులకు, కురుమలకు గొర్రెల పంపిణీ గురించి వివరించిన వ్యాసంలో. కొత్త భూసంస్కరణలకు నాంది, సమస్యలు లేని వ్యవస్థ కే.సి.ఆర్ ఆకాంక్ష, పీవి పుణ్యమే చిన్న కమతాలు, పాదనమస్కారం భారతీయ సంస్కారం, ఆర్థికంలో అగ్రగామి, ప్రపంచ తెలుగు మహాసభలకు చెందిన మూడు వ్యాసాలు ఈ గ్రంథంలో లభిస్తాయి. సుస్థిరత కోసమే చెరికలు, ప్రాంతీయ పార్టీలదే హవా, నిరంతర విద్యుత్ గురించి ఇందులో పూర్తి వివరాలు లభిస్తాయి. నా కుటుంబం అంటేనే తెలంగాణ, ప్రతి తెలంగాణ వ్యక్తి నా కుటుంబంలోని వ్యక్తే" అంటారు ఇండియా టుడేకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కే.సి.ఆర్. ఆ ఇంటర్వ్యూ పూర్తిగా ఈ గ్రంథంలో లభిస్తుంది. తెలంగాణ రాష్ట్రశాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానం ద్వారా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు శాసన సభ్యుల సభ్యత్వం రద్దు చేసిన అంశంపై ఒక వ్యాసంలో జ్వాలా చర్చించారు. "నాలుగేళ్ల నవ నవ్యపాలన" అనే పేరుతో ఆరుభాగాలుగా ఉన్న సుదీర్ఘ వ్యాసంలో ఆయన అనేక విషయాలను చర్చించారు. శాసనసభలో జరిగినట్లుగా, న్యాయస్థానంలో ఎవరైనా న్యాయమూర్తి మీదకు ఏదైనా వస్తువును విసిరేస్తే తత్పరిణామం ఏవిధంగా ఉండేది? అని ప్రశ్నిస్తూనే జ్వాలా గవర్నర్ పైకి మైకులు విసిరేసిన కాంగ్రెస్ శాసనసభ్యుల బహిష్కరణ కన్నా మరీ ఎక్కువ శిక్షపడేది. అందువల్ల నియంత్రణలు, సమతుల్యతలపై జాతీయస్థాయి చర్చ అవసరమంటారు ఒక వ్యాసంలో. అభివృద్ధిలో తెలంగాణ నమూనా, దేశానికి ఉత్తేజ పూరిత నూతన మార్గదర్శకత్వం కావాలి, కొంగరకలాన్ నుంచి కేసిఆర్ విస్పష్ట సందేశం,ఆపద్ధర్మం కాదు..ధర్మబద్ధమే, మానిఫెస్టోలతో తస్మాత్ జాగ్రత్త, అతిగా మాట్లాడిన అమిత్‌షా, ఎన్నికల వేళ రాజకీయ విచిత్రాలు..వ్యూహమే విజయ సోపానం, ఓటు నమోదు బాధ్యత ఓటరుదే, పథకాల అమలు విశ్వసనీయతే తెరాసకు శ్రీరామరక్ష వంటి వ్యాసాలలో అనేక విషయాలను జ్వాలా నరసింహారావు వివరించారు. చివరన ప్రభుత్వ ప్రగతి నివేదిక ఇచ్చారు. కే.సి.ఆర్ అధికారం చేపట్టిన నాటి నుండి ప్రభుత్వ రద్దు చేసేంతవరకు సాధించిన ప్రగతి నాసాంతం ఇచ్చారాయన. ఏది ఏమైనా ఒక సంపూర్ణ అవగాహనతో కే.సి.ఆర్ ప్రభుత్వం చేసిన ప్రతి పనిని, నిర్ణయాలను, సాధించిన విజయాలను సంపూర్ణంగా ఈ గ్రంథంలోని వ్యాసాలలో జ్వాలానరసింహారావు వివరించారు.

పేజీలు-385, వెల. రూ.500/-లు, ప్రతులకు జ్యోతి వలబోజు, సెల్.నెం. 8096310140.

- నియోగి
9553097319

హరిదాసు ప్రభ



సీ॥ రమ్యకాంతులు చిల్కు రాగి అక్షయపాత్ర
తలమీద కుదురుగా నిలిచియుండ
తీర్పుగా దిద్దిన తిరుమణి తిరుచూర్ణ
మలికభాగంబుపై కళలు గులుక
తీగమీటగ శ్రుతుల్ రాగాలనొలికించు
తంబురా భుజముపైడంబుచూప
'హరిలో హరీ రంగహరి' యంచు నోటను
పాటలమంజరుల్ పరిమళింప
మెడను వైజయంతీమాల మెరయుచుండ
రంగుధోవతి తనువున హంగుమీఱ
చేతచిరుతలు, కాళ్లగజ్జెలు ధ్వనింప
విమలమైన ధనుర్మాస వేళలందు
వచ్చు హరిదాసు దివ్యరూపమును కనుమ!॥

- డా॥ రామడుగు వేంకటేశ్వరశర్మ
9866944287


సంక్రాంతి శోభ

మహిలోన వెలసిన మంచుబిందువులన్ని
ఆణిముత్యంబులై అలరుచుండ
ఇంతుల కొప్పులు బంతి పువ్వులు దాల్చి
బంగారు తళుకుల భ్రాంతి గొలుప
రంగు రంగుల నవ్య రంగ వల్లులతోడ
ముంగిళ్లు మెండుగా ముదము కూర్చ
మిరప తోట లెదిగి ఎరుపైన రంగుతో
ధరియిత్రికిన్ తగు మెరుపు లిడగ.
స్వర మధురిమను సన్నాయి గురుతుజేయ
శంఖునాదంబు విని మది సంతసిల్ల
చిరుతలను గని బుడతలు చిందులేయ
వింత గూర్చుచున్ సంక్రాంతి వేగవచ్చె

- వూట్ల భద్రయ్య
9550256840

కాలం మారిన గుర్తులు

ఉదయించే సూర్యుణ్ణడిగా
నాటి సంక్రాంతి కావాలని
వేకువనే భోగిమంటల చలికాగాలని
వర్షించే మేఘాన్నడిగా
భూమమ్మకు పురుడుపోసి
మాకింత బువ్వ ఇవ్వవా అని
ఆరుగాలం పంట పండించిన రైతన్నలనడిగా
మీ కళ్లలో ఆనాటి మెరుపులేవని
ఇంటి ముంగిట రంగవల్లులనడిగా
ఆనాటి గొబ్బెమ్మలేవని
మెరిసే మెరుపుల నడిగా
ఆనాటి సంక్రాంతి కాంతులేవని
ఊరుమధ్య రామాలయంలో ఖాళీగా



వేలాడుతున్న ఇనుపకొక్కాన్నడిగా
వడ్లగింజలు తింటున్న పిచ్చుకలేవని
చెరువుగట్టుపై రావిచెట్టు కొమ్మనడిగా
ఊరంతా ఊగే ఆనాటి ఉయ్యాలలేవని
బోసిపోయిన వీధి అరుగులనడిగా
నవ్వులతో కూర్చునే వృద్ధాప్యపు హృదయాలు ఏవని
ఆవు పేడతో అలికిన ఆనాటి ఇళ్లేవని
ఆకాశాన్ని ముద్దాడే భవనాలనడిగా
తెల్లారి వాకిలిలో ఇల్లాలి ముగ్గులతో
పుడమి తల్లి చిరునవ్వులు ఏవని
సిమెంటు రహదారుల నడిగా
కొత్తల్లుళ్ల రాకలేవి అత్తమ్మల పిండివంటలేవని
బోసిపోయిన ఇంటిముంగిట వాకిళ్లనడిగా
వడపప్పు బూరెగారెలతో నీకు పెట్టే నైవేద్యాలేవని
మావూరి చివర కొలువున్న మైసమ్మ నడిగా..

- పొత్తూరి సీతారామరాజు
9948849607

గుమ్మడిపూల గొబ్బెమ్మ

పిండి ముగ్గుల్లోన ముత్యమై మెరిసింది
పున్నమి వెలుగుల వలె పూసింది
పసిడికాంతుల వర్షం చినుకుగా తోచింది,
పండంటి ముత్తైదువు మోములా ఉంది
కన్నెపిల్లల కాలిపారాణి రాణి అది
వెలకట్టలేని వన్నెల వాసంత కాంతి అది
చామంతి రంగులో చలువ చందమామ అది
పాటల నడుమ పరవశించు
పల్లెల సంస్కృతి సౌరభమది
పసుపు, కుంకుమలు అద్దిన
అందాల భరిణ అది.
పెద్ద పండుగవేళ పెద్ద దిక్కువగా ఉండే
సంక్రాంతి శోభను ముంగిళ్ళ నింపి



గొబ్బిళ్ల గోపురపు గొప్పతనం
పల్లె వాకిళ్ల వసంత శోభాతోరణం
గుమ్మడి గొబ్బిళ్ల అందం
వాకిళ్లకు తెచ్చే నిజమైన నిండుదనం.

- సింగంపల్లి శేషసాయి కుమార్
8639635907



భూమాతకు పట్టే హారతి

అనంత కాల చక్రభ్రమణంలో
ఉత్తమగతులొసగే ఉత్తరాయణానికి
అంకురార్పణం మకర సంక్రమణం

పుడమి తల్లి ప్రసవవేదనలో
పురుడు పోసుకున్న ధాన్యలక్ష్మి
పౌష్యలక్ష్మిలా తెలుగింట ప్రవేశించి
అష్టైశ్వర్యాలు అందించే ఆనందక్షణం

మొగలిపువ్వంటి మగనికోసం
ముంగిట ముగ్గుల్లో సిగ్గుల మొగ్గైన గొబ్బెమ్మలు
బొమ్మల కొలువుల్లో భోగిపళ్ల వేడుకలు,
బంతిపూల ఇంతులకు రేగుపళ్ల వాయినాలు!

హరిదాసుల సంకీర్తనలతో
హరిహరులకు అర్చనలు
హరుని వాహనం నర్తనలతో
హలధారులకు వందనాలు

భోగభాగ్యాలు తులతూగే వేళ
భోగిమంటలు అఖండజ్యోతులై
భూమాతకు పట్టే హారతి సంక్రాంతి

- బలభద్రపాత్రుని ఉదయ శంకర్
9494536524

సంక్రాంతి జిలుగులు

పుడమి తల్లి నవ్వుతోంది
పాడిపంటలతో వెలుగుతోంది!
తెలుగిళ్లు మెరుస్తున్నాయ్
వెలుగుల్ని రువ్వుతున్నాయ్!!
భోగికనుమలు తోడుగ రాగ
ముక్కనుమ కూడా వేదిక కాగా...
పిల్లా పెద్దా గొడ్డు గోదా
అన్ని అంతే అందరూ
మురిసిపోతున్నారు!!!
అందాలు, ఆనందాలు సంతసాలు, సంరంభాలు
ఉత్సాహాలు, ఉల్లాసాలు, దశదిశలు నలుదెసలు
వెలుగులవుతున్నాయ్!
జిలుగులవుతున్నాయ్!
గొబ్బెమ్మలు డుడుబసవన్నలు
'రయ్'మని ఎగిసికెళ్లే కోడిపుంజులు
హరిదాసు తత్వాలు బుడబుక్కల బూచోళ్లు



అల్లుళ్ల అలకలు మరదళ్ల సొగసులు
అన్నీ ఒకటవుతున్నాయ్
అంతా ఒకటవుతున్నాయ్
భూమాత గోమాత పూడింపబడుతున్నాయ్
ముంగిట్ల రంగవల్లులు తారాడుతున్నాయ్
పిల్లలు పెద్దలు నచ్చే పండగ
పెద్దల్ని కొలిచే పండగ
వెలుగుల పండగ జిలుగుల పండగ!
తెలుగు జిలుగుల వెలుగుల పండగ!!

- రమాప్రసాద్ ఆదిభట్ల
9348006669

సాహిత్య వార్తలు

వేంపల్లి షరీఫ్‌కు చాసో సాహితీ పురస్కారం

చాసో 104వ జయంతి సందర్భంగా చాసో సాహితీ పురస్కారాన్ని (10,000/-రూ.లు) వేంపల్లి షరీఫ్ 17వ తేదీన అందుకోనున్నారు. 17వ తేదీ సాయంకాలం 6గం.లకు గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయం, విజయనగరం నందు జరిగే సభలో డా॥భైరవభట్ల విజయాదిత్య, ఆర్ బాలకృష్ణ, డా॥కందిమళ్ల సాంబశివరావు, రెహనా, గౌరికృబానందన్, వి.దివాకర్, జి.ఎస్.చలం, చీకటి దివాకర్‌లు పాల్గొంటారు.

చేను చెక్కిన శిల్పాలు ఆవిష్కరణ

సోమేపల్లి వెంకటసుబ్బయ్య చేను చెక్కిన శిల్పాలు, ఎస్.ఎం. సుబాని సామాజిక నానీలు ఆవిష్కరణ సభ జిల్లా పరిషత్ హాలు, గుంటూరు నందు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో 20వ తేది ఉదయం 10.30గం.లకు డా॥సి. భవానిదేవి అధ్యక్షతన జరుగుతుంది. ముఖ్య అతిథిగా, ఆవిష్కర్తగా ఆచార్య ఎన్.గోపి, గ్రంథసమీక్షకులుగా కె.జె.రమేష్, పి.లక్ష్మణరావు పాల్గొంటారు.

-ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం

కేసీఆర్ వాస్తవాలు తెలుసుకో

- సీఎంకు దత్తాత్రేయ లేఖ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రా లపై కేంద్ర ప్రభుత్వ వివక్ష చూపిస్తోందంటూ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు చేసిన వ్యాఖ్యలపై బీజేపీ సీనియర్ నేత, ఎంపీ బండారు దత్తాత్రేయ లేఖ రాశారు. వాస్తవాలు తెలిసి ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు అబద్ధాలు మాట్లాడటం సరికాదని కేసీఆర్‌కు రాసిన లేఖలో దత్తాత్రేయ పేర్కొన్నారు. 15వ ప్రణాళికా సంఘం తీసుకున్న నిర్ణయం మేరకు గతంలో రాష్ట్రాలకు కేంద్రం ఇస్తున్న నిధులను 32 శాతం నుంచి 42 శాతా నికి పెంచింది వాస్తవం కాదా చెప్పాలన్నారు. టీం స్పిరిట్‌తో మోడీ పని చేస్తు న్నారని, రాష్ట్రాలకు ఉదారంగా నిధులను ఇస్తున్నారని, సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. గత సంవత్సరాలుగా ప్రజా జీవితంలో ఉన్న మీరు రాష్ట్రప్రభుత్వంలో, కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా కూడా పని చేశారని, ప్రణాళికా సంఘం ఏ విధంగా నిర్ణయాలు తీసుకుంటుందన్న విషయం తెలిసి కూడా కేంద్రంపై నిందలు వేయడం సరైంది కాదన్నారు. కేంద్రం రాష్ట్రాలకు ఇస్తున్న నిధులలో తెలంగాణలోని స్థానిక సంస్థలకు మీరెంత వరకు ఇచ్చారో ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకుంటే బాగుంటుందని పేర్కొన్నారు.

రికార్డు స్థాయిలో మెట్రో ప్రయాణికులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంక్రాంతి పండుగకు దూరప్రాంతాలు వెళ్ళే ప్రయాణికులతో హైదారాబాద్ నగరంలోని మెట్రోరైల్వే స్టేషన్లు కిటకిటలా డుతన్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఎంఎంటీఎస్ ద్వారా ప్రధాన బస్, రైల్వే స్టేషన్లకు చేరుకుంటున్నారు. 11న ఒక్కరోజే మెట్రో రైలులో 2.41లక్షల మంది ప్రయాణించారు. ఇంత మంది ప్రయాణించడం ఇదే తొలిసారని హైదరా బాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. అలాగే గత ఏడాది డిసెం బర్ 31న 2.10 లక్షల మంది ప్రయాణికులు మెట్రోరైళ్ళలో ప్రయాణించారని ఆయన తెలిపారు.

30నుంచి ఏపీ అసెంబ్లీ



తుని (తూర్పుగోదావరి), ప్రభన్యూస్ : జనవరి 30 నుంచి ఫిబ్రవరి ఏడో తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ శీతాకాల సమావేశాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఆర్థిక శాసనసభ వ్యవహారాల మంత్రి యనమల రామకృష్ణుడు వెల్లడించారు. తునిలో మాతా శిశు సంరక్షణ ఆసుపత్రిని ప్రారంభించిన అనంతరం, యనమల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరు వేలమంది దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా యనమల మాట్లాడుతూ ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు రాష్ట్ర శాసనసభ సమావేశాలను నిర్వహి స్తున్నామన్నారు. విద్య ఆరోగ్యానికి ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తుందని, ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నప్పటికీ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమా లను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి చంద్రబాబు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ముస్లింలలో ఇప్పటికైనా మార్పు రావాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు.

మన జీవనశైలిని మరవొద్దు

- పాశ్చాత్య పోకడలను వదిలిపెట్టండి
- స్వర్ణభారతి ట్రస్ట్ వార్షికోత్సవంలో ఉపరాష్ట్రపతి వెంకయ్య పిలుపు
- భిన్నత్వంలో ఏకత్వానికి చిహ్నం: కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాలపరీక్షకు నిలిచి న మన సంస్కృతి, జీవన విధానాలను మరచిపోకూడదని, మూలాలను విస్మరించకుండా పాశ్చాత్య పోకడలను వదిలిపెట్టాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు పిలుపునిచ్చారు. మన అలవాట్లు, ఆహారం అన్ని విధాలా మేలైనవని గుర్తు చేశారు. ఎన్నో వేల సంవత్సరాలుగా కాలపరీక్షలో నిలిచి...నెగ్గిన విధానాలను మన సంస్కృతి మనకు అందించిందని గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్ రెండవ వార్షికోత్సవం, సంక్రాంతి వేడుకలు ఆదివారం అత్యం త ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్, ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యానాయుడు, హైకోర్టు చీఫ్ జస్టిస్ రాధాకృష్ణన్‌లతో పాటు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లా డుతూ రైతుల పండుగైన సంక్రాంతి ఓ రైతు బిడ్డగా తనకెంతో ఆనందాన్ని ఇస్తుందని, తెలుగు లోగిళ్ళకు తొలికాంతిని తీసుకొచ్చే సంక్రాంతి పండుగలో మన ఆనందాన్ని అందరితో పంచుకోవాలనే భారతీయ భావన ఉందని ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యానాయుడు అన్నారు. ఈ సంక్రాంతి అందరి జీవితాల్లో భవ్యకాంతులు తీసుకు రావాలని, అందరికీ మంచి భవిష్యత్ లభించాలని ఆయన ఆకాంక్షించారు. పాతను వదిలి నూతన మార్గంలో పయనించాలనే తత్వంతో పాటు, మన జీవితానికి కారణమైన పూర్వీకులను స్మరించుకోవడం, వ్యవసాయంలో చేదుడుగా నిలిచేపశువులకు కృతజ్ఞతా పూర్వకంగా పూజలు చేయడం లాంటివి ఉన్నతమైన ఆలోచ నలని తెలిపారు. ప్రతి ఒక్కరూ సమాజసేవ కోసం తమ సమయాన్ని కేటాయించాలని అందులో ఉండే ఆనందం మరెం దులోనూ లభించదన్నారు. శక్తివంతమైన, ఆరోగ్య వంతమైన, సౌభాగ్య వంతమైన భారత్‌ను నిర్మించే సంకల్పాన్ని సంక్రాంతి సందర్భంగా తీసుకోవాలన్నారు. మన ఆచార వ్యవహారాలను సంస్కృతితో పాటు భారతీయ కుటుంబ వ్యవస్థను మరింత పటిష్టం చేసుకోవాలన్నదే తన సంక్రాంతి సందేశమని తెలిపారు.

తెలంగాణలో సంక్రాంతి ప్రత్యేకం : రవిశంకర్ ప్రసాద్

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ, సంక్రాంతిని ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా జరుపుకుంటారని, తెలంగాణలో సంక్రాంతి ఉత్సవాలు ప్రత్యేకతను చాటుకుంటాయన్నారు. అశోకుని కాలంలో భారతదేశాన్ని స్వర్ణభారతం అని పిలిచే వారన్నారు. స్వర్ణభారత్ పేరు వెనుక ఆలోచన ఎవరిదో తెలియదు కానీ స్వర్ణభారత్ ట్రస్ట్ మార్పు కోసం పని చేస్తోందన్నారు. భారతదేశ మూల భావన అయిన భిన్నత్వంలో ఏకత్వానికి స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రతీక అని అన్నారు. పేదలు, రైతులు, మహిళల అభివృద్ధి పట్ల వెంకయ్యానాయుడు చిత్తశుద్ధితో పని చేస్తారని, వారి క్రాంత దర్శనం గొప్పదన్నారు. అందుకే స్వర్ణభారత్ ట్రస్ట్ అంతర్జాతీయ ప్రమాణాలతో ముందుకు సాగుతోందన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని, అలాంటి వారు ప్రైవేట్ పరిశ్రమలకు కావలసిన మానవ వనరుల అవసరాలను తీర్చగలరన్నారు. యువతకు ఇది మంచి అవకాశమన్నారు. భారతదేశ గ్రామీణాభివృద్ధికి స్వర్ణభారత్‌ట్రస్ట్ ఓ మోడల్‌గా నిలిచిందని, సేవ చేయడంతో పాటు సంస్కృతి పరిరక్షణ కోసం ట్రస్ట్ చేపడుతున్న కార్యక్రమాలు ఉన్నతమైనవన్నారు.

ట్రస్ట్ భావన ఉన్నతమైంది : సీజే రాధాకృష్ణన్


స్వర్ణభారత్ ట్రస్ట్ ఆలోచన చాలా గొప్పదని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి టీబీ రాధాకృష్ణన్ అన్నారు. మహాత్మాగాంధీ, సర్దార్‌వల్లభభాయ్ పటేల్ వాంటి వారి స్ఫూర్తితో గ్రామీణ యువత, మహిళలు, రైతుల శ్రేయస్సే లక్ష్యంగా ముందుకు సాగుతున్న స్వర్ణభారత్ ద్వారా భవిష్యత్‌లో ఎంతో మంది లబ్ధిపొందాలని ఆకాంక్షించారు. గ్రామీణ భారతం నైపుణ్య భారత్‌గా మారాలని, గ్రామరాజ్యం కోసం నడుం బిగించిన ట్రస్ట్ సభ్యులకు అభినందలు తెలిపారు. నైపుణ్య శిక్షణ ద్వారా సేవ చేయడం మాత్రమే కాకుండా మన సంస్కృతి పరిరక్షణలో భాగంగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి, కళాకారులను ప్రోత్సాహం అందించే ఆలోచన అభినందనీయమన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సాంస్కృతిక కార్యక్రమాలు

ట్రస్ట్ రెండవ వార్షికోత్సవం, సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ సంస్కృతిని ప్రతింబించే విధంగా జరిగిన పేరిణి నృత్యం ఉప రాష్ట్రపతిని విశేషంగా ఆకట్టుకుంది. సునీత, శ్రీకృష్ణ పాటలు ఎంతో ఆనందాన్ని పంచాయని, అలాగే చిరంజీవి విష్ణుభట్ల కార్తిక్ పద్యాలు వింటుంటే శ్రీకృష్ణదేవరాయల భువన విజయంలో ఉన్న అనుభూతి కలిగిందని, ఎవరో మహా పండితుడు మధురంగా పాడుతున్నట్లుందని వెంకయ్యానాయుడు తెలిపారు. పేరిణి నృత్య కళాకారులు, సునీత, శ్రీకృష్ణలకు అభినందించిన వెంకయ్యానాయుడు కార్తిక్ తలిదండ్రులు శ్రీమతి లక్ష్మీదుర్గ, ఉమా కాంత్‌లకు గురువు ఘట్టి కృష్ణమూర్తికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

భారీ కాన్వాయ్‌తో ఏపీకి తలసాని!

- భీమవరం సంబురాలకు టీఆర్ఎస్ నేత
- మావుళ్లమ్మ, దుర్గమ్మల దర్శనం
- గులాబీనేత పర్యటనపై అంతటా ఆసక్తి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వేలుపెడతామని, చంద్రబాబుకు రిటర్న్‌గిఫ్ట్ ఇచ్చి తీరుతామని సంచలన ప్రకటన చేసిన తర్వాత తొలిసారి టీఆర్ఎస్ కీలకనేతల్లో వరకు భారీకాన్వాయ్‌తో ఏపీకి వెళ్తున్నారు. ఓ రోజంతా అక్కడే మకాం వేయడంతో పాటు రాత్రి కూడా బసచేయనున్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి, రాజకీయవర్గాల నుండి వచ్చే స్పందనను పసిగట్టి టీఆర్ఎస్ ఎపి ఎన్నికలకు సంబంధించి తనదైన వ్యూహాన్ని సిద్ధం చేసుకోనున్నట్లు తెలుస్తోంది. ఏపీలో పెద్దసంఖ్యలో బంధువర్గం, మిత్రులు ఉన్న టీఆర్ఎస్ ముఖ్యనేత, మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ సోమవారం ఉదయం భారీకాన్వాయ్‌తో హైదరాబాద్ నుండి విజయవాడ వెళ్ళి అక్కడ అమ్మవారి దర్శనం అనంతరం భీమవరంలో జరిగే సంక్రాంతిసంబురాల్లో పాల్గొనాలని నిర్ణయించారు. భారీ కార్లకాన్వాయ్‌తో తలసాని ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టే ప్రణాళిక రూపొందించుకోగా, అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణ రాజకీయవర్గాల్లో దీనిపై ఆసక్తి నెలకొంది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల సందర్భంగా తన నియోజకవర్గంలో ఏపీకి చెందిన ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు మకాం వేసి ఓడించే ప్రయత్నం చేశారని వారి ఎత్తులను తమ అధినేతల సహకారంతో చిత్తుచేశామని, ఇపుడు అందుకు తాము బదులు తీర్చుకోవాల్సిఉందని తలసాని తన సన్నిహితుల వద్ద అంటున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే తలసాని ప్రజల మూడ్‌ను గమనించేందుకు తన పర్యటనను ఉపయో గించుకోవొచ్చని అంచనా వేస్తున్నారు. సోమవారం ఉదయం 7గంటలకు హైదరాబాద్ నుండి విజయవాడకు బయలుదేరుతారు. 10గంటలకు ఇబ్రహీంపట్నం నుండి స్థానిక యాదవసంఘం ఆధ్వర్యంలో భారీర్యాలీగా ఇంద్రకీలాద్రి వరకు వెళతారు. 10.30కు కనకదుర్గమ్మను దర్శించు కుంటారు. విజయవాడ నుండి భీమవరం చేరుకుని అక్కడి ప్రసిద్ధ మావుళ్లమ్మను దర్శించుకుని రాత్రి అక్కడే బసచేస్తారు. మంగళవారం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు.

రాజకీయవర్గాల్లో ఆసక్తి

తెలంగాణకు చెందిన కీలకనేత, కేసీఆర్ క్యాబినెట్‌లో నాలుగేళ్ళకు పైగా మంత్రిగా పనిచేసిన తలసాని శ్రీనివాసయాదవ్ ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తుండడం రిటర్న్‌గిఫ్ట్‌లో భాగమేనా? లేక వ్యక్తిగత పర్యటనా అన్న చర్చ సాగుతోంది. దైవదర్శనాలకు మినహా తెలంగాణ టీఆర్ఎస్ నేతలు భారీకాన్వాయ్‌తో ధూంధాంగా ఏపీలో పర్యటించిన సందర్భాలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక లేకపోగా, ఇపుడు తలసాని అందులో తొలివరుసలో నిలుస్తున్నారు. తలసాని తర్వాత మరికొందరు నేతలు కూడా ఎపిలో వివిధ సంఘాల సమావేశాలకు హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

మైనర్‌పై గ్యాంగ్‌రేప్

(మొదటిపేజీ తరువాయి)

వేధింపులు భరించలేకపోయిన బాధితురాలు... చివరకు తల్లిదండ్రులకు తన బాధను చెప్పుకోవడంతో విషయం బయటకువచ్చింది. బాధితురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా పోలీసులు మీనమేషాలు లెక్కపెడుతూ నిందితులకు అనుకూలంగా వ్యవహరించడంతో జనం తిరగబడ్డారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ దారుణం హైదరాబాద్‌లో చోటు చేసుకుంది.

నగరంలోని పాతబస్తీ కామాటిపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో గొల్లాకిడికి చెం దిన ఓ మైనర్ బాలిక(16)పై 11 మంది దుండగులు సామూహిక అత్యాచారా నికి ఒడిగట్టారు. ఈ దారుణాన్ని వీడియో తీసి ఆమె ను బ్లాక్‌మెయిల్ చేస్తూ పదేపదే అత్యాచారం చేశారు. ఈ వియాన్ని ఎవరికైనా చెబితే ఇంటర్నెట్‌లో ఆ వీడియోలు పెట్టి పరువు తీస్తామని బెదరించారు. దాదాపు నాలుగేళ్లుగా వీరం తా ఆమెపై అఘాయిత్యానికి పాల్పడుతూనే ఉన్నారు. రోజురోజుకు వారి వేధింపులు ఎక్కువవడంతో భరించలేకపోయిన బాధితురాలు అసలు విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పింది. దీంతో ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గడచిన డిసెంబర్ 24న కామాటిపురా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా బాధితురాలిని వైద్య పరీక్షలకు పంపారు. అక్కడే అసలు విషయం తెలిసింది. బాలికపై నాలుగేళ్లుగా అత్యాచారం చేస్తున్నట్లు వైద్యుల పరీక్షల్లో తేలిందని, అదే విషయాన్ని తమ నివేదికలో పేర్కొన్నారని బాధితురాలి తల్లిదండ్రులు చెబుతున్నారు. అయినా నిందితులపై చర్య తీసుకోని పోలీసులు వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ బాధితురాలి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం కావాలంటూ దాదాపు 200 మంది స్థానికులు కామాటిపురా పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి ఆదివారం ఆందోళన నిర్వహించారు. దారుణానికి పాల్పడిన నిందితులను వదలిపెట్టవద్దని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. మానవమృగాలుగా మారిన 11 మందిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిందితులకు పోలీసులు సహకరిస్తున్నారని వారు ఈ సందర్భంగా ఆరోపించారు. జనం పెద్దఎత్తున ఆందోళనకు దిగడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం వేట మొదలుపెట్టారు.

నిందితులెవ్వరినీ వదలం

- అప్పుడే ముగ్గురిని అరెస్టు చేశాం: హైదరాబాద్ సీపీ అంజనీకుమార్
- మహిళా అధికారికి దర్యాప్తు బాధ్యతలు
- భరోసా కేంద్రంలో బాధితురాలి ఫిర్యాదుపై వెంటనే స్పందించాం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పాతబస్తీలోని కామాటిపురాలో మైనర్ బాలికపై గ్యాంగ్ రేప్ కేసులో ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని, ఆ తరువాత ఐదారు రోజుల్లోనే ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. ఈ కేసులో మిగతా నిందితుల కోసం గాలిస్తున్నామని, తాజా ఆరోపణల నేపథ్యంలో మహిళా అధికారి శ్రీదేవికి దర్యాప్తు బాధ్యతలు అప్పగించామని వారు వెల్లడించారు. గత నెల 24న భరోసా సెంటర్‌లో ఫిర్యాదు బాధితురాలు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని, ఆ సమయంలో ముగ్గురు నిందితుల పేర్లు చెప్పిన మైనర్ బాలిక ఇటీవల మరికొందరి పేర్లు చెప్పిందని వారు వివరించారు. 2015నుంచి ఆమెపై కొందరు అత్యాచారానికి పాల్పడ్డారంటూ ఫిర్యాదు అందిందని చెప్పారు. కేసు నమోదు చేసిన కొద్దిరోజుల్లోనే రాజస్థాన్ పరారైన ఒక నిందితుడిని అక్కడే అరెస్టు చేసి హైదరాబాద్ తీసుకువచ్చామని చెప్పారు. బాధితురాలు గతంలో భరోసా సెంటర్ ఏసీపీ నర్మద, అడిషినల్ సీపీ(క్రైమ్స్) శీకా గోయల్‌ని కలిసిందని, వారు బాధిత బాలికకు 3,4 రౌండ్లు కౌన్సిలింగ్ నిర్వహించారని, అనంతరం ఈ కేసు విచారణను సీసీఎస్‌కు అప్పగించామని చెప్పారు. కాగా ఈ కేసులో దర్యాప్తు బాధ్యతలు చేపట్టిన శ్రీదేవి... ఆదివారం కామాటిపురా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి రికార్డులను పరిశీలించారు. పోలీసులు చెబుతున్న వివరాల ప్రకారం గ్రౌండ్ ఫ్లోర్‌లో బాధిత బాలిక నివసిస్తుండగా.. ఫస్ట్‌ఫ్లోర్‌లో నిందితులు ఉన్నారని, 2015లో బాధిత బాలికకు కోక్ బాటిల్‌లో ఏదో కలిపి ఇచ్చి ఆమెపై సామూ హిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తరువాత కూడా అఘాయిత్యం చేస్తూనే ఉన్నారు. ఈ కేసులో ఎవరినీ వదిలిపెట్టేది లేదని హైదరాబాద్ పోలీసు కమిషనర్ అంజనీ కుమార్ స్పష్టం చేశారు.

త్వరలో చెన్నారెడ్డి జీవిత చరిత్ర

- బయోగ్రఫీ రాస్తున్నాం: మర్రి శశిధర్ రెడ్డి
- మాజీ సీఎం శతజయంతి కార్యక్రమంలో ప్రముఖుల నివాళి





హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ డాక్టర్ మర్రి చెన్నారెడ్డి జీవితచరిత్ర రాస్తున్నామని, త్వరలో పూర్తవుతుందని ఆయన తనయుడు, మాజీ ఎంపీ మర్రి శశిధర్ రెడ్డి చెప్పారు. చెన్నారెడ్డి శతజయంతి నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన చేశారు. కాగా ఆదివారం నాంపల్లి గాంధీ భవన్‌లోనూ, లోయర్‌ట్యాంక్ బండ్ ఇందిరాపార్క్ వద్ద మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ రాక్‌గార్డెన్‌లో ఆయన శతజయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నేతలు చెన్నారెడ్డి చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే రాక్‌గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య, మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర రావు,ఏపీ శాసనమండలి మాజీ ఛైర్మన్ చక్రపాణి, మాజీ స్పీకర్ కె. ఆర్. సురేష్‌రెడ్డి, మాజీకేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి, మాజీహోంమంత్రి, ఎమ్మెల్సీ నాయిని నరసింహారెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకటరెడ్డి, టీజేఎస్ ఎస్ పార్టీ అధ్యక్షుడు కోదండరామ్, ఎంపీలు కొండా విశ్వేశ్వరరెడ్డి, సుబ్బిరామిరెడ్డి, నంది ఎల్లయ్య, మాజీమంత్రులు జె. గీతారెడ్డి, షబ్బీర్ ఆలీ, డి. కె. సమరసింహారెడ్డి, ఎమ్మెల్సీలు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జస్టిస్ సుభా షన్‌రెడ్డి, జర్నలిస్టు సంఘం నాయకుడు కె. శ్రీనివా సరెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొని చెన్నారెడ్డి సేవలను కొనియాడారు..

చెన్నారెడ్డికి నాగుపాము ఆశీస్సులు

తన తండ్రి చెన్నారెడ్డి బయోగ్రాఫీ రాస్తున్నట్లు మర్రి శశిధర్‌రెడ్డి చెప్పారు. చెన్నారెడ్డి లాంటి రాజకీయ నేతలు బహుతక్కువ మంది ఉన్నారని అన్నారు. చెన్నారెడ్డి పుట్టినప్పుడు నుండి చనిపోయేవరకు ఆయన వెంట నాగుపాము ఉండేదన్నారు. ఆయన పుట్టినప్పుడు నాగుపాము ఆశీర్వాదం.. చనిపోయినప్పుడు కర్మకు వండిన భోజనం నాగుపాము తినడం జరిగిందని శశిధర్ రెడ్డి గుర్తు చేశారు.

చెన్నారెడ్డి మహానేత : ఉత్తమ్

తెలంగాణలో పుట్టిన మహానేత చెన్నారెడ్డి అని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి కొని యాడారు. ప్రజాస్వామ్య పారదర్శక రాజకీయాలకు చెన్నారెడ్డి ప్రతిరూపమన్నారు.

అందరివాడు : రోశయ్య

చెన్నారెడ్డి అందరివాడని, ఇచ్చినమాట తప్పేవాడు కాదని మాజీముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య కొనియాడారు. అల్పసంతోషి అయిన చెన్నారెడ్డితో కలిసి పనిచేసే అదృష్టం తనకు దక్కిందన్నారు. చెన్నారెడ్డి చేసిన పోరాటాలను పుస్తక రూపంలో తీసుకురావాలని మాజీహోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్య మంలో చెన్నారెడ్డి పాత్ర మరువ లేనిదని కొనియాడారు.

ఉద్యమానికి బీజం వేసిన వ్యక్తి: చాడా

తెలంగాణ ఉద్యమానికి బీజం వేసిన వ్యక్తి చెన్నారెడ్డి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకటరెడ్డి అన్నారు. 1969లో చెన్నారెడ్డి ప్రత్యేక ఉద్యమానికి ఆకర్షితుడై, మొదట తెలంగాణ ప్రజా సమితి పార్టీలో పనిచేశానని ఆయన చెప్పారు. చెన్నారెడ్డి జీవితంపై బయోపిక్ తీయాలని మాజీమంత్రి డాక్టర్ జె. గీతారెడ్డి ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రతి పక్షనేతలను గౌరవించే వ్యక్తుల్లో చెన్నారెడ్డి ఒకరన్నారు. చెన్నారెడ్డి బతికుంటే తెలంగాణ కాంగ్రెస్ తో తిరుగులేకపోయేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మరో మండల్ ఉద్యమం రావాలి



బీసీలకు రాజకీయ రిజర్వేషన్లే నా లక్ష్యం

- మాలో ఐక్యత లేకే అనర్థాలు
- అగ్రవర్ణ రిజర్వేషన్లు రాజకీయ ఎత్తుగడ
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బీసీలంటే గుర్తుచ్చే నాయకుడు ఆర్ కృష్ణయ్య... 45 ఏళ్లుగా బీసీల కోసం పోరాటం చేస్తున్న ఉద్యమ నేత. పదవులు వద్దనుకొని బీసీ జాతి అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడుతున్న ఆర్ కృష్ణయ్య బీసీ రాజకీయ రిజర్వేషన్ల కోసం మరోసారి మండల్ కమిషన్ ఉద్యమం రావాలని ఆకాంక్షించారు. బీసీల అనైక్యత, వెనుకబాటు తనంతో అగ్రకులాలు లబ్ధిపొందుతున్నాయని చెబుతున్న ఆర్ కృష్ణయ్యతో ఆంధ్రప్రభ ప్రత్యేక మాటామంతీ....

ఆ 10 శాతంతో మూల సిద్ధాంతానికి తూట్లు

పార్లమెంటు ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం కేంద్రం అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వే షన్లు కల్పించింది. ఈ చర్య మూల సిద్ధాంతానికి తూట్లు పొడిచేలా ఉంది. దశాబ్దాలుగా బీసీలకు రాజ కీయ రిజర్వేషన్లు కావాలని ఉద్యమిస్తున్నాం. అయినా దాని గురించి ఏ పార్టీ మాట్లాడటం లేదు.

రిజర్వేషన్ల లక్ష్యం పేదరిక నిర్మూలన కాదు

రాజ్యాంగంలో రిజర్వేషన్లను ఇచ్చింది పేదరిక నిర్మూలన కోసం కాదు. అగ్రకులాల్లో పేదలు ఉంటే వారిని ఆర్థికంగా ఆదుకోవాలి. కానీ వారికోసం రిజర్వేషన్లను అమలు చేస్తామనడం సరికాదు. సామాజికంగా ఉన్నతస్థానంలో ఉన్న అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు ఇవ్వ డాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం.

మండల్ కోసం మహోద్యమం చేశాం

బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని మండల్ కమిషన్ సిఫారసును వ్యతిరేకిస్తూ అగ్రవర్ణాలు ఆందోళనలు చేపట్టాయి.

దీంతోమండల్ కమిషన్ సిఫారసులు అమలు చేయా లని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా బీసీ ఉద్యమం సాగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 60 రోజులపాటు నిరంతరాయంగా ఉద్యమం కొన సాగింది. రిజర్వేషన్ల పరిరక్షణ సమితి ఛైర్మన్‌గా నేనే ఉన్నాను. సర్దార్ గౌతు లచ్చన్న, కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి వారితో ఆ రోజుల్లో ఉద్యమించాం. మండల్ కమిషన్ ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీలో కూడా ఉధృతంగా సాగింది.

చట్టసభల్లో రిజర్వేషన్లు సాధ్యమేనా?

1984 నుంచి ఉద్య మిస్తున్నాం. జ్ఞానీ జైల్ సింగ్ నుంచి ప్రస్తుత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వరకు ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తులు చేశాం. రాజకీయ పార్టీలకు అధినేతలు అగ్రవర్ణాలకు చెందిన వారు కావడంతో బీసీల అంశాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదు. మేం రాజ్యాధికారం చేపడితే తమ మనుగడకే ప్రమాదమన్న భయంతో అగ్రవర్ణాలు కుట్ర చేస్తు న్నాయి.

మీ లక్ష్యం ఏమిటి.. సాధించగలరా?

బీసీలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు సాధించేవరకు పోరాడుతా. నా జీవిత లక్ష్యం అదే. బీసీ రాజ్యాధికారంతోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయి. బీసీలకు అణగదొక్కడానికి అగ్రకుల రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయి. బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు ఇస్తే వారు తమను అణచివేస్తారని అగ్రకుల పార్టీలు బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు రాకుండా అడ్డుకుంటున్నారు. బీసీల్లో ఇప్పటికీ అనైక్యత ఉంది. దానిని అగ్రకుల పార్టీలు వాడుకుంటున్నాయి. బీసీల వెనుకబాటుతనాన్ని అగ్రవర్ణాలు ఉపయోగించుకుంటున్నాయి. వారిని చైతన్యం చేసి, రాజకీయంగా అవగాహన కల్పిస్తున్నాం. అంతిమంగా బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు సాధించడం జీవిత లక్ష్యం. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు చట్టబద్ధత లేదు. అందుకే బీసీ రిజర్వేషన్లపై పలుసందర్భాల్లో కోర్టుల్లో కేసులు వేస్తున్నారు. తద్వారా ప్రతిసారి బీసీలు రిజర్వేషన్లను కోసం కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇప్పుడు కేంద్రం ప్రకటించిన అగ్రవర్ణ పేదల 10 శాతం రిజర్వేషన్లపై కూడా కోర్టులో అప్పీలు చేసి ఇటు ప్రజా పోరాటంతోపాటు న్యాయపోరాటం కూడా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.



ద్రవ్యలోటు లక్ష్యం 3.3% చేరడం కష్టమే

ఆర్థికవేత్తల అభిప్రాయం



న్యూఢిల్లీ : ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటును జీడీపీలో 3.3 శాతం లక్ష్యం చేరుకోవడం ప్రభుత్వానికి అతి పెద్ద సవాలని ఆర్థికనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే జీఎస్టి వసూళ్లు తగ్గడంతో పాటు ప్రభుత్వం వ్యయం పెరిగిపోవడంతో తయారీ రంగం మందగించడం తదితర కారణాలని వీరు చెబుతున్నారు. వచ్చేది ఎన్నికల సీజన్ కాబట్టి ప్రభుత్వం వోటర్లను ఆకర్షించడానికి సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తే ద్రవ్యలోటు లక్ష్యం సాధించడం మరి కష్టంగా మారుతుందని వీరు అభిప్రాయపడుతున్నారు.కొంత మంది నిపుణులు మాత్రం ఇప్పటికే ద్రవ్యలోటు జీడీపీలో 3.5 శాతానికి చేరిపోయిందని చెబుతున్నారు. కాగా మోడీ సర్కార్ బడ్జెట్‌లో ద్రవ్యలోటును జీడీపీలో 3.3 శాతానికి పరిమితం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాగా పూర్తి సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యం నవంబర్ చివరి నాటికి 114.8 శాతానికి ఎగబాకింది. ప్రభుత్వం బడ్జెట్ అంచనా ప్రకారం ద్రవ్యలోటు లక్ష్యం రూ.6.24 లక్షల కోట్లుగా నిర్ణయించింది. ఇది ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీలో 3.3 శాతం. అయితే ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ నాటికి ద్రవ్యలోటు ఏకంగా రూ.7.16 లక్షలు దాటిపోయింది. లేదా 114.8 శాతం. క్రితం ఏడాది ఇదే కాలంలో 112 శాతం కంటే ఇది స్వల్పంగా పెరిగింది. ప్రస్తుతం ప్రభుత్వం పరోక్షపన్నుల వసూళ్లు పన్నేతర వైపు నుంచి ఒత్తిడి పెరుగుతుంది. ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాన్ని సాధించలేకపోతోంది. జీఎస్టి వసూళ్లు తగ్గడం, పెట్టుబడుల ఉపసంహరణ ముందుకు సాగకపోవడంతో ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ద్రవ్యలోటు జీడీపీలో 3.4 శాతానికి ఎగబాకవచ్చునని మూడీస్ ఇన్వెస్టర్ సర్వీస్ వైస్ ప్రెసిడెంట్ సావరిన్ రిస్క్ గ్రూపు విలియమ్ పోస్టర్ చెప్పారు. వ్యవసాయరంగంపై ప్రభుత్వం పెద్దమొత్తంలో వ్యయం చేయడంతో పాటు రుణమాఫీలు, సబ్సిడీ భారం తదితర అంశాలు కలిసి ద్రవ్యలోటుపై ఒత్తిడి పెంచుతాయని చెబుతున్నారు. వరుసగా రెండో సంవత్సరం కూడా ద్రవ్యలోటు లక్ష్యాన్ని సాధించకపోవడంతో రేటింగ్‌పై ప్రభావం చూపుతుందంటున్నారు. ఇండియా రేటింగ్ అంచనా ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యం కంటే అదనంగా రూ.39, 900 కోట్లకు చేరుతుందని అంచనా. కాగా ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు రూ.6.67 లక్షలకోట్లకు చేరుతుందని, బడ్జెట్ అంచనా రూ.6.24 లక్షల కోట్లు. 2018 ఆర్థిక సంవత్సరంలో సవరించి ద్రవ్యలోటు లక్ష్యం రూ.5.92 లక్షల కోట్లు అంటే జీడీపీలో ఇది 3.5 శాతంగా తేలింది.

త్వరలో ఏరో ఇండియా షో-2019

హైదరాబాద్,ఆంధ్రప్రభ: త్వరలో హైదరాబాద్ నగరం కేంద్రంగా ఏరో ఇండియా షో-2019 జరగనున్నట్టు అపోలో మైక్రోసిమ్స్ ఎండి బద్దం కరుణాకర్ రెడ్డి తెలిపారు. దేశంలోనే ప్రధానమైన ఏరోస్పేస్ ,డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్, ఔట్ సోర్సింగ్ సప్లయ్ చైన్‌కు చెందిన ఏరో డిఫెన్స్ షో ప్రతిష్టాత్మక ఈవెంట్‌గా జరగనుందన్నారు. ఈ షోలో మైక్రోసిస్టమ్స్ కూడా పాల్గొనుందన్నారు. బెగుళూరులో కూడా ఏరో ఇండియా షోలో అపోలో మైక్రో సిస్టమ్స్ పాల్గొనను న్నట్టు తెలిపారు. ఈ షోలో 549 కంపెనీలు పాల్గొంటాయని అందులో 279 విదేశీ కంపెనీలు , 270 భారతీయ కంపెనీలు పాల్గొనబోతున్నట్టు కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు.

వినియోగదారుడికి ఊరట!


•జీఎస్టీ చార్జీ వసూలు నిలిపివేత •డీలర్లకు రెవెన్యూశాఖ ఆదేశాలు •అమలుపై ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆలోచన •జీఎస్టీ ఎగవేతకు చెక్



న్యూఢిల్లీ : వినియోగదారుడి ప్రయోజనాలు కాపాడేందుకు కేంద్రప్రభుత్వం జీఎస్టిలో కొన్ని చర్యలకు శ్రీకారం చుట్టడానికి ప్రణాళికలు రూపుదిద్దుతోంది. ముఖ్యంగా కాంపోజిషన్ డీలర్లు వినియోగదారుడి నుంచి జీఎస్టి వసూలు చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోబోతోంది. (కాంపోజిషన్ డీలర్) అంటే ఏడాదికి రూ.1 కోటి టర్నోవర్ చేసే వ్యాపారిగా చెప్పుకోవచ్చు. ఇక నుంచి కాంపోజిషన్ డీలర్ లేదా సర్వీస్ ప్రొవైడర్ తమ ఇన్వాయిస్‌లో జీఎస్టి రిజిస్ట్రేషన్ నెంబర్ స్టాటస్ ప్రకటించాల్సి ఉంటుంది. కొత్త పద్ధతి అమల్లోకి వస్తే కాంపోజిషన్ డీలర్లు .. కొనుగోలుదార్ల నుంచి జీఎస్టి వసూలు చేసి వాటిని ప్రభుత్వ ఖాతాకు జమచేయకుండా తప్పించుకోవడానికి వీల్లేకుండా పోతుంది. ప్రస్తుతం ఈ కాంపోజిషన్ డీలర్లు కస్టమర్ల నుంచి జీఎస్టి వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమచేయకుండా దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలియజేశారు. దీంతో పాటు రెవెన్యూశాఖ వినియోగదారుడికి దీనిపై అవగాహన కల్పించేందుకు పెద్దెత్తున ప్రచారం మొదలుపెడుతుంది. డీలర్లు కాంపోజిషన్ స్కీం కిందికి రావాలనుకునే వారుమాత్రం కొనుగోలుదారుడి నుంచి జీఎస్టి వసూలు చేయాల్సిన అవసరం లేదని అధికారి వివరించారు.

జీఎస్టి కాంపో జిషన్ స్కీం కిందికి వచ్చే ట్రేడర్లు, తయారీదార్లు వస్తువులపై కేవలం ఒక శాతం జీఎస్టి చెల్లిస్తే సరిపో తుంది. లేదంటే ఆయా వస్తువు ప్రకారం 5, 12 లేదా 18 శాతం వరకు పన్ను విధిస్తారు. అలాంటి డీలర్లు కూడా కొనుగోలుదారుడి నుంచి జీఎస్టి వసూలు చేయడానికి అనుమతించమని ప్రభుత్వం ఉన్నతాధికారి వివరించారు. ఇదిలా ఉండగా దేశంలో పెద్దమొత్తంలో కాంపోజిషన్ డీలర్ల సంఖ్య పెరిగిపోతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. వీరంతా వినియోగదారుడి నుంచి జీఎస్టిలో అత్యధిక రేటును వసూలు చేసి, ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాకు డిపాజిట్ చేయడం లేదని తెలిసిందని అధికారి వివరించారు. ప్రస్తుతం సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ) కొత్త ప్రతిపాదనలు తీసుకురావాలని అధ్యయనం చేస్తోంది. దీని ప్రకారం వ్యాపారులు.. తమ ఇన్వాయిస్‌లో తాము కాంపోజిషన్ డీలర్లమని స్పష్టంగా ప్రకటించాల్సి ఉంటుంది. కాబట్టి ఈ డీలర్లు వినియోగదారుడి నుంచి జీఎస్టి వసూలు చేయడానికి వీలుండదని పేర్కొంది. దీనిపై వినియోగదారుడికి అవగాహన కల్పిస్తామని, కాంపోజిష్ స్కీం డీలర్ల నుంచి వస్తువులు కొనుగోలు చేస్తే మాత్రం జీఎస్టి చెల్లించాల్సిన అవసరం లేదని అధికారులు వివరించారు. చిన్న చిన్న వ్యాపారులకు తమ ఖాతా పుస్తకాల్లో పన్ను తలనొప్పులు తగ్గించేందుకు ప్రభుత్వం జీఎస్టి చట్టంలో కాంపోజిషన్ స్కీం తీసుకొచ్చింది.

దాని ప్రకారం వ్యాపారులు, తయారీదార్లు వారి వార్షిక టర్నోవర్ రూ.1 కోటి వరకు ఉంటే కేవలం ఒక శాతం జీఎస్టి చెల్లిస్తే చాలని... కాగా ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి దీని పరిమితిని రూ. 1.5 కోట్లకు పెంచుతామని ప్రకటించింది. ఈ నెల 10న జరిగిన జీఎస్టి కౌన్సిల్ సమావేశం ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలో జరిగింది. ఈ సమావేశంలో సర్వీస్ ప్రొవైడర్లు, వ్యాపారులు ఏడాదికి రూ.50 లక్షల టర్నోవర్ సాధించే వారు కాంపోజిషన్ స్కీంకు మారిపోవడానికి అనుమతిస్తున్నట్లు తెలిపారు.



జీఎస్టీకౌన్సిల్‌పై యనమల గరం గరం!

రాష్ట్రాలతో సంప్రదింపులు జరపకుండా ఎజెండా తయారు



జీఎస్టి కౌన్సిల్ పనితీరుపై ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి యనమల యనమల రామకృష్ణుడు ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాలతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండానే జీఎస్టి కౌన్సిల్ ఏజెండాలో పలు అంశాలను పొందుపరుస్తోందని ఆరోపించారు. తాజాగా డిసెంబర్ 10వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో కొన్ని వస్తువులపై మినహాయింపులు, పన్ను రేట్లు తగ్గించారు. దీనిపై రాష్ట్రాలతో చర్చలు జరపలేదు. రాష్ట్రాల ఇబ్బందులు రాష్ట్రాలకున్నాయి. వీటిపై చర్చించేందుకు అవకాశం ఇవ్వడం లేదన్నారు. అయినా కొన్ని అంశాలపై కౌన్సిల్‌కు పలు లేఖలు రాశామని అన్నారు. ఇక నుంచి జీఎస్టి కౌన్సిల్ ఏదైనా నిర్ణయం తీసుకొనే ముందు రాష్ట్రాలతో చర్చలు జరిపిన తర్వాతనే తుది నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కంపోజిషన్ టర్నోవర్ పరిమితిని రూ.1 కోటి నుంచి రూ.1.50 కోట్ల పెంపు ప్రతిపాదనకు మద్దతు పలికారు. ఈ పరిమితిలోకి వచ్చే చిన్న వ్యాపారులు లబ్ధి చేకూరుతుందని.. చిన్న మొత్తంలో పన్ను చెల్లించే వారికి పన్ను ఖాతాలు నిర్వహించే బెడద తప్పుతుందన్నారు. రెవెన్యూ నష్టపోతున్న రాష్ట్రాలకు కేంద్రం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐజీఎస్టి కింది సుమారు రూ. 7,000 కోట్ల వరకు కేంద్రం బకాయిలు చెల్లించాల్సి ఉందని, వీటిని ఎలాంటి జాప్యం చేయకుండా సర్దుబాటు చేస్తే ఆంధ్ర ప్రదేశ్‌కు రూ. 100 కోట్ల వరకు నిధులు రావచ్చునని అన్నారు.

రాష్ట్రాల రెవెన్యూ తగ్గింది!

కేంద్రప్రభుత్వం జులై1, 2017 నుంచి కొత్తగా తీసుకొచ్చిన పరోక్ష పన్నుల వ్యవస్థ (జీఎస్టి) అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రాలకు రెవెన్యూ బాగా తగ్గిపోయింది. రెవెన్యూ వసూళ్లు పెంచుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో బీహార్ ఉపముఖ్యమంత్రి సుశీల్ మోడీ నేతృత్వంలో ఏడుగురు సభ్యుల కమిటీ ఏర్పడిందని జీఎస్టి కౌన్సిల్ నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఇదిలా ఉండగా జీఎస్టి కౌన్సిల్ సమావేశం ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ నేతృత్వంలో గతేడాది డిసెంబర్ 22న జరిగింది. ఈ సమావేశంలోనే గ్రూప్ ఆఫ్ మనిస్టర్స్ (జీఓఎం)ను ఏర్పాటు చేసి, జులై 2017 నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్టి తర్వాత రాష్ట్రాల్లో రెవెన్యూ వసూళ్లు తగ్గడంపై మంత్రుల బృందం విశ్లేషిస్తుందని చెప్పారు. జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత దేశంలోని పలు రాష్ట్రాలు .. పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, జమ్ము-కశ్మీర్, ఒడిషా, గోవా, బీహార్, గుజరాత్, ఢిల్లీల్లో రెవెన్యూ వసూళ్లు బాగా తగ్గముఖం పట్టాయి. గతేడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు ఈ రాష్ట్రాల రెవెన్యూ 14-37 శాతం వరకు తగ్గముఖం పట్టాయి. కేంద్ర పాలిత ప్రాంతాలు పుదుచ్చేరి విషయానికి వస్తే గరిష్ఠంగా 43 శాతం వరకు రెవెన్యూ వసూళ్ల కొరతతో సతమతమవుతోంది. దీనిపై సుశీల్ మోడీ కమిటి ముందుగా ఎకనోమెట్రిక్, స్టాటిస్టికల్ టూల్స్‌ను వినియోగించి గణాంకాలను అధ్యయనం చేస్తుంది. అటు తర్వాత ఎలాంటి విధానాలు అవలంబించాలి / విధానపరమైన జోక్యం చేసుకొని.. వీలైనంత వరకు రాష్ట్రాలకు రెవెన్యూ వసూళ్లు పెంచేందుకు చర్యలు సూచిస్తోంది. ముఖ్యంగా పెద్దమొత్తంలో రెవెన్యూ తగ్గిన రాష్ట్రాలకు వసూళ్లు పెంచేందుకు చర్యలు

ఎలా ఆదుకోవాలో ఆలోచిస్తాం

సుశీల్ మోడీ నేతృత్వంలో కమిటీ

తీసుకుంటుంది. దీంతో పాటు జీఎస్టి అమల్లోకి రాకముందు ఆయా రాష్ట్రాల రెవెన్యూ వసూళ్లు ఏ విధంగా ఉన్నాయో కూడా మోడీ కమిటి అధ్యయనం చేస్తుంది. అలాగే ఆర్థిక వ్యవస్థకు కీలకంగా ఉన్న అతి పెద్ద రంగాలు వాటిలో సేవల రంగంలో కూడా నిర్మాణాత్మకమైన మార్పులు చేయాలనే ఆలోచనలో ఉంది. రెవెన్యూ వసూళ్లు తగ్గడానికి గల కారణాలను గుర్తించి, వాస్తవంగా ఎంత రెవెన్యూ రావాలో అధ్యయనం చేసి వసూళ్లు పెంచుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో కూడా కమిటి చర్యలు తీసుకుంటుంది. సుశీల్‌మోడీ నేతృత్వంలో ఏర్పడిన కమిటిలో సభ్యుల విషయానికి వస్తే పంజాబ్ ఆర్థికమంత్రి మన్‌ప్రీతిసింగ్ బాదల్, కేరళ ఆర్థికమంత్రి థామస్ ఇసాక్, కర్నాటక గ్రామీణాభివృద్ధి మంత్రి కృష్ణ బైరేగౌడ్, ఒడిషా ఆర్థికమంత్రి శశిభూషన్ బెహెరా, హర్యానా పన్నుల మంత్రి కెప్టెన్ అభిమన్యు, గోవా పంచాయతీఆరజ్ మంత్రి మౌవిన్ గోడి నోదేశంలోని మొత్తం 31 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఐదు ఈశాన్య రాష్ట్రాలు, మిజోరాం, ఆంధ్రప్రదేశ్, మణిపూర్, సిక్కిం, నాగాలాండ్‌లు మాత్రం జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత రికార్డుస్థాయిలో రెవెన్యూ వసూళ్లు పెరిగాయి. ఇదిలా ఉండగా కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకు గత ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు మొత్తం రూ.48,202 కోట్లు జీఎస్టికాంపన్‌సెషన్ కింద విడుదల చేసింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం రూ.48,178కోట్లు విడుదల చేసింది. ఇదిలా ఉండగా కేంద్రప్రభుత్వం జులై 1, 2017 నుంచి జీఎస్టి అమల్లోకి తెచ్చింది. జీఎస్టి చట్టం ప్రకారం .. జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత రెవెన్యూ నష్టపోతున్న రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం ఈ నష్టాన్ని భరిస్తుంది.. పరిహారం ఇస్తుంది. 2015-16 ఆర్థిక సంవత్సరాన్ని బేస్ సంవత్సరంగా తీసుకొని పన్ను వసూళ్లు ఎలా ఉన్నాయో అధ్యయనం చేసి 14 శాతం వరకు పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది.

కార్పొరేట్ పన్నులో కోత విధించండి

•ఫిక్కి బడ్జెట్ ముందస్తు విన్నపం •కార్పొరేట్ టాక్స్ 30 నుంచి 25 శాతానికి తగ్గించండి

FICCI
FEDERATION OF INDIAN CHAMBERS OF COMMERCE AND INDUSTRY

న్యూఢిల్లీ : ఫిబ్రవరి 1వ తేదీన లోకసభలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో కార్పొరేట్ పన్నులో కోత విధించాలని పారిశ్రామిక మండలి ఫిక్కీ ప్రభుత్వానికి సూచించింది. టర్నోవర్ ప్రాతిపదికగా తీసుకోకుండా ఫ్లాట్‌గా 25 శాతానికి పరిమితం చేయాలని సూచించింది. కార్పొరేట్ టాక్స్ తగ్గిస్తే దేశ ఆర్థిక వ్యవస్థపుంజుకోవడంతో పాటు ప్రభుత్వానికి పన్ను వసూళ్లు మెరుగుపడతాయని పేర్కొంది. అలాగే వ్యక్తిగత ఆదాయం శ్లాబ్ పన్నును కూడా సవరించాలని సూచించింది. ఏడాదికి రూ.20 లక్షల కంటే ఎక్కువ ఆదాయం సంపాదించే వారి నుంచి 30 శాతం పన్ను వసూలు చేయాలని సూచించింది. ప్రస్తుతం అత్యధికంగా పన్ను వసూలు చేయడం వల్ల ఉత్పత్తి వ్యయం పెరిగిపోతోందని.. దీంతో అదనపు నిధులు లేక వ్యాపారాలను విస్తరించుకోలేకపోతున్నామని పేర్కొంది. కార్పొరేట్ టాక్స్ 30 శాతం దీంతో పాటు డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ టాక్స్ 20 శాతం కలుపుకుంటే కంపెనీలకు పన్నుల భారం ఎక్కువగా ఉంటుందని ఫిక్కీ ప్రకటనలో వివరించింది.

2019-20 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ ముందస్తు సూచనల్లో భాగంగా ప్రపంచంలోని పలు కీలక దేశాలు గణనీయంగా పన్ను తగ్గిస్తున్నాయని, భారత్‌కూడా అన్నీ రకాల వ్యాపారాలపై పన్ను తగ్గించాలని ఫిక్కీ కోరింది. ప్రస్తుతం (మ్యాట్) మినిమమ్ ఆల్టర్‌నేట్ టాక్స్ అత్యధికంగా 18.5 శాతంగా ఉందని.. దాన్ని తగ్గించాలని కోరింది. మ్యాట్ భారాన్ని క్రమంగా తగ్గించకుంటూపోయి, అటు తర్వాత దశలవారీగా రాయితీలను ... పన్ను రాయితీలను పూర్తిగా ఎత్తివేయాలని ఫిక్కీ ప్రకటనలో సూచించింది. ఆదాయపు పన్ను చట్టం పరిధిలో ఆదాయపుపన్ను పరిమితిని రూ.3 లక్షలకు పెంచాలని సూచించింది. కాగా ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఫిబ్రవరి 1వ తేదీన పార్లమెంటులో తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెడతారు.

డాక్‌ప్రైమ్ డాట్‌కామ్ సేవలు

doc prime

హైదరాబాద్ : ఆరోగ్య సంరక్షణను అందరికీ అందు బాటులోకి తెచ్చేందుకు, పాలసీ బజార్ గ్రూపు తాజా వెంచర్ డాక్‌ప్రైమ్ డాట్‌కామ్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించింది. అటు నుంచి దక్షిణాది రాష్ట్రాలకు విస్తరిస్తామని సీఈవో అశిష్‌గుప్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఇక హైదరాబాద్ విషయానికి వస్తే.. 2,500 మందికి పైగా వైద్యులు, శక్తిమంతమైన ల్యాబ్స్ నెట్‌వర్కుతో సేవలను అందిస్తుందన్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో తన సేవలను ప్రారంభించింది. ఈ ఏడాది చివరి నాటికి దక్షిణాదికి విస్తరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఢిల్లీ, నేషనల్ క్యాపిటల్ రీజియన్‌తో పాటు 34 పట్టణాల్లో సేవలను అందిస్తోంది. దేశవ్యాప్తంగా 20వేల వైద్యులు, 5వేలకు పైగా డయాగ్నిస్టిక్ ల్యాబ్‌లో రాయితీ ధరలకే ఉచిత ఆన్‌లైన్ కన్సల్టేషన్ మరియు అపాయింట్‌మెంట్‌లను బుక్ చేసుకునేందుకు సౌలభ్యం కల్పించేందుకు డాక్‌ప్రైమ్ డాట్‌కామ్ శ్రీకారం చుట్టింది. వచ్చే మూడేళ్లలో ప్రివెంటివ్ హెల్త్‌కేర్‌పై సుమారు 15 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆయన తెలిపారు.

డిక్కి తెలంగాణ చాప్టర్ ప్రెసిడెంట్‌గా కే. రవికుమార్ బాధ్యతలు స్వీకరణ



హైదరాబాద్ : దళిత ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (డిక్కీ) తెలంగాణ చాప్టర్ ప్రెసిడెంట్‌గా కె రవికుమార్ ప్రమాణస్వీకారం చేశారు. ఆయనతో పాటు పది మంది దళిక వ్యాపారవేత్తలు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. కాగా డిక్కీని 2005లో స్థాపించారు. దీని ప్రధాన ఉద్దేశం దళిత వ్యాపారవేత్తలను ప్రోత్సహించేందుకు దళిత చాంబర్ ఆఫ్ కామర్స్‌ను ఏర్పాటు చేయడం. కొత్తగా ఏర్పడిన బాడీ ఇలా ఉంది. అధ్యక్షుడుగా కాథరపాక రవికుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా బానోత్ రమేశ్ నాయక్, ఉపాధ్యక్షులుగా మునీధర్, అరుణా దాసరిలను ఎన్నుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ చాప్టర్ డిక్కి ప్రెసిడెంట్ రాహుల్ కిరణ్ దక్షిణాది వైస్ ప్రెసిడెంట్‌గా పదోన్నతి పొందారు.

టయోటా వెర్షన్ బలెనో

•వచ్చే ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థం విడుదల



న్యూఢిల్లీ : జపాన్‌కు చెందిన ఆటో దిగ్గజం టయోటా వచ్చే ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో మారుతి సుజుకి చెందిన ప్రీమియం హెచ్ బ్యాక్ బలెనో లాంటి మోడల్‌ను టయోటో విడుదల చేయబోతున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. భారత్ మార్కెట్లో మారుతి సుజుకి బలెనో విజయవంతమైన విషయం తెలిసిందే. అయితే టయోటాకు చెందిన బలెనోలో వినూత్నమైన ఫీచర్లను అందించాలని చూస్తోంది. గతేడాది మార్చిలో రెండు జపనీస్ కంపెనీలు ఒక ఒప్పందానికి వచ్చాయి. హైబ్రిడ్‌తో పాటు ఇతర వాహనాలను భారత్ మార్కెట్లో విడుదల చేయాలనే నిర్ణయానికి వచ్చాయి. ఒప్పందం ప్రకారం సుజుకి ప్రీమియం హెచ్ బ్యాక్ బలెనో, విటారా బ్రెజ్జాను టయోటాకి సరఫరా చేస్తుంది. దీనికి వ్యతిరేకంగా టయోటా సెడాన్ కరోలాను సుజుకికి సరఫరా చేస్తుంది. ఇదిలా ఉండగా వచ్చే ఆర్థిక సంవత్సరం టయోటా తన వెర్షన్ బలెనోను భారత్ మార్కెట్లో విడుదల చేస్తుంది. ప్రస్తుతం ఉన్న బలెనో స్థానంలో టయోటో చేతిలో కొత్త ఆకర్షణీయమైన లుక్స్‌తో మార్కెట్లో ఇస్తోంది. దీనిపై టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకెఎం) టయోటా భారత్ అనుబంధ సంస్థ స్పందించడానికి నిరాకరించింది.

రూ.3,600 కోట్లు వెనక్కి

•9 ట్రేడింగ్ సెషన్‌లతో విదేశీ పెట్టుబడులు •ఆచితూచి వ్యవహరిస్తున్న విదేశీ ఇన్వెస్టర్లు •ఎన్నికల నేపథ్యంలో వేచిచూసే ధోరణి



న్యూఢిల్లీ : విదేశీ ఇన్వెస్టర్లు ఈ నెల తొమ్మిది ట్రేడింగ్ సెషన్‌లలో రూ.3,600 కోట్లు స్టాక్ మార్కెట్ల నుంచి తరలించుకుపోయారు.

భారత్ మార్కెట్లో పెట్టుబడుల గురించి ఆచితూచి వ్యవహరిస్తున్నారు. అంతకు ముందు నవంబర్, డిసెంబర్ నెలలో ఇదే విదేశీ ఇన్వెస్టర్లు దేశీయ స్టాక్ మార్కెట్లో రూ.8,584 కోట్ల పెట్టుబడులు పెట్టాయి. డిపాజిటరీస్ నుంచి లభించిన గణాంకాల ప్రకారం ఎఫ్‌పీఐలు ఈ నెల 1-12వ తేదీ వరకు విదేశీ ఇన్వెస్టర్లు రూ.3,677 కోట్లు తరలించుకుపోయినట్లు పేర్కొంది. అయితే ఈ నెలలోనే 1-12వ తేదీ వరకు డెట్ మార్కెట్లో రూ.1,872 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టాయి. మొత్తానికి కొత్త సంవత్సరంలో విదేశీ ఇన్వెస్టర్లు దేశీయ మార్కెట్ల నుంచి పెట్టు బడులు తరలించుకుపోవడం శుభపరిణామం కాకపోయినా.. ఇప్పటి కిప్పుడే దీనిపై ఒక నిర్ణయానికి రావడం కూడా తొందరపాటు చర్యే అవుతుంది. అయితే ఎఫ్‌పీఐలు మాత్రం భారత్ మార్కెట్లో పెట్టుబడులపై జాగ్రత్త వహిస్తూ.. వేచి చూసే ధోరణిని అవలంబిస్తున్నారని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

ఇక రాబోయే రోజుల్లో ఎఫ్‌పీఐ పెట్టుబడుల విషయానికి వస్తే వచ్చే తాత్కాలిక బడ్జెట్‌పై ఎక్కువ ఫోకస్ ఉంటుంది. దీంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ.... ఈ ఏడాది వేసవిలో లోకసభకు సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో పాటు డాలర్ మారకంతో రూపాయి, ముడి చమురు ధరలు మార్కెట్లపై ప్రభావం చూపుతాయని, గ్లోబల్ ట్రేడ్ వార్ ప్రభావం విదేశీ పెట్టుబడులపై ఎక్కువ ప్రభావం చూపుతుందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి చూస్తే ఈ ఏడాది మార్కెట్లు ఒడిదుడుకులకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని, వడ్డీరేట్లు పెంపు, డాలర్ స్థిరంగా లేకపోవడం తదితర అంశాలు స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపుతాయని, ఇక భారత్ మార్కెట్ల విషయానికి వస్తే .. అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చుకుంటే భారత్ మార్కెట్లో తక్కువ ఒడిదుడుకుల కు గురయ్యే అవకాశాలున్నాయని, రాజకీయ ... ఒడిదుడుకలున్నా.. అవి స్వల్ప కాలమే ఉంటాయని చెబుతున్నారు. అయితే పెట్టుబడులకు భారత్ మార్కెట్లో అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని, కాబట్టి రాబోయే నెలలో విదేశీ పెట్టుబడులు జోరందుకొనే అవకాశాలను కొట్టిపారేయలేమని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ద్రవ్యోల్బణం.. క్యూ3 ఫలితాలే కీలకం

• ఈ వారం మార్కెట్ • రిల్, విప్రో ఫలితాలు ఈ వారంలోనే •మార్కెట్ నిపుణుల అంచనా



న్యూఢిల్లీ : ఈ వారం స్టాక్ మార్కెట్లను ముందుకు నడిపించేఅంశాల విషయానికి వస్తే రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు, వివిధ కంపెనీల క్యూ3 ఫలితాలని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ వారంలో అతి పెద్ద కంపెనీలు రిల్, విప్రో లాంటి బ్లూచిప్ కంపెనీలు ఫలితాలను వెల్లడించనున్నాయి. దీంతో పాటు డాలర్ మారకంతో రూపాయి, ముడిచమురు ధరలు, స్టాక్ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు తదితర అంశాలు మార్కెట్లను ముందుకు నడుపనున్నాయి. రాబోయే వారాల్లో మార్కెట్లను నడిపించేది మాత్రం క్యూ3 ఫలితాలే. ఈ వారంలోనే రిటైల్ ద్రవ్యోల్బణంతో పాటు టోకు ద్రవ్యోల్బణం గణాంకాలు వెలువడనున్నాయి. దీని ప్రభావం మార్కెట్లపై ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక సోమవారం నాడుస్టాక్ మార్కెట్లో ఇన్ఫోసిస్ షేరు ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సింది. శుక్రవారం నాడు మార్కెట్ ముగిసిన తర్వాత ఇన్ఫీ ఫలితాలను వెల్లడించింది. క్యూ3 నికరలాభంలో 30 శాతం క్షీణించింది. కంపెనీ వ్యయం పెరిగిపోవడంతో దాని ప్రభావం లాభాలపై కనిపించింది. అయినా రూ. 8,260 కోట్లతో షేర్లను బైబ్యాక్ చేస్తామని ప్రకటించింది. 13 నెలల కాలంలో బైబ్యాక్ ప్రకటించించడం ఇది రెండవసారి. ఈ వారంలోనే అతి పెద్ద కంపెనీలు రిల్, విప్రోలు ఫలితాలు ప్రకటించబోతున్నాయి. అలాగే గత వారం స్టాక్ మార్కెట్లు ముగిసిన తర్వాత పారిశ్రామికోత్పత్తి గణాంకాలు విడుదల అయ్యాయి. నవంబర్ నెల పారిశ్రామికోత్పత్తి గణాంకాలు 17 నెలల కనిష్ఠానికి 0.5 శాతానికి దిగివచ్చింది. ముఖ్యంగా తయారీరంగంతో పాటు కన్స్యుమర్, క్యాపింటల్‌గూడ్స్ రంగం కుంగడంతో దాని ప్రభావం మొత్తం పారిశ్రామికోత్పత్తి గణాంకాలపై కనిపించింది.

ఐఐపీ గణాంకాలపై స్టాక్ మార్కెట్లు సోమవారం నాడు ఎలా స్పందిస్తాయో చూడాల్సిందే. ఇక ముడిచమురు ధరల విషయానికి వస్తే ఇటీవల కాలంలో క్రమంగా పుంజుకుంటున్నాయి. దాని ప్రభావం గ్లోబల్ మార్కెట్లపై కనిపిస్తోంది. గత వారం సెన్సెక్స్ 314.74 పాయింట్లు లాభపడి 36,009.84 వద్ద, నిఫ్టీ 67.60 పాయింట్లు లాభపడి 10,794.95 వద్ద స్థిరపడింది.

ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వెనుకబడిన తరగతుల(బీసీ) ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి దేశంలో గానీ, రాష్ట్రంలో గానీ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించలేదని సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య గుర్తు చేశారు. ఆదివారం సంఘం కార్యవర్గ సమావేశం మన్నె వెంకటేష్ అధ్యక్షతన బీసీ భవన్‌లో జరిగింది. సమావేశంలో గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, గుడి రామకృష్ణ విట్టాల్, కోట్ల శ్రీనివాస్, మహేందర్ గౌడ్, విశ్వేశ్వరరావు, ఉదయ్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో బీసీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న ఉన్నతస్థాయి క్లాస్-1 ఉద్యోగుల్లో బీసీలు 8 శాతం కూడా దాటలేదన్నారు. అదేవిధంగా కేంద్రంలోని ఉద్యోగుల్లో బీసీలు 16 శాతం కూడా లేరన్నారు. దేశంలో 56 శాతం ఉన్న బీసీలకు ఇంత అన్యాయం జరుగుతోందన్నారు. బీసీలకు రిజర్వేషన్లను పెంచడానికి కేంద్రానికి మనసు రాదు కానీ అగ్రకులాలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి మాత్రం రాజ్యాంగ సవరణ చేశారని మండిపడ్డారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ల కోసం ఉద్యమం తీవ్రం చేయాల్సి వస్తుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు.

పదవీ విరమణ పెంపుపై ఉత్తర్వులివ్వాలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితి పెంపుపై ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ డిమాండ్ చేసింది. పదవీ విరమణ వయస్సు 61 సంవత్సరాలకు పెంచే విషయంలో స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ రాములు ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు.

పాఠశాలల బాధ్యత తల్లిదండ్రులదే



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రభుత్వ పాఠశాలలను నిర్వహించే బాధ్యత ఆ పాఠశాలలో చదివే పిల్లల తల్లిదండ్రులదేనని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నేతలు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల తల్లిదండ్రులతో నియమించే స్కూల్ మేనేజింగ్ కమిటీనే ఆ బాధ్యతను నిర్వర్తించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాడి రాజన్న అన్నారు. సంఘం రూపొందించిన 2019 క్యాలెండర్‌ను సంఘం నేతలు ఆదివారం జిన్నారం మండలం మెర్రిగూడ గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో ఆవిష్కరించారు.

పీఆర్‌సీలో న్యాయం చేయాలి

- ఎస్‌జీటీ ఫోరం తెలంగాణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాబోయే పీఆర్‌సీలో సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్‌జీటీ)కు వేతనంలో న్యాయం జరిగేలా చూడాలని ఎస్‌జీటీ ఫోరం తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అదేవిధంగా సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఖమరుద్దీన్ డిమాండ్ చేశారు. ఎస్‌జీటీ ఫోరం ఏపీ, తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం సమావేశం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. సమావేశంలో ఏపీ అధ్యక్షులు సీహెచ్ శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రారెడ్డి, అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్‌తోపాటు ఇతర నేతలు పాల్గొన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో ఓటు హక్కు కల్పించాలని సమావేశం తీర్మానం చేసిందని తెలిపారు. ఇందుకోసం జాతీయ స్థాయిలో ఉద్యమం చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. పండితుల అప్‌గ్రేడేషన్‌లో అర్హతలున్న ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలని.. ఇందుకోసం విద్యా హక్కు చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు.

జిల్లాకు 10మంది పారిశ్రామికవేత్తలు

- డిక్కీ తెలంగాణ చాప్టర్ అధ్యక్షుడు రవికుమార్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి 10 మంది దళిత పారిశ్రామిక వేత్తలను తయారుచేయడమే లక్ష్యంగా పనిచేస్తానని దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(డిక్కీ) తెలంగాణ చాప్టర్ నూతన అధ్యక్షులు కతరపాక రవికుమార్ తెలిపారు. ఇప్పటి వరకు తెలంగాణ చాప్టర్ అధ్యక్షులుగా పనిచేసిన రాహుల్ కిరణ్ డిక్కీ సౌతిండియా ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారని రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటర్ ప్యూరిఫికేషన్ వ్యాపారం ఉన్న రవికుమార్ తన జీవితం దళితుల్లో ఎక్కువ మందిని వ్యాపారవేత్తలుగా మార్చడం కోసం వినియోగిస్తానని తెలిపారు. డిక్కీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మశ్రీ నర్రా రవికుమార్ దేశంలో ఉన్న 10వేల మంది దళిత వ్యాపారవేత్తలు ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితుల్లో ఉన్నారని చెప్పారు. వ్యాపారం ప్రారంభించేదాకా ఉద్యోగాల కోసం చూసే వారుగా ఉండి వ్యాపారం ప్రారంభించిన తరువాత తామే ఉద్యోగాలు ఇచ్చే వారిగా మారుతున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా దళితులను వ్యాపారవేత్తలుగా మార్చడం కోసం డిక్కీ కృషి చేస్తోందని తెలిపారు.

అడవిదొంగల కోసం జల్లెడ

- ఈ నెలలో అటవీ శాఖ ఉన్నతస్థాయి సమావేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అడవి దొంగల కదలికపై కన్ను వేసిన అటవీశాఖ అధికారులు దాడులను ముమ్మరం చేశారు. అన్ని జిల్లాలో పోలీసుల సహకారంతో టాస్క్ ఫోర్స్ బృందాలు స్మగ్లర్లు, వేటగాళ్ళ కోసం జల్లెడ పట్టాయి. ఇప్పటికే కీలక ప్రాంతాలను గుర్తించి, నిఘా పటిష్టం చేశారు. రెండు రోజులుగా అటవీశాఖ సిబ్బంది నిర్వహించిన తనికీలలో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను స్వాధీనం చేసుకున్నారు. అదిలాబాద్, ఖమ్మం జిల్లాలలో విస్తృతంగా స్మగ్లర్ల కోసం దాడులు నిర్వహిస్తున్నారు. మరోపక్క రాష్ట్ర వ్యాప్తంగా కలప స్మగ్లర్ల జాబితా తయారు చేసే పనిలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. జాబితా రూపొందించి వందల సంఖ్యలో ఉన్న స్మగ్లర్లపై పీడీ యాక్టు ప్రయోగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇదీలావుండగా, ముఖ్యమంత్రి కెసీఆర్ ఆదేశాల మేరకు కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపేందుకు సంబంధిత శాఖలతో అటవీశాఖ అధికారులు ఈనెలలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో జరగబోయే ఈ సమావేశంలో అటవీ, గిరిజన, పోలీసు, గ్రామీణాభివృద్ధి శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొంటున్నారు. స్మగ్లర్ల కదలికలపై నిఘా, అడవుల సంరక్షణ, స్మగ్లర్లు నరికివేసిన అటవీ ప్రాంతాల్లో తిరిగి మొక్కలు పెంచడం, హరితహారం తదితర అంశాలపై చర్చించనున్నారు.

రుణ పరిమితి దాటిందా..!?

- ఎఫ్ఆర్‌బీఎం పరిధిని మించిన వడ్డీల భారం...! ● మిగులు రాష్ట్రంలో వడ్డీలకే అధిక మొత్తం ● ఆర్థిక పరిస్థితిపై ప్రభావం
- బడ్జెట్‌లో అప్పులపై పెను ప్రభావం ● ప్రత్యేక కార్పొరేషన్లతో రుణ సమీకరణ ● బడ్జెట్‌లో కనిపించకుండా జాగ్రత్తలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఎఫ్ఆర్‌బీఎం పరిధికి లోబడి చేస్తున్న రుణ సమీకరణలో బడ్జెట్ వెలుపలనుంచి తెస్తున్న పూచీకత్తు రుణాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దీంతో రెవెన్యూ వసూళ్లకంటే 10 శాతంలోపే అప్పులపై వడ్డీ చెల్లింపు లుండానే నిబంధన దాటినట్లుగా తాజా ఆర్థిక పరిస్థితి తయారైంది. ఏ రాష్ట్రమైనా తన పన్నుల రాబడికంటే 10శాతానికి మించి రుణాలపై వడ్డీలకు చెల్లింపులు చేయరాదన్న ఎఫ్ఆర్‌బీఎం చట్ట పరిమితిని తెలంగాణ దాటిపోనుందనే ఆందోళన నెలకొంటోంది. ఈ చట్టానికి లోబడిన రాష్ట్రమే స్థిర ఆర్థిక వృద్ధిరేటును కల్గి ఉన్నట్లుగా గుర్తిస్తారు. మొత్తం జీఎస్‌డీపీలో 3 శాతానికి మించి అప్పులు చేయరాదన్న నిబంధనను రెవెన్యూ మిగులు అధికంగా ఉన్న తెలంగాణకు 3.5 శాతంగా కేంద్రం అనుమతించింది. అయితే ఇప్పుడు ఇరిగేషన్ ప్రాజెక్టులకు కార్పొరేషన్ల పేరుతో తెస్తున్న ప్రత్యేక రుణాలు ఈ నిబంధనను మించిపోతున్నాయి. వచ్చే ఐదేళ్లలో రూ. 2లక్షల కోట్లు ఇరిగేషన్ రంగానికి ఖర్చు చేయాలని సీఎం కేసీఆర్ ఇప్పటికే సూత్రప్రాయంగా వెల్లడించారు. అంటే ఏడాదికి దాదాపుగా రూ. 40లక్షల కోట్లు ఈ రంగానికి అవసరం కానున్నాయి. అయితే ఈ నిధులను ఎలా సమీకరించుకుంటారనే అంశంలో స్పష్టత లోపించింది. ఇప్పటికే ఆర్థిక పరంగా సర్దుబాటు వైఖరితో ఉన్న ప్రభుత్వంభారీ మొత్తాలను ఎలా సమకూర్చుకోనుందనే అంశంలో భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి.

కార్పొరేషన్ల పేరుతో రుణాలు...

కాగా గత రెండేళ్లుగా బడ్జెట్‌లో పేర్కొనకుండా ప్రత్యేకంగా కార్పొరేషన్లకు తెస్తున్న రుణాల్లో మిషన్ భగీరథకు రూ.16,413కోట్లు, నీటి పారుదల శాఖకు రూ. 7,031కోట్లు, గొర్రెల అభివృద్ధి సహకార సంస్థకు రూ.2050కోట్లు, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.3360కోట్లు, హౌజింగ్ కార్పొరేషన్‌కు రూ.3021కోట్లు, హైదరాబాద్ జలమండలికి రూ.3399కోట్లు, టీఎస్ఐఐసీకి రూ. 735కోట్లు, టీఎస్ఆర్టీసికి రూ.740కోట్లు, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థకు రూ.600కోట్లు, ఉద్యాన అభివృద్ధి కార్పొరేషన్‌కు రూ.321కోట్లుగా ప్రభుత్వం సేకరించింది. అయితే ఇవన్నీ బడ్జెట్‌లో పేర్కొనని రుణాలే కావడం గమనార్హం. తద్వారా ప్రభుత్వ పూచీకత్తుతో తీసుకున్న రుణాల పరిమాణం ప్రస్తుత ఆర్థిక(2018-19) ఏడాదిలో రూ. 38,752కోట్లు చేరింది. ఇది రాష్ట్ర ఆవిర్భావ ఏడాది 201 4లో ఇది రూ. 16,876కోట్లుగా ఉంది. ఇక వరుసగా 201 5నాటికి రూ. 18262కోట్లకు చేరగా, 2016లో రూ. 2761 5కోట్లకు చేరింది. ఆ తర్వాత 2017 జనవరిలో ఇది రూ. 3145 3కోట్లుగా, 2018 నాటికి రూ. 38,752కోట్లకు చేరుకున్నది.

బడ్జెట్‌లో పేర్కొన్నది గోరంతే ...

ఇవికాకుండా ప్రత్యేకంగా బడ్జెట్‌లో పేర్కొన్న రుణాలు 2018-19 ఆర్థిక ఏడాదిలో రూ. 1,80,238.74కోట్లకు చేరుతాయని బడ్జెట్‌లో అంచనా వేశారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో అప్పుల శాతం 20.63 శాతంనుంచి 21.39శాతానికి పెరుగుదల నమోదు చేసుకున్నాయి. 2015-16లో జీఎస్‌డీపీలో అప్పుల వాటా శాతం 16.18గా నమోదుకాగా నానాటికీ అది పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం ముగుస్తున్న ఆర్థిక ఏడాదిలో మొత్తం అప్పులు రూ. 1,51,133.21కోట్లుగా నమోదుకాగా రానున్న ఆర్థిక ఏడాదిలో ఇది బడ్జెట్ సైజుకు సమీపంగా చేరనున్నట్లుగా ప్రభుత్వం బడ్జెట్‌లో పేర్కొంది. ఇందులో ఓపెన్ మార్కెట్ రుణాలు రూ. 1,38,478కోట్లకు పెరగనున్నాయని అంచనా వేసింది. కేంద్ర ప్రభుత్వంనుంచి సేకరించనున్న అప్పులు 2017-18లో రూ. 9,010కోట్లుకాగా ఈ ఏడాది ఇవి రూ. 9409.46కోట్లకు ఎగబాకనున్నాయి. అటానమస్ సంస్థలనుంచి రూ. 13611.58కోట్లు, స్పెషల్ సెక్యూరిటీలు, ప్రావిడెంట్ ఫండ్, ఇతర మార్గాల ద్వారా రూ. 18,738 కోట్లను సమీకరించుకోనున్నట్లు బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది. ఇప్పటికే ప్రభుత్వ గ్యారెంటీలుగా విద్యుత్ రంగంపై రూ. 9732.51కోట్లు, ఇతర రంగాలపై రూ. 21,720.53కోట్లను ప్రభుత్వం గ్యారెంటీలను ప్రకటించింది. ఇవి కాకుండా కార్పొరేషన్ల ద్వారా స్వంత పూచీకత్తుతో మరిన్ని రుణాలను బడ్జెట్‌లో పేర్కొనకుండానే సేకరించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించుకుంది.

రకరకాలుగా రుణ సేకరణ...

రాష్ట్ర ప్రభుత్వం వివిధ రూపాల్లో రుణసమీకరణ చేసుకుంటోంది. ప్రతిష్టాత్మక పథకాలకు బడ్జెటేతర రుణాలను, ఇతర పథకాలకు బడ్జెటరీ రుణాలను సేకరిస్తోంది. ప్రధానంగా రెండు పడక గదుల ఇండ్లు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఇరిగేషన్ ప్రాజెక్టులకు భారీగా రుణాలను తెచ్చింది. అయితే 2017-18 ఆర్థిక ఏడాదిలో రూ.11,500 కోట్లను వడ్డీ చెల్లింపులకే ఖర్చు చేసే పరిస్థితి తలెత్తింది. రాష్ట్ర పన్నుల ఆదాయం రూ.79 వేల కోట్లుగా ఉండగా ఇందులో 10శాతం అంటే రూ.7900కోట్లకు మాత్రమే అప్పులపైవడ్డీ చెల్లింపులకు అనుమతి ఉంది. అయితే ఇప్పుడాపరిధి దాటి రూ.11,500 కోట్ల వడ్డీలు చెల్లించడంతో 3.5 శాతం రుణ సమీకరణ వెసు లుబాటుపై ప్రభావం పడనుంది. 2016-17లో మిగులును సాధించడంతో 3.25 శాతం ఎఫ్ఆర్‌బీఎం సౌలభ్యం కల్గింది. 2017-18లో 3.5శా తానికి ఎఫ్ఆర్‌బీఎం పెం పుకు కేంద్రం ఆమోదం తెలిపింది. 2015- 16 లో రూ.7942 కోట్లు గా ఉన్న వడ్డీల భారం తాజాగా రూ.11,500కోట్లకు చేరుకుంది.


వడ్డీ భారం ...

రాష్ట్ర అప్పులపై వడ్డీ, రుణాల తిరిగి చెల్లింపులు భారం అవుతున్నాయి. ఈ వార్షిక ఏడాదిలో రాష్ట్ర మొత్తం అప్పు రూ. 1,23,821.49కోట్లకు చేరింది. జీఎస్‌డీపీలో ఈ ఏడాది మొత్తం అప్పుల శాతం 18.46 శాతం కానుందని అంచనాలున్నాయి.

సువర్ణ నవలా రచయిత... షణ్ముఖశ్రీ ధైర్యాన్ని మెచ్చుకోవాలి

- ఆంధ్రప్రభ దినపత్రిక సంపాదకులు వైఎస్ఆర్ శర్మ





హైదరాబాద్, ప్రభ న్యూస్ : నవలా సంస్కృతి చాలా గొప్పదని, 70వ దశకంలో అనేక నవలలు విస్తృతంగా వచ్చాయని, ఆ తరువాత 70వ దశకం చివర్లో నవలా సాహిత్యం రానురానూ మరుగున పడిపోయిందని ఆంధ్రప్రభ దినపత్రిక సంపాదకులు వైఎస్సార్ శర్మ అన్నారు. శ్రీమానస ఆర్ట్స్ థియేటర్స్, త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కళాదీక్షితులు కళా వేదికలో ప్రముఖ హాస్యకథ, నవలా రచయిత జ్యోతిష్య వాగ్భూషణ షణ్ముఖ శ్రీ (ములుగు కుమారస్వామి) రచించిన సువర్ణమాల ఆవిష్కరణ సభను నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన వైఎస్సార్ శర్మ మాట్లాడుతూ నవలా సాహిత్యం చాలా గొప్పదని, పాఠకులను ఆకర్షించే విధంగా షణ్ముఖశ్రీ ఈ సువర్ణ నవలను చాలా చక్కగా రాశారన్నారు. సమాజంలో రోజురోజుకు వస్తున్న మార్పులకనుగుణంగా నవలలు రావాల్సిన ఆవశ్యకత ఉందని, మంచి నవలలను తప్పకుండా పాఠకులు ఆదరిస్తారని తెలిపారు. రచయిత షణ్ముఖశ్రీ తన భావాలను సువర్ణ నవల ద్వారా తెలుగు ప్రజలకు అందించారని, చక్కటి సందేశాత్మకమైన నవల రచించిన షణ్ముఖ శ్రీని వైఎస్సార్ శర్మ సభాముఖంగా అభినందించారు. సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ సాహితీవేత్త, వక్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి ముందుగా సువర్ణ నవలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆ రోజుల్లో విశ్వశ్రేయస్సును కోరే నవలలు చాలామంది రచయితలు రాశారని, ఆ నవలలన్నీ పాఠకుల ఆదరాభిమానాలు పొందాయన్నారు. నవలకు అపురూప స్థానం ఉందని చెప్తూ వెంకటరెడ్డి నవలకు, కథకు ఉన్న తేడా గురించి చాలా వివరంగా మాట్లాడారు. నవలా సాహిత్యం చాలా ప్రధానమైందని, ఆ రోజుల్లో చాలామంది రచయితలు చారిత్రాత్మక నవలలు, సాంఘిక నవలలు రాశారని గుర్తుచేశారు. పాత్రల చిత్రీకరణ, సంఘర్షణ నవలల్లో మనకు గోచరిస్తుందని, సువర్ణ పాత్ర స్వభావం గురించి వెంకటరెడ్డి వివరంగా మాట్లాడారు. ఏ శ్మశానవాటిక దగ్గర నుంచి సువర్ణ నవల ప్రారంభమవుతుందో, ఆ శ్మశానవాటికలోనే ఈ నవల ముగుస్తుందని, మన సంస్కృతి, మన ధర్మం చెప్పడానికి నవలలు చాలా ఉపయోగపడతాయన్నారు. సువర్ణ ఒక మంచి నవలని వెంకటరెడ్డి అన్నారు. సద్విమర్శకుడు పోపూరి విశ్వనాథ సువర్ణ నవలను సమీక్షించారు. ఈ నవలలోని పాత్రల గురించి విశ్వనాథ వివరంగా మాట్లాడారు. ఈ సభలో కళా జనార్ధన మూర్తి, ఆధ్మాతికవేత్త అన్నదానం చిదంబరశాస్త్రి, పొత్తూరి సుబ్బారావు తదితరులు సువర్ణ నవల గురించి మాట్లాడారు. సువర్ణ నవలా రచయిత షణ్ముఖ శ్రీని సభలో పాల్గొన్న అతిథులు సత్కరించారు. సువర్ణ నవల గురించి షణ్ముఖ శ్రీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ రథసారధులు రఘుశ్రీ, బండారుపల్లి రామచంద్రరావు, లలితావాణి, కళా జనార్ధనమూర్తి, యలవర్తి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. ముందుగా జరిగిన భక్తి సంగీత కార్యక్రమంలో గాయని కమలావతి, పలు భక్తి గీతాలను మధురంగా గానం చేశారు.

ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ భర్త అరెస్టు

- రూ. 2 లక్షల నగదు స్వాధీనం

ఆర్మూర్ రూరల్, ప్రభన్యూస్: నిజామాబాద్ జిల్లా, ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ యామాద్రి కవిత భర్త టీఆర్ఎస్ నాయకుడు యామాద్రి భాస్కర్ బెదిరింపులకు పాల్పడుతున్నాడని కేసు నమోదు చేసి అరెస్టు చేసి, రూ. 2 లక్షల డబ్బులను రికవరీ చేసినట్లు సీఐ రాఘవేందర్ ఆదివారం తెలిపారు. ఆర్మూర్ పట్టణంలోని మహాలక్ష్మీ కాలనీలో గల బాల్‌రాజ్ మెమోరియల్ ఆస్పత్రి వైద్యుడు రాకేష్‌కు చెందిన భవన నిర్మాణ విషయంలో హైదరాబాద్‌కు చెందిన గుత్తేదారుకు తనకు మధ్య ఉన్న వివాదం సెటిల్ చేస్తానని భాస్కర్ రూ. 2లక్షలు డిమాండ్ చేసి తీసుకున్నట్లు తెలిపారు. తనను మోసం చేయడంతో పాటు మరో రూ.3లక్షలు ఇవ్వాలని బెదిరిస్తున్నట్లు వైద్యుడు రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి భాస్కర్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బెదిరించి తీసుకున్న రూ. 2 లక్షలను బాస్కర్ నుండి రికవరి చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

మిడ్జిల్‌లో కత్తులతో దాడి

- ఐదుగురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం



మహబూబ్‌నగర్ , ప్రభ న్యూస్ బ్యూరో : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగి కత్తులతో దాడులు చేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో ఐదుగురు గాయపడగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఇరువర్గాల మధ్య గతంలో జరిగిన గొడవలే తాజా దాడులకు దారితీశాయని తెలుస్తోంది. టీఆర్ఎస్ పార్టీ తరపున నామినేషన్లు వేసిన వారిపై కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది దాడి చేసినట్లు తెలిసింది. గాయపడినవారిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ విషయం తెలిసిన వెంటనే ఎస్పీ రెమా రాజేశ్వరి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామస్తులతో మాట్లాడి వివాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో పీర్ల పండుగ రోజున చిన్న ఘర్షణ జరిగిందని, దానిని పరిష్కరించినప్పటికీ పాతకక్షలతో ఇప్పుడు దాడి చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మిడ్జిల్ మండలం వల్లభరావు పల్లి గ్రామానికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు ఇటీవలే టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆ పార్టీ మద్దతుతో వార్డు మెంబర్ స్థానానికి పోటీ చేస్తుండగా కాంగ్రెస్ నేతలు కత్తులతో దాడి చేయడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులలో భీమయ్య పరిస్థితి విషమంగా ఉండగా ఆంజనేయులు, భగవంతు, కృష్ణయ్య, నరసింహులు, ఆనంద్ పరిస్థితి నిలకడగా ఉంది. గాయాలపాలైన వారి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్సై ప్రభాకర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విదేశీ విద్యానిధి విద్యార్థులపై ట్రాకింగ్

- ఎంతమంది ఉద్యోగాలు పొందుతున్నారో తెలుసుకుంటున్న ఎస్సీ అభివృద్ధి శాఖ
- ఇప్పటికే 405 మందికి ఆర్థికసాయం ● 18న మరో 44మందికి ఇంటర్వ్యూ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ విదేశాల్లో ఉన్నత విద్యను చదవాలనుకునే ఎస్సీ విద్యార్థులకు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తోంది. అందులో భాగంగా విద్యార్థులు ఏ దేశంలో ఉన్నత విద్యను చదవాలనుకున్నా ఆర్థిక సాయం చేయడానికి శాఖ సిద్ధం ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు 405 మంది విద్యార్థులకు విదేశాల్లో చదువుకోవడానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. ఇందులో 113 మంది అమ్మాయిలుండగా.. 292 మంది అబ్బాయిలున్నారు. మరో 44 మందికి ఈ నెల 18న ఇంటర్వ్యూలను నిర్వహించనుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా కాకుండా రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రతి విద్యార్థికి రూ. 20 లక్షల ఆర్థికసాయం చేస్తోంది రాష్ట్ర ప్రభుత్వం.

405 మందికి ఆర్థికసాయం...

రాష్ట్రంలో ఏర్పడిన తరువాత 2014 జూన్ నెల తరువాత నుంచి 2018 డిసెంబర్ నాటికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అధికారులు వారిలో 405 మంది విదేశీ విద్యానిధికి అర్హులుగా తేల్చి వారికి ఆర్థికసాయం చేశారు. వీరిలో 292 మంది అబ్బాయిలు ఉండగా 113 మంది అమ్మాయిలున్నారు. వారిలో కొందరు ఇప్పటికే వారి పీజీ కోర్సులను కూడా పూర్తి చేశారు. మరికొంత మంది ప్రస్తుతం పీజీ కోర్సులను కొనసాగిస్తున్నారు. వీరు కాకుండా మరో 44 మందికి సంక్రాంతి తరువాత 18న ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారు. విదేశీ విద్యానిధిని 10 దేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తే ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో అమెరికా, బ్రిటన్, సింగపూర్, జర్మనీ, జపాన్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఫ్రాన్స్, దక్షిణకొరియా దేశాలు ఉన్నాయి. ఈ 10 దేశాలే కాకుండా ఇటలీలో ఉన్నత విద్య చదవడం కోసం అవకాశం వచ్చిందని తనకు ఆర్థికసాయం చేయాలని ఒక విద్యార్థి దరఖాస్తు చేసుకోగా పరిశీలించిన అధికారులు ఆ విద్యార్థికి కూడా రూ. 20 లక్షల ఆర్థికసాయం అందించారు. ఇప్పటి వరకు వీరికి రూ. 59.54 కోట్లను మంజూరు చేశారు.

ప్రైవేటు ఏజెన్సీ ద్వారా ట్రాకింగ్ ..

విదేశీ విద్యానిధి ద్వారా విదేశాల్లో వివిధ పీజీ కోర్సులు పూర్తి చేసిన వారిలో ఎంత మంది ఉద్యోగాలు సాధించారనే అంశాన్ని తెలుసుకోవడం కోసం ట్రాకింగ్ చేయాలని ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఇప్పటికే ఒక ప్రైవేటు సంస్థకు ఈ బాధ్యతను అప్పగించారు.

'యువతకు చేయూత అందించాలి'

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉద్యోగాలను భర్తీ చేసి యువతకు చేయూత నందించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య అన్నారు. రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బీసీ యువజన సంఘం రూపొందించిన 2019 క్యాలెండర్‌ను ఆయన ఆదివారం బీసీ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి మన్నెం వెంకట్, గుడి రామకృష్ణ, గుజ్జ కృష్ణ, ఎం మహేందర్ గౌడ్, అనిల్, రవి తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేస్తే నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వస్తాయని ఆర్ కృష్ణయ్య గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే వివిధ శాఖల్లో ఉన్న ఖాళీ ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్లను జారీ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ మోసం చేశారని.. రెండోసారి సీఎం అయినందున ఇప్పుడైనా నిరుద్యోగులను మోసం చేయకుండా ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హృద్రోగులకు వరం హార్ట్‌వాల్వ్ థెరపీ

- హైదరాబాదులో అందుబాటులోకి అధునాతన వైద్య సేవలు
- కార్డియాక్ ఇన్‌సైడ్స్ సదస్సులో నిపుణుల వెల్లడి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: నిరంతర పరిశోధనలు, అత్యాధునిక సాంకేతికత కలగలపి అందుబాటులోకి వచ్చిన ఆధునిక చికిత్సా పద్ధతులతో గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారికి మేలు జరుగుతోందని, హార్ట్‌వాల్వ్ థెరపీలాంటి ఆధునిక వైద్యసేవలు ఇప్పుడు హైదరాబాద్‌లో అందుబాటులోకి వచ్చాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. పెద్దగా కోతలు లేకుండా, రిస్క్ లేకుండా, ఎక్కువ సేపు ఎనస్తీషియా ఇవ్వవలసిన అవసరం లేకుండా జరిగే హార్ట్‌వాల్వ్ థెరపీ హృద్రోగులకు వరంలాంటిదని వారు చెబుతున్నారు. ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడే వారికి కూడా ఎటువంటి రిస్క్ లేని అధునాతన చికిత్సా పద్ధతి ఇదేనని వారు గట్టిగా చెబుతున్నారు. హైదరాబాద్‌లో కార్డియాక్ ఇన్‌సైడ్స్ పేరుతో జరిగిన రెండురోజుల అంతర్జాతీయ వైద్యసదస్సు ఆదివారం ముగిసింది. అపోలో, అమెరికాకు చెందిన కొలంబియా హాస్పిటల్స్ సంయుక్త సారథ్యంలో జరిగిన ఈ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఫాక్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సీనియర్ కార్డియాలజిస్ట్ డా.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ హార్ట్‌వాల్వ్ సంరక్షణకు సంబంధించి ఆధునిక చికిత్సా పద్ధతులను అందరికీ తెలియచేసేందుకు ఈ సదస్సు వేదిక అయ్యిందన్నారు. వైద్యరంగంలో సరికొత్త పరిశోధనలు, ఆవిష్కరణలు, విద్య, శిక్షణలకు కట్టుబడివున్న కార్డియాలజిస్టులు, కార్డియోథొరాసిక్ సర్జన్లతో లాభాపేక్షలేకుండా ఎఫ్ఎసిటిఎస్ (ఫాక్ట్) ఫౌండేషన్‌ను నడుపుతున్నట్టు వెల్లడించారు. కార్డియాలజి, కార్డియో థొరాసిక్ సర్జరీలలో వచ్చిన కొత్త విధానాలపై రెండు రోజుల సదస్సులో చర్చించినట్టు వెల్లడించారు. శరీరంలోని రక్తసరఫరా వ్యవస్థలో కుంచించుకుపోయిన వాల్వ్‌ను తొలగించి, తిరిగి దాని స్థానంలో వాల్వ్‌ను భర్తీ చేయడానికి అతితక్కువ కోతతో చర్మంపై ఎలాంటి కుట్లు కనబడకుండా ఉపయోగించే పద్ధతి అందుబాటులోకి వచ్చిందన్నారు. తక్కువ సమయానికి అనెస్తీషియా ఇచ్చి, రోగి గజ్జల్లో చిన్న రంధ్రం చేసి, అతితక్కువ కోతతో చేసే విధానం ఇప్పుడు ఉపయోగకరంగా ఉందన్నారు. సాధారణ రోగులతోపాటు వయస్సు పైబడిన రోగులు, ఊపిరి తిత్తులు , మూత్రపిండాల సమస్యలతో బాధపడుతున్న హైరిస్క్ రోగులకు ఇది ఎంతో ప్రయోజనకరం అన్నారు. టీపీవీఆర్ పద్ధతి వారికి ఒక గొప్ప ఓదార్పును ఇస్తుందన్నారు. ఈ వైద్యం కోసం అమెరికాకు వెళ్లనవసరం లేకుండా హైదరాబాద్‌లోనే అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. ఇటువంటి అధునాతన వైద్య చికిత్స పద్ధతులు రోగులకే కాకుండా యువ వైద్యులకు మంచి అధ్యయన అంశాలుగా ఉపయోగపడతాయని డా.శ్రీనివాస్ కుమార్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో హార్ట్‌వాల్వ్ థెరపి నిపుణులు జువన్ గ్రెనెడా, సుశీల్ కొడాలి, డా అజయ్ కీర్తనే, వై.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



సామ్రాజ్యం కోసం వాళ్లు.. సాధికారత కోసం మేము..

• వారిది అవకాశవాద కూటమి • బీజేపీది ఓటు బ్యాంక్ రాజకీయం కాదు • సేవే పరమావధిగా పనిచేస్తున్నాం • యువత, రైతుల ఆశయ సాధన దిశగా ముందడుగు వేస్తున్నాం • పజలను చైతన్య పరచండి • తమిళనాడు బీజేపీ కార్యకర్తలతో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దూకుడు పెంచారు. దేశవ్యాప్తంగా బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపేలా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంభాషిస్తున్నారు. తమిళనాడు బీజేపీ బూత్ లెవల్ కార్యకర్తలతో సంభాషించిన మోడీ..2019 లోక్‌సభ ఎన్నికల్లో ముందడుగు వేయాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. బీజేపీని ఎదుర్కొనేందుకు ప్రతిపక్షాలు ఏర్పాటు చేసిన మహాకూటమిపై మోడీ తీవ్ర విమర్శలు చేశారు. ప్రతిపక్షాలు సామ్రాజ్యవాదం కోసం ప్రయత్నిస్తుంటే.. తాము సాధికారత కోసం కృషి చేస్తున్నామని అన్నారు. ప్రతిపక్షాల కూటమిని అవకాశవాద కూటమిగా అభివర్ణించిన మోడీ..రాజరికమే వారి ప్రధాన లక్ష్యమని చురకలంటించారు. ఇతర పార్టీల మాదిరిగా ఓటు బ్యాంకు కోసం బీజేపీ విభజన రాజకీయాలు చేయబోదన్న మోడీ.. ప్రజలకు ఏరకంగా సేవ చేయొచ్చన్నదే తమ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దేశంలో రెండు రకాల రాజకీయాలు నడుస్తున్నాయన్నమోడీ.. తాము అభివృద్ధి ఎజెండాతో ఎన్నికలకు వెళ్తుంటే.. ప్రతిపక్షాలు అవకాశవాద ధోరణితో కూటమిగా ఏర్పడి.. వారసత్వ రాజకీయాలను పెంచిపోషిస్తు న్నాయని మండిపడ్డారు. ప్రజల కళ్లముందు కనిపిస్తున్న అభివృద్ధి ఎజెండాతోనే తాము ఎన్నికలకు వెళ్లడం మంచి అవకాశంగా భావిస్తున్నామన్నారు. సబ్‌కా సాత్..సబ్‌కా వికాస్ నినాదంతో ముందడుగు వేస్తున్నామని మోడీ చెప్పుకొచ్చారు. ఉత్తర్ ప్రదేశ్‌లో వైరివర్గాలుగా ఉండే సమాజ్ వాదీ, బహుజన సమాజ్‌వాదీ పార్టీ జతకట్టి బీజేపీకి వ్యతిరేకంగా ఎన్నికలకు వెళ్తున్నామని ప్రకటించిన నేపథఅయంలో మోడీ ఎదురు దాడి చేశారు. ప్రతీ బీజేపీ కార్యకర్త స్వలాభం కోసం కాకుండా దేశ ప్రయోజనాల కోసం పనిచేస్తారని చెప్పుకొచ్చారు.

ప్రజలు బీజేపీని వ్యతిరేకిస్తే... కూటమి ఎందుకు..?

కేవలం బీజేపీలోనే వెనకబడిన వర్గాల వారికి ప్రాధాన్యత ఉంటుందన్న మోడీ.. ధన, పేద భేదభావాలు లేకుండా వ్యక్తిత్వానికే ప్రాధాన్యతనిస్తారని చెప్పారు. ప్రతికూల రాజకీయాలను పెంచిపోషిస్తున్న వారి పట్ల ప్రజలు ఆగ్రహంగా ఉన్నారన్నారు. మోడీ చెడ్డవాడని.. ప్రభుత్వం పనిచేయడం లేదని ప్రజల్లో నిరూపించలేకే కూటమి బాట పట్టారు. .ప్రజలు బీజేపీని అభిమానించకుంటే మీరెందుకు మహాకూటమిని ఏర్పాటు చేశారు. మీపై మీకే నమ్మకం లేదు. మా ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తోంది. నవ భారత నిర్మాణం దిశగా యువతను ప్రోత్సహిస్తోంది. భారత్‌కు బీజేపీతో బలీయమైన అనుబంధం ఉంది. అని మోడీ చెప్పుకొచ్చారు.ప్రతిపక్ష పార్టీలు ప్రజలను తప్పుదోవపట్టించేందుకు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

వాళ్లు ప్రచారానికి..మేం పేదరిక నిర్మూలనకు..

గత ప్రభుత్వాలు ప్రచారం కోసం ఇళ్లు నిర్మిస్తే.. తమ ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు ఇళ్లను నిర్మించి ఇస్తోందని చెప్పారు. గతంలో అమలు చేశామని చెప్పిన సంక్షేమ పథకాలన్నీ కాగితాలకే పరిమితం. అందుకే ఎంతమంది లబ్దిపొందారో చెప్పలేకపోయారని విమర్శలు గుప్పించారు. సులభ వాణిజ్య విధానం(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) పెద్దపెద్ద కంపెనీలకే సహాయపడేందుకే అనే ఆలోచన తప్పు అని మోడీ చెప్పుకొచ్చారు. సూక్ష్మ,చిన్న,మధ్య తరహా కంపెనీలకు(ఎంఎస్ఎంఈ)లకు తోడ్పాటునందించేందుకు ఈజ్ ఆఫ్ బిజినెస్ చేపట్టామని తెలిపారు. ప్రజలపై పన్ను భారాన్ని తగ్గించేందుకు జీఎస్టీని అమలు చేస్తున్నామన్న మోడీ.. విడతల వారీగా మార్పులు చేస్తూ.. జీఎస్టీని మరింత సరళతరం చేస్తున్నామని చెప్పారు. వ్యాపార రిజిస్ట్రేషన్ కోసం చేసుకునే జీఎస్టీ పరిమితిని రూ.20 నుంచి 40 లక్షలకు పెంచడం ద్వారా చిన్న చిన్న వ్యాపారులకు ఊరటనిచ్చామన్నారు. మన దేశ భవిష్యత్ కోసం బీజేపీకే ఓటేసేలా ప్రజలను చైతన్య పరచాలని మోడీ పిలుపునిచ్చారు.

కామన్ వెల్త్ పదవికి సిక్రీ నో

• కేంద్రం ప్రతిపాదనను తిరస్కరించిన సుప్రీం జడ్జి • అలోక్ వర్మపై వేటు నేపథ్యంలోనే అంటున్న విశ్లేషకులు




న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏకే సిక్రీ సంచలన నిర్ణయం తీసుకున్నారు. కామన్ వెల్త్ సెక్రెటేరియేట్ ఆర్బిట్రల్ ట్రిబ్యునల్(సీఎస్ఏటీ) అధ్యక్షుడు / మెంబర్‌గా సిక్రీని నామినేట్ చేస్తూ భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సున్నితంగా తిరస్కరించారు. ఈ ఏడాది మార్చిలో పదవీ విరమణ పొందుతున్న సిక్రీ పేరును సీఎస్ఏటీ పదవికి ప్రభుత్వం గతేడాదే ప్రతిపాదించింది. అయితే సీబీఐ చీఫ్ అలోక్ వర్మ తొలగింపు నిర్ణయం తీసుకున్న ఉన్నతస్థాయి కమిటీలో మెంబర్‌గా ఉన్న సిక్రీ.. ప్రతిపక్షాల నుంచి విమర్శలను ఎదుర్కోకూడదనే వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. సీఎస్ఏటీకి తనను నామినేట్ చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూసిక్రీ కేంద్ర న్యాయశాఖకు లేఖ రాశారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి తర్వాత సీనియారిటీలో రెండో వ్యక్తిగా ఉన్న సిక్రీ.. ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కామన్ వెల్త్ సెక్రెటేరియేట్ ఆర్బిట్రల్ ట్రిబ్యునల్‌కు సిక్రిని నామినేట్ చేస్తూ నిర్ణయం తీసుకున్న నాటికి (డిసెంబర్ 2018 మొదటివారం) అలోక్ వర్మ వ్యవహారంలో సిక్రికి సంబంధం లేదు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గగోయ్ ఉన్నత స్థాయి కమిటీ తప్పుకున్న తర్వాతే సిక్రీ ఆ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సమావేశంలో సీవీసీ నివేదిక ఆధారంగా అలోక్ వర్మను సీబీఐ చీఫ్ పదవి నుంచి తొలగించారు.దీంతో సిక్రీ వ్యవహార శైలిని ప్రతిపక్షాలు సైతం తప్పుబట్టాయి. ఇలాంటి సందర్భంగా అంతర్జాతీయ పదవిని స్వీకరిస్తే.. తన ఇమేజ్‌ను డ్యామేజ్ చేసేలా ప్రతిపక్షాలు అంతర్జాతీయంగా రాద్ధాంతం చేయవచ్చని ఊహించిన సిక్రీ ..కామన్ వెల్త్ సెక్రెటేరియేట్ ఆర్బిట్రల్ ట్రిబ్యునల్ కు వెళ్లబోనని తేల్చిచెప్పారు.

ప్రధానికి స్కామ్‌ల భయం

జస్టిస్ సిక్రీకి అంతర్జాతీయ పదవిని కట్టబెడుతున్నారన్న వార్త దావనంలా విస్తరించడంతో ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ స్పందిస్తూ ..ప్రధాని మోడీకి స్కామ్‌ల భయం పట్టుకుందని ఆరోపించారు. రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు ఒప్పందంలో భారీ అవినీతి జరిగిందన్న విషయాన్ని కప్పిపుచ్చుకోలేకే మోడీ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు దిగిందని అన్నారు. రాఫెల్ స్కాంను కప్పిపుచ్చేందుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులను సైతం ట్రాప్ చేస్తున్నారు. ఈ ప్రధాని దేన్నీ ఆపలేరు. అని రాహుల్ ఆరోపించారు.

2500 ఏళ్ల క్రితమే భారత్‌లో ప్లాస్టిక్ సర్జరీ



న్యూఢిల్లీ: మనం అత్యాధునిక చికిత్సగా చెప్పు కుంటున్న ప్లాస్టిక్ సర్జరీ భారత్‌లో వేల సంవత్సరాల క్రితమే చేసేవారా..? 2500 ఏళ్ల క్రితమే మన దేశంలో ప్లాస్టిక్ సర్జరీలు జరిగాయా..? అవున నే అం టున్నారు పరిశోధకులు.. ఇటీవల పంజాబ్ జలం ధర్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో జరిగిన 106 భారత సైన్స్ కాం గ్రెస్‌లో ఈ విషయానికి సంబంధించిన వివరాలను ప్రదర్శిం చారు. ఫాదర్ ఆఫ్ సర్జరీగా పేరొందిన సుశృత తన సుశృ త సం హితలో మెడిసిన్,సర్జరీ గురించిన వివరాలను పొందు పరిచి నట్లు లవ్లీ ప్రొఫెషనర్ యూనివర్సిటీ పేర్కొంది. 1100 లకు పైగా రోగాలను నయం చేసేందుకు సుశృత వందలాది ఔషధ మొక్క లను పెంచేవారని.. ఈ విషయాలను పరిశోధకులు కూడా అంగీకరించినట్లు వెల్లడించింది. ప్లాస్టిక్ సర్జరీ చేసే విధా నానికి సంబంధించిన వివరాలను కూడా సుశృత సంహితలో పేర్కొన్నారట. చర్మం తొలగింపు, అతికించడం, ముక్కు రూపా న్ని మార్చే చికిత్స వంటి వాటికి సంబంధించిన వివరాలు ఈ గ్రం థంలో నిక్షిప్తం చేసినట్లు ప్రదర్శనలో ఉంచారు.సుస్రుత సంహి తలో ప్లాస్టిక్ సర్జరీకి సంబంధించిన అంశాలెన్నో ఉన్నట్లు గుర్తిం చిన పరిశోధకులు ఆ వివరాలను సైన్స్ కాంగ్రెస్‌లో తెలియజేశారు.

వీసా లేకుండా కర్తార్‌పూర్

• కాంగ్రెస్ వల్లే సిక్కులకు ఇబ్బందులు • సిక్కు అల్లర్ల బాధితులకు న్యాయం చేస్తాం • విపక్షంపై ప్రధాని మోడీ విమర్శలు • గురుగోవింద్ సింగ్ 350 జయంత్యోత్సవ స్మారక నాణెం విడుదల

ప్రధానమంత్రి నరేంద్రమోడీ మరోసారి కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఎదుటే కాంగ్రెస్ పార్టీని విమర్శలతో ఎత్తిపొడిచారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థత వల్లే సిక్కులు పవిత్రంగా భావించే కర్తార్‌పూర్ సాహిబ్ గురుద్వారాను పాకిస్తాన్ నుంచి వెనక్కితీసుకు రాలేక పోయిందని ప్రధాని మండిపడ్డారు. సిక్కు మత ప్రబోధకుడు, 10వ సిక్కు గురువు గురుగోవింగ్ సింగ్ 350 వ జయం తి సందర్భంగా ఆయన స్మారకచిహ్నాన్ని ప్రధాని మోడీ తన అధికారిక నివాసంలో విడుదల చేశారు.ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ 1984 లో దివంగత ప్రధానమంత్రి హత్య తర్వాతే సిక్కు అల్లర్లు చెలరేగాయని చెప్పారు. పాకిస్తాన్‌లోని నరోవాల్ జిల్లాలో ఉన్న కర్తార్‌పూర్ గురుద్వారాను ఇకమీదట బైనాక్యులర్ చూడాల్సిన అవసరం లేకుండా కేంద్రప్రభుత్వం కర్తార్ పూర్ కారిడార్‌ను చేపట్టిందని మోడీ తెలిపారు. ఈ కారిడార్ ద్వారా సిక్కులు వీసా అవసరం లేకుండానే సులువుగా గురుద్వారాను సందర్శిం చుకోవచ్చని పేర్కొన్నారు. సిక్కు అల్లర్ల




బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందన్నారు. దశాబ్దాల కాలంలో ఎంతోమంది తల్లులు, సోద రులు, సోదరీమణులు తమ వాళ్ల గురించి కన్నీరుపెట్టు కుంటున్నారన్న మోడీ.. వారి బాధలు పంచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు.

కర్తార్‌పూర్ వెళ్లేందుకు వీసాతో పనిలేదు

1947 ఆగస్టులో చేసిన పొరపాటు వల్ల.. భారత్ విభజన సమయంలో కర్తార్ పూర్ పాకిస్తాన్‌లోకి వెళ్లిందన్నారు. మన గురువు 18 ఏళ్లపాటు ఉన్న కర్తార్‌పూర్ కిలోమీటర్ల దూరంలో ఉండి కూడా ఇన్నాళ్లు వెళ్లలేని పరిస్థితి ఉండేదన్న మోడీ.. కేంద్రం లో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కర్తార్‌పూర్ కారిడార్ నిర్మించి సిక్కులు గురు ద్వారాను సందర్శించే అవకాశం కల్పించిందన్నారు. సిక్కు మత గురువు గురు నానక్ ఏప్రిల్ 15, 1469 లో ప్రస్తుత పాకిస్తాన్‌లో జన్మించిన గురు నానక్. సెప్టెంబర్ 22, 1539లో కర్తార్‌పూర్‌లో తుదిశ్వాస వదలారు. గురునానక్ నివసించిన ప్రాంతాన్ని సిక్కులు పవిత్రక్షేత్రంగా భావిస్తారు.త్వరలోనే గురునానక్ 550 వ జయంతి ఉత్సవాలను దేశ వ్యాప్తంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని మోడీ తెలిపారు.


ఆలయ ప్రవేశం వారి విజ్ఞతకే వదిలేస్తున్నా

• పంథా మార్చిన రాహుల్




న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ దుబాయ్ పర్యటనలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన శబరిమల ఆలయంలోకి అన్ని వయసుల మహిళలు ప్రవేశం చాలా వద్దా అనే విషయాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. గతంలో యువతుల ప్రవేశాన్ని సమర్థించిన రాహుల్, సంప్రదాయ నిషే ధాన్ని కొనసాగించేలా ప్రజల వద్ద ఆమోదించదగ్గ కారణాలే ఉన్నాయని తాజాగా అన్నారు. ఈ విషయాన్ని తాను ప్రజలకే వదిలేస్తున్నానని తెలిపారు. అయితే, సుప్రీంకోర్టు తీర్పునను సరించి అన్ని వయసుల మహిళలను ఆలయం లోకి అనుమతించాలని తొలుత రాహుల్ కేరళ ప్రభుత్వానికి మద్దతిచ్చారు. ప్రభు త్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న బీజేపీ సహా, ఇతర హిందుత్వ సంస్థల వాదన లను ఖండించారు. కాగా, శబరిమల అంశంలో రాహుల్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ఎన్నికల వ్యూహంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

హైకోర్టుల్లో మహిళా జడ్జీలు 73 మంది



న్యూఢిల్లీ: దేశంలోని హైకోర్టుల్లో జడ్జీలుగా మహిళల ప్రాధాన్యత సంబంధించిన ఆసక్తికరమైన విషయాన్ని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దేశంలోని మొత్తం 24 హైకోర్టుల్లో కేవలం 73 మంది మహిళలు మాత్రమే జడ్జీలుగా సేవలు అందిస్తున్నారు. దేశంలోని హైకోర్టుల్లో ప్రస్తుతం 670 మంది న్యాయ మూర్తులు పనిచేస్తుండగా అందులో కేవలం 10.89 శాతం అంటే 73 మంది మహిళలు పనిచేస్తున్నారు. న్యాయ, సిబ్బంది సంబంధిత స్టాండింగ్ కమిటీకి సమాధానమిచ్చిన న్యాయ మంత్రిత్వశాఖలోని న్యాయవిభాగం ఈ సమాచారాన్ని వెల్లడించింది. అర్హత కలిగిన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, మహిళల వివరాలను పంపించాలని హైకోర్టు న్యాయమూర్తులను బాధ్యతాయుతంగా కోరుతున్నామని, దీంతో సమాజంలోని అన్నీ వర్గాలు ఉన్నత న్యాయవ్యవస్థలో పని చేసే అవకాశం దక్కుతుందని ప్రభుత్వం పేర్కొంది. ఉన్నత న్యాయవ్యవస్థలో రిజర్వేషన్లు లేవని, అందుకు అవసరమైన రాజ్యాంగంలోని నిబంధనలు 124, 217లను సవరించేందుకు ఎలాంటి ప్రతిపాదనలు లేవని ప్రభుత్వం స్పష్టం చేసింది. జడ్జీల నియామకానికి ముఖ్యమంత్రి లేదా గవర్నర్‌కు ఇస్తున్న ఆరు వారాల గడువును తగ్గించే అవకాశం ఉందని, ఉన్నత న్యాయవ్యవస్థలోని జడ్జీల పదవీ విరమణ వయసును తగ్గించే ప్రతిపాదనలు కూడా లేవని, జడ్జీల నియమానికి సంబంధించి అనవసర వాయిను తప్పించాలని నివేదికలో ప్రభుత్వం అభిప్రాయపడింది. ఇదిలావుండగా దేశంలో మొత్తం 409 హైకోర్టు న్యాయమూర్తుల స్థానాలు నియమించాల్సి ఉంది.

చంద్రునిపై రాత్రి ఉష్ణోగ్రతలు గుర్తించనున్న చైనా రోవర్



బీజింగ్: చంద్రునిపై వెలుతురు లేని చీకటి ప్రదేశంలోని రాత్రిపూట అతిశీతలగడ్డ ఉష్ణోగ్రతలను చైనా శాస్త్రవేత్తలు గుర్తించనున్నారు. చంద్రునిపై అన్వేషణకు పంపించిన చైనా రోవర్ చంగ్‌ఈ-4 ఈ ఉష్ణోగ్రతలను నమోదుచేయనుంది. చంద్రునిపై ఉష్ణోగ్రతలను గుర్తించితే చంద్రుని నేల లక్షణాలను తెలుసుకునే వీలుంటుంది. అయితే చంద్రుని ఉపరితలంపై పగటిపూట 127 డిగ్రీల సెల్సియస్, రాత్రిపూట మైనస్ 183 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అంచనావేస్తున్నారు. చంద్రునిపై పరిశోధనకుగానూ 2013లో ప్రయో గించిన చంగ్‌ఈ-3 విదేశీ ఉష్ణోగ్రతల ఆధారంగా రూపొందించినది కాగా చంగ్‌ఈ-4 చైనా ఉష్ణోగ్రతల డేటా హంగ్ హే ఆధారంగా రూపొందించామని చైనా అకాడమీ ఆఫ్ స్పెస్ టెక్నాలజీ చంగ్‌ఈ-4 ప్రాజెక్ట్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ తెలిపారు. చంద్రుని ఉష్ణోగ్రత లకు సంబంధించిన మన సొంత సమాచారం లేకపోతే చంద్రునిపై రాత్రిపూట నమోదయ్యే శీతల ఖచ్చిత ఉష్ణోగ్రత తెలియదన్నారు. సౌరశక్తి లేకపోవ డంతో చంగ్‌ఈ-4 రాత్రిపూట పనిచేయదని, రేడియో ఐసోటో వేడిపై ఆధారపడుతుందని, రష్యా, చైనా శాస్త్రవేత్తలను చంగ్‌ఈ-4ను వేడిగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నారని సీఏఎస్‌టీ సలహాదారుడు టన్ మే తెలిపారు. చంద్రుని ఉపరితలం ఉష్ణోగ్రతలను థర్మామీటర్ల నమోదు చేసేందుకు ఉష్ణాన్ని శక్తిగా మార్చాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఉష్ణోగ్రత లను గుర్తించేందుకు అనేక పరికరాలను ల్యాండర్‌పై అమర్చామని, గుర్తించిన ఉష్ణోగ్రతల సమాచారం పగటిపూట అందుతుందని వెల్లడించారు.

భవిష్యత్తులో లోతైన అన్వేషణలకు అనుగుణంగా చంగ్‌ఈ-4కి తొలిసారిగా ఐసోటోప్ థెర్మోఎలక్ట్రిక్ జనరేషన్ సాంకేతికతతో రూపొందించారు. చైనీయుల దేవత చంగ్‌ఈ పేరును ఈ రోవర్‌కు పెట్టారు. జనవరి 3న చంద్రునిపై రోవర్ ల్యాండ యింది. చంద్రుని చీకటి ప్రదేశంలో ఇంత సున్నితం గా రోవర్‌ను ల్యాండ్ చేసిన తొలిదేశం చైనా కావడం గమనార్హం.

100 రెట్ల వేగంతో త్రీడీ ప్రింటింగ్

వాషింగ్టన్: ప్రస్తుతమున్న త్రీడీ ప్రింటింగ్ పద్ధతులుకన్నా 100 రెట్లు వేగంతో ముద్రించే నోవెల్ అనే ప్రక్రియను శాస్త్రవేత్తలు రూపొందించారు. ద్రవ పదార్థాలకు బదులుగా ప్లాస్టిక్ తంతువుల పొరలపై పొరల ఉంచడం ద్వారా శాస్త్రవేత్తలు ఈ విధానాన్ని రూపొందించారు. ప్రస్తుతమున్న ప్రక్రియ ద్వారా వేగంగా ముద్రించలేమని ఈ విధానం ద్వారా 100 రెట్ల వేగంతో త్రీడీ ప్రింటింగ్ చేయవచ్చునని, త్రీడీ ప్రింటింగ్ ద్వారా అనేక మందికి ఉపాధి కల్పించ వచ్చునని అమెరికాలోని మిచిగాన్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న తిమోతీ స్కాట్ వెల్లడిం చారు. ద్రవ పదార్థం ప్రవహిస్తున్న ప్రాంతాన్ని రెండు కాంతులతో నియంత్రించడం ద్వారా ద్రవపదార్థం ఘనపదార్థంగా మారుతుందని ఆయన వివరించారు.

కేజ్రీవాల్‌కు బెదిరింపు ఈమెయిల్

ఢిల్లీ: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కు ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి బెదిరింపులు రావడం కలకలం సృష్టించింది. సీఎం కేజ్రీవాల్ కుమార్తెను కిడ్నాప్ చేస్తామని, చేతనైతే రక్షించుకోండి అంటూ సీఎం కార్యాల యానికి బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. జనవరి 9న ఈ మెయిల్ వచ్చిందని, సీఎం కార్యాలయం ఈ మెయిల్‌ను ఢిల్లీ పోలీసు కమిషనర్ అమూల్య పట్నాయక్‌కు ఫార్వాడ్ చేసినట్లు సీఎం కార్యాలయ వర్గాలు తెలిపాయి.

శివసేనను ఓడించేవాడు ఇంకా పుట్టలేదు


• అమిత్‌షా వ్యాఖ్యలకు ఉద్ధవ్ కౌంటర్



ముంబై: శివసేనను ఓడించేవాడు ఇంకా పుట్టలేదని శివసేన చీఫ్ ఉద్ధవ్ థాక్రే తెలిపారు.లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో తమతో పొత్తులు పెట్టుకోని భాగస్వాములను ఓడిస్తాం అంటూ ఇటీవల శివసేనను ఉద్దేశించి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా ఉద్ధవ్ ఆదివారం ఈ వ్యాఖ్యలు చేశారు. 2014 నాటి మోడీ వేవ్‌ని ఉద్దేశించి మాట్లాడుతూ.. శివసేన తన ప్రయాణంలో లెక్కలేనన్ని వేవ్‌లను చూసిందని అన్నారు. ముంబైలోని వొర్లీ ప్రాంతంలో ఓ బహిరంగ ర్యాలీలో పాల్గొన్న ఉద్ధవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీలా కాకుండా రామమందిర నిర్మాణ విషయం గురించి ఎన్నికల ముందే శివసేన లేవనెత్తిందని అన్నారు. బీజేపీ నేతలు రామమందిర నిర్మాణ విషయాన్ని ఎన్నికల అంశంగా వాడుకుంటారని ఉద్ధవ్ ఆరోపించారు. జేడీయూ, ఎల్జేపీలు రామమందిర నిర్మా ణాన్ని వ్యతిరేకిస్తుంటే బీజేపీ ఏ విధంగా రామమందిరాన్ని నిర్మిస్తుందో చెప్పాలని ఆయన అన్నారు. మహారాష్ట్ర సంకీర్ణ ప్రభుత్వంలో శివసేన భాగస్వామిగా ఉన్న విషయం తెలిసిందే. అయితే కొంతకాలంగా శివసేన, బీజేపీ నేతల మధ్య మాట యుద్ధం కొనసాగుతోంది. అమిత్ షా ఇటీవల పొత్తులపై చేసిన వ్యాఖ్యలపై శివసేన నేతలు ఘాటుగానే జవాబిస్తున్నారు. బీజేపీని బొందబెడతాం అంటూ నాలుగురోజుల క్రితం మహారాష్ట్ర మంత్రిగా ఉన్న శివసేన నేత పేర్కొన్న విషయం తెలిసిందే.

‘రాఫెల్’ శుభలేఖ


• మోడీకి ఓటేయండి..అదే మాకు మీ దీవెన
• వివాహ ఆహ్వాన పత్రికలో వధూవరుల సందేశం



అహ్మదాబాద్: శుభలేఖ తెరవగానే వధూవరుల పేర్లు, విఘ్నేశ్వరుడి చిత్రం, వివాహ వేదిక, ముహూర్తం వంటి అంశాలపైకి మన దృష్టివెళ్తుంది. కానీ గుజరాత్ రాష్ట్రం సూరత్‌కు చెందిన ఓ శుభలేఖలో మరొక కొత్త విషయం కూడా బంధుమిత్రులను ఆకట్టుకుంటోంది. అదే ప్రధానమంత్రి నరేంద్ర మోడీని దీవించాలన్న పిలుపు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటేయండి.. ఇదే మీరు మాకిచ్చే దీవెన.. కానుక. దీంతోపాటు కాషాయపార్టీ యాప్‌తో లింక్ అవండి.. అంటూ యువరాజ్, సాక్షి దంపతులు తమ తమ శుభలేఖల్లో అచ్చువేయించారు. ఆహ్వానపత్రిక వెనుక పేజీలో.. ఇంకొక ఆకర్షణీయమైన ప్రకటన ఉంచారు. రాఫెల్ డీల్ వివరాలను పొందుపరిచారు. ఆందోళన వద్దు.. మోడీపై విశ్వాసం ఉంచండి అని ప్రధాన శీర్షిక జోడించారు. శీర్షికకు రెండు వైపులా రాఫెల్ విమానం బొమ్మను ఉంచారు. ఎంతటి అమాయకులైనా నమూనా విమానం ధరను పూర్తి ఆయుధ సహిత యుద్ధవిమానంతో పోల్చరు అంటూనే రాఫెల్ ఒప్పందంలో అవినీతి లేదనే సందేశం ఇచ్చే ప్రయత్నం చేశారు. సూరత్‌లో ఇలాంటి శుభలేక వైరల్ అవడం ఇది రెండోసారి. కొద్ది వారాల కిందట ధావల్ - జయ కూడా ఇలాంటి ప్రయత్నమే చేసి బంధుమిత్రులను ఆశ్చర్యంలో ముంచెత్తారు.

చైనా సరిహద్దులో 44 రహదారులు

• రూ.21,000 కోట్లతో భారత్ ప్రణాళికలు



న్యూఢిల్లీ: దేశ సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టనున్నారు. పొరుగుదేశాలైన చైనా, పాక్ సరిహద్దుకు సమీపంలో ఈ మేరకు వ్యూహాత్మక ప్రణాళిక అమలు చేయాలని సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యుడీ) కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. చైనా సరిహద్దు వెంబడి 44 రహదారులు, పాక్ సరిహద్దు ప్రాంతాల్లో 2100 కి.మీ. పరిధిలో ప్రధాన రహదారులు, అనుబంధ రహదారుల నిర్మాణం ఆవశ్యకతను వివరిస్తూ, వారం రోజుల కిందట సీపీడబ్ల్యుడీ 2018-19 వార్షిక నివేదికను విడుదల చేసింది. ఇందులో ఇండో-చైనా సరిహద్దులో 44 వ్యూహాత్మక రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు చేసింది. పాక్ సరిహద్దు వెంబడి వున్న పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో సత్వరమే రోడ్ల నిర్మాణం కూడా అవసరమని పేర్కొన్నది. తద్వారా అత్యవసర, వివాదాస్పద సందర్భాలలో రక్షణ బలగాల కదిలికలకు అనువుగా ఉంటుందని, విపత్తును వేగవంతంగా ఎదుర్కొనవచ్చని సదరు నివేదిక అభిప్రాయపడింది. జమ్ము-కాశ్మీర్ నుంచి అరుణాచల్ ప్రదేశ్‌వరకు భారత్- చైనా సరిహద్దు విస్తరించి వుంది. గతేడాది డోక్లాం ఉద్రిక్తత అనుభవం నేపథ్యంలో ఇక్కడ రహదారుల నిర్మాణం ప్రారంభమైంది. దాదాపు 44 రహదారులను 21 వేల కోట్ల వ్యయంతో చేపట్టనున్నట్లు సీపీడబ్ల్యుడీ పేర్కొంది. ఈ దారులు ఐదు రాష్ట్రాల గుండా (జమ్ము-కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్) సాగనున్నాయి. ఇందుకు సంబంధించిన డీపీఆర్ ప్రతిపాదనలు ప్రధానమంత్రి నేతృత్వంలోని భద్రతవ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్) పరిశీలనలో ఉన్నాయి. ఇక పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో పాక్ సరిహద్దు వెంబడి 2100కి.మీ పరిధిలో ప్రధాన, అనుబంధ రహదారులకు రూ. 5400 కోట్లు అవసరం అవుతాయని నివేదిక పేర్కొంది. రాజస్థాన్‌లో 945 కి.మీ. ప్రధాన రహదారులు, 533 కిమీ అనుబంధ రహదారులకు రూ. 3700కోట్లు, పంజాబ్‌లో రూ. 1750 కోట్లతో 482 కిమీ ప్రధాన రహదారులు, 219 కిమీ అనుబంధ రహదారులను చేపట్టనున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో మారుమూల సరిహద్దు ప్రాంతాల అభివృద్ధికి ఈ ప్రతిపాదనలు ఉపకరించనున్నాయి. పాకిస్తాన్‌తో భారత్ నాలుగు రాష్ట్రాల గుండా సరిహద్దును కలిగివుంది. జమ్ము కాశ్మీర్ (1225 కిమీ), రాజస్థాన్ (1037 కి.మీ), పంజాబ్ (533 కి.మీ), గుజరాత్ (508 కి.మీ) పరిధిలో దాదాపు మూడువేల కిలోమీటర్ల సరిహద్దును కలిగివుంది.

కుల్గాంలో ఉగ్రవాది ఇస్లామ్ హతం


శ్రీనగర్: జమ్ముకాశ్మీర్లోని కుల్గాం జిల్లాలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్లో అల్ బదర్ ఉగ్రసంస్థకు చెందిన కరడుగట్టిన ఉగ్రవాది జీనత్ ఉల్ ఇస్లామ్‌ను భద్రతాదళాలు హతమార్చాయి. ఎ ప్లస్ ప్లస్ కేటగిరికి చెందిన ఇస్లామ్‌తోపాటు మరో ఉగ్రవాది షకీల్‌దార్ కూడా ఎదురుకాల్పుల్లో హతమయ్యాడని పోలీసులు తెలిపారు. వీరిద్దరూ అనేక ఉగ్రకార్యకలాపాలకు పాల్పడ్డారని పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. అల్ బదర్ సంస్థను బలోపేతం చేసేందుకు గతేడాది నవంబర్‌లో జీనత్ ఉల్ ఇస్లామ్ హిజ్బుల్ ముజాహిదీన్ నుంచి అల్ బదర్ ఉగ్రసంస్థలో చేరాడని పోలీసులు వివరించారు. ఉగ్రవాదుల సంచారంపై అందిన సమాచారం మేరకు శనివారం సాయంత్రం కుప్వారా జిల్లా యారిపోరాలోని కత్‌పోరా ప్రాంతంలో కార్డన్‌సెర్చ్ చేపట్టినట్టు తెలిపారు. ఈ క్రమంలో ఉగ్రవాదులు భద్రతాదళాలపైకి కాల్పులు జరిపారని దీంతో సైనిక దళాలు ఎదురుకాల్పులు జరిపారన్నారు. ఉగ్రవాదులు లొంగిపోయేందుకు అవకాశం ఇచ్చినా వారు భద్రతాదళాలపై కాల్పులకు తెగబడ్డారని పోలీసులు తెలిపారు. దీంతో ఇరువర్గాల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారని పోలీస్ అధికారి ప్రతినిధి తెలిపారు. పోలీస్ రికార్డుల ప్రకారం ఇస్లామ్‌కు సుదీర్ఘ చరిత్ర ఉందని ఇతను 2006నుంచి ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు పోలీస్ రికార్డుల్లో నమోదైందని ఆయన తెలిపారు.

ఆర్మీలో హనీ ట్రాప్ కలకలం

• జవానుని అరెస్ట్‌చేసిన రాజస్థాన్ పోలీసులు

జైపూర్: భారత ఆర్మీలో మరోసారి హనీట్రాప్ కలకలం రేపింది. పాకిస్థాన్‌కి చెందిన నిఘా సంస్థ ఐఎస్ఐకి చెందిన ఓ యువతి సోషల్ మీడియా ద్వారా 50మంది భారతీయ జవాన్లను ట్రాప్ చేసి వారి నుంచి కీలక సమాచారం తెలుసుకునట్లు తెలుస్తోంది. జైసల్మేర్‌లోని టాంక్ రెజిమెంట్‌లో పనిచేస్తున్న ఓ ఆర్మీ జవాను ఆర్మీకి సంబంధించిన కీలక సమాచారాన్ని ఆమెతో పంచుకొన్నట్లు తేలడంతో జవానుని రాజస్థాన్ పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ కేసు విచారణలో పోలీసులకి ఆర్మీ అన్ని విధాలసహకారం అందిస్తుందని డిఫెన్స్ పీఆర్‌వో కల్నల్ సంబిత్ గోష్ తెలిపారు. అరెస్ట్ అయిన జవానుని హర్యానాకి చెందిన సోంబిర్‌గా పోలీసులు గుర్తించారు. ఐఎస్ఐకి చెందిన మహిళ ఫేస్‌బుక్‌లో అనికా చోప్రా పేరుతో జవాను సోంబిర్‌తో ప్రతిరోజూ చాటింగ్ చేస్తూ ఉండేదని, ఆర్మీ ఆయుధాలకు సంబంధించిన కీలక సమాచారాన్ని, ఆర్మీ కదలికల సమాచారాన్ని జవాను ఆమెకు చేరవేసినట్లు ఆర్మీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే అనేకమంది జవాన్లతో ఆమె టచ్‌లో ఉందని, అనేకమంది అధికారుల ఫేస్‌బుక్ అకౌంట్లను ఆర్మీ పరిశీలిస్తోందని, అధికారుల నుంచి కీలక సమా చారం ఆమెకు వెళ్లిందా అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్మీ వర్గాలు తెలిపాయి.

ఓటాన్ అకౌంట్ బడ్జెట్ దారెటు?



● జనాకర్షక పథకాల ప్రకటనపై ఆశలు ● సంక్షేమం, ఆరోగ్యానికి అగ్రతాంబూలం
● తాయిలాల కోసం రైతుల ఎదురుచూపులు ● ఓట్ల వేట దిశగా తాత్కలిక పద్దు!


న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వానికి, ప్రభుత్వంలో ఉన్న బీజేపీ ఇతర భాగస్వామ్య పార్టీలకు రాబోయే ఎన్నికల్లో లబ్ది కలిగే కొత్త విధానాలను ఆర్థిక మంత్రి ప్రకటించరని, అయితే రాబోయే అయిదేళ్ల కాలానికి గాను ఓటాన్ బడ్జెట్‌లో ఆర్థిక ప్రణాళిక సిద్ధం చేస్తారని తెలుస్తోంది. ఇక ఓటాన్ బడ్జెట్ సమావేశాలు జనవరి 31 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఉంటాయని భావిస్తున్నారు. ఫిబ్రవరి ఒకటవ తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెడతారు. గతం నుంచి వస్తున్న సంప్రదాయం ప్రకారం ఎన్నికల ఏడాదిలో ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలలకు గాను కొత్త పథకాలను ప్రకటించడం, ఆర్థిక విధానాలను తీసుకోవడం వంటివి ఉండవు. అయితే రాబోయే అయిదేళ్లకు ఆర్థిక ప్రణాళికను రూపొందించడానికి ప్రభుత్వానికీ ఏదీ అడ్డురాదు.

2014-15 ఓటాన్ బడ్జెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా నాటి ఆర్థిక మంత్రి చిదంబరం వన్ ర్యాంక్, వన్ పెన్షన్ పథకం ప్రకటించి దానికి రూ.500 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. దీనిపై అరుణ్ జైట్లీ తీవ్ర విమర్శలు గుప్పించారు. వన్ ర్యాంక్, వన్ పెన్షన్ పథకానికి దాదాపు రూ.7500 వ్యయం అవుతుందని అంచనా ఉంటే కేవలం అయిదు వందల కోట్లు మాత్రమే కేటాయించి ఎలా చేతులు దులుపుకుంటారని ప్రశ్నించారు. అయితే ఆ తరువాత ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వన్ ర్యాంక్ వన్ పెన్షన్ పథకాన్ని అమలు చేసిన విషయం తెలిసిందే.

ప్రజాకర్షక విధానాలకు పెద్దపీట?

వ్యవసాయ సంబంధ సమస్యలు, నిరుద్యోగం, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్న నేపథ్యంలో ఓటాన్ బడ్జెట్‌లో కేంద్ర ్రభుత్వం ఆయా వర్గాలను సంతృప్తి పరచడానికి తాయిలాలు ప్రకటించే అవకాశముంది. ఇదే కాకుండా గత యూపీయే హయంలో ఓటాన్ బడ్జెట్ సమయంలో నాటి చిదంబరం వన్ నేషన్ వన్ పెన్షన్ పథకం ప్రకటించి, దానికి నిధులు కేటాయించినట్లుగానే ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కూడా ప్రజాకర్షక విధానాలను ప్రకటించే అవకాశముందని అంటున్నారు. దీనికి అనుగుణంగానే బీజేపీ నాయకుల ప్రకటనలు కూడా ఉన్నాయి.

ఓటాన్ బడ్జెట్‌లో సంక్షేమం, సామాజిక భద్రత, ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి ఉంటుందంటున్నారు. ప్రస్తుతం పెట్రో ధరలు నియంత్రణలో ఉన్నాయని, ద్రవ్యోల్బణ నిర్వహణ కూడా బాగానే ఉందని అంటున్నారు. ప్రత్యక్ష పన్నులు పెరిగాయని, దీంతో ఆర్థిక వనరుల లభ్యత కూడా బాగా ఉందంటున్నారు. ఇప్పుడు ప్రభుత్వం సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలపై దృష్టి పెడుతుందంటున్నారు. ఓటాన్ బడ్జెట్‌లో వీటికే ప్రాధాన్యత ఉండే అవకాశముందని వెల్లడించారు. ఎన్నికలు సమీపించే కొద్దీ మోడీ ప్రభుత్వం ప్రజాకర్షక విధానాలకు ప్రాముఖ్యత ఇస్తోంది. ఇటీవలే అగ్రవర్ణాల్లో వెనుకబడిన వర్గాలకు పదిశాతం రిజర్వేషన్ కల్పించడమే దీనికి నిదర్శనమంటున్నారు. తిరిగి అధికారంలోకి వస్తే రాబోయే అయిదేళ్లలో తమ ప్రభుత్వం ఏమేం చేయబోతోందో అన్న దానిపైనే ఆర్థిక మంత్రి జైట్లీ దృష్టిపెడతారనే భావన వ్యక్తమవుతోంది.



రైతు రుణ మాఫీ ఉండకపోవచ్చు..!

ఇక రైతు రుణ మాఫీ గురించి విపక్ష నేత రాహుల్‌గాంధీ విపరీతంగా ప్రచారం చేస్తున్న నేపథ్యంలో దీనిపై ప్రధాని నరేంద్రమోడీ ఏ నిర్ణయం తీసుకుంటారు? ఓటాన్ బడ్జెట్‌లో దీనిపై ప్రస్తావన ఉంటుందా అన్ని ఆర్థిక వర్గాల్లో చర్చనీయాంశమైంది. ప్రధాని మోడీ రైతు రుణ మాఫీకి మొగ్గు చూపడం లేదని, దీనికి బదులుగా రైతులకు నేరుగా ఆర్థిక లబ్ధి చేకూర్చే విధానాలను ప్రకటించ వచ్చనే వాదనా ఉంది. ఇక 2016లోనే రైలు, సాధారణ బడ్జెట్‌లను విడివిడిగా ప్రవేశపెట్టే 92 సంవత్సరాల సంప్రదాయానికి ఎన్డీయే తిలోదకాలు ఇచ్చిన నేపథ్యంలో 2019 ఓటాన్ బడ్జెట్‌లోనే రైల్వే బడ్జెట్ కూడా ఉండబోతోంది.

ఆర్థిక సర్వే ఉండదు: సంజయ్ సన్యాల్

ఇక ఓటాన్ బడ్జెట్‌లో ఏయే అంశాలు ఉండాలని నిర్వ హించిన ఒక సర్వేలో ఆదాయ పన్ను, జీఎస్టీ గురించి జైట్లీ పొందుపరచాలని 64 శాతం మంది భావిస్తే, దేశ వ్యాప్తంగా రైతు రుణ మాఫీ చేయాలన్న ప్రతిపాదనను 71 శాతం మంది వ్యతిరేకించడం విశేషం. ఓటాన్ బడ్జెట్‌లో ప్రత్యక్ష పన్నుల సంబంధించిన సవరణలను ప్రభుత్వం చేయవచ్చని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. అయితే వ్యయానికి సంబంధిం చి ఓటాన్ బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వానికి వెసులు బాటు ఉంటుందని, ఇక సంక్షేమ పథకాలను ప్రకటించే అవకాశము న్నా వాటికి నిధులు కేటాయించలేరని వెల్లడించారు. జైట్లీ ప్రవేశపెట్టబోయే ఓటాన్ బడ్జెట్‌లో విధానపరమైన మార్గదర్శ కాలు ఉండే అవకాశముందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖకు ఆర్థిక సలహాదారుగా ఉన్న సంజయ్ స న్యాల్ తెలిపారు. అయితే ఆ మార్గద ర్శకాలు ఎలా ఉంటాయి, వేటికి సం బంధించనవి వంటి విషయాలను వెల్లడించడానికి సన్యాల్ తిరస్క రించడ విశేషం. ఇక ఈసారి ఓ టాన్ బడ్జెట్‌కి ముందు ఆర్థిక సర్వే ఉండదని సన్యాల్ స్పష్టం చేశారు. జూన్ లేదా జూలైలో ప్రవేశపెట్టే పూర్తి స్థాయి బడ్జెట్ ముందు మాత్రమే ఆర్థిక సర్వే ఉంటుందన్నారు.

మధ్యంతర డివిడెండ్ ఎందుకు?

2018-19 ఆర్థిక సంవత్సరంలో ఏర్పడ్డ 3.3 శాతం ఆర్థిక లోటును పూడ్చుకోవడానికి రిజర్వు బ్యాంకు నుంచి ఇంటీరియం డివిడెండ్ తీసుకోనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇది వరకే ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఇంటీరియం డివిడెండ్‌కి సంబంధించిన తుది ప్రతిపాదన తమకు ఇంకా అందలే దని, దీనిపై సెంట్రల్ బ్యాంకు తుది నిర్ణయం తీసుకుంటుందని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ చెప్పారు. గడిచిన ఆర్థిక సంవత్స రంలో ఇదే ఇంటీరియం డివిడెండ్ కింద కేంద్ర ప్రభుత్వం ఆర్బీఐ నుంచి రూ.10 వేల కోట్లు తీసుకున్న విషయం తెలిసిం దే. ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా ఇంటీరియం డివిడెండ్ తీసుకోనున్న ట్లు ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ గత డిసెంబర్ లోనే వెల్లడించారు. ఇక బడ్జెట్ అంచ నాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం లో ఆర్థిక సంస్థలు, జాతీయ బ్యాంకులు, రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా వద్ద మిగులు నిధులు రూ.54,817 కోట్లు ఉంటాయని తెలుస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు డివిడెండ్ కింద కేంద్ర ప్రభుత్వం రూ.40 వేల కోట్లు తీసుకుంది.

మోడీ ఏం మాయ చేస్తాడో!

2019 ఓటాన్ బడ్జెట్‌లో మధ్యతరగతికి మోడీ ప్రభుత్వం తాయిలాలు ప్రకటించే అవకాశముందని తెలుస్తోంది. 80సి పరిమితిని పెంచడం గృహ రుణాల మినహాయింపు పరిమితిని పెంచే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80 సి కింద పన్ను మినహాయింపు పెంచాలనే దేశంలోని మధ్య తరగతి వర్గాల చిరకాల కోరికపై ఎన్డీయే ప్రభుత్వం ఈ ఓటాన్ బడ్జెట్‌లో సానుకూలంగా స్పందించే అవకాశముందని భావిస్తున్నారు. వేతన జీవులకు ఊరట ఇవ్వడం ద్వారా మధ్యతరగతి మనస్సు దోచుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. మధ్యతరగతిలో తమ ప్రభుత్వ పలుకుబడి పెంచుకోవడానికి కొన్ని చర్యలు తీసుకొనే అవకాశముందని గత వారం ప్రధాని చేసిన ప్రకటన తాత్పర్యం ఇదేనని అంటున్నారు.

రైతులకు, కార్మికులకు, పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నా.. ప్రభుత్వాలు తమను ఏమాత్రం పట్టించుకోవడం లేదనే బాధలో దేశంలోని మధ్యతరగతి ఉందనే భావనలో ప్రధాని ప్రకటన ఉందని అంటున్నారు. దేశంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతున్నా మధ్యతరగతిని ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రధాని వ్యాఖ్యను వారు గుర్తు చేస్తున్నారు. మధ్యతరగతిని ఆదుకోవడం ఒక బాధ్యత కాదని, అది జాతి నిర్వర్తించాల్సిన విధి అని ప్రధాని చెప్పారు. మధ్యతరగతి పట్ల మన దృక్పథం మార్చుకోవాల్సిన సమయం వచ్చిందని ప్రధాని మోడీ అన్నారు.

అగ్రవర్ణాల్లో పేదలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించినట్లే, మధ్య తరగతి బాధలకు కూడా పరిష్కారం ఇవ్వాల్సిందేనని ప్రధాని స్పష్టం చేశారు. రాబోయే బడ్జెట్‌లో పన్నుల రూపేణా దేశంలోని మధ్య తరగతికి ఊరట ఇవ్వాలని ప్రధాని మోడీ అభిప్రాయపడ్డారు. గత వారం ప్రధాని చేసిన ఈ ప్రకటనపై మధ్యతరగతి ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఓటాన్ బడ్జెట్ అయినప్పటికీ, తమకు పన్నుల రూపంలో ఊరట లభిస్తుందని దేశంలోని మధ్య తరగతి వర్గాలు ఆశిస్తున్నాయి. ప్రధాని సైతం నేరుగానే తమ బాధలు గురించి ప్రస్తావించడంతో ఈసారైనా తమకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు.

మధ్యతరగతిపై ప్రధాని నరేంద్రమోడీ అభిప్రాయం వెల్లడైన నేపథ్యంలో ఆర్థిక మంత్రిత్వశాఖ కూడా ఆయన మనస్సు ఎరిగి ప్రవర్తిస్తుందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తన పరిధిలో మధ్య తరగతికి పన్నుల విషయంలో వెసులుబాటు కలిగిస్తుందని తెలుస్తోంది.

దేశంలో పన్ను చెల్లించే వర్గాల్లో మధ్య తరగతి అంత నిజాయితీ మరొకటి లేదని, వారికి న్యాయం చేయాల్సిందేనని ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఒక ఉన్నతాధికారి చెప్పారు. వార్షికాదాయం రూ.8 లక్షలకు లోబడి ఉన్న వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పించడం మధ్య తరగతిని బుజ్జ గించడమేనని అంటున్నారు.

ఈసారి ఆర్థిక లోటు లక్ష్యం ఎంత?

దేశ ఆర్థిక లోటుకి సంబంధించి ప్రధాని మోడీ ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. నవంబర్, 2018 నాటికి భారత దేశపు ఆర్థిక లోటు రూ.7.17 లక్షల కోట్లు ఉంది. ఎన్డీయే ప్రభుత్వం మాత్రం ఆర్థిక లోటు రూ.6.24 లక్షల కోట్లు మించరాదని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ అది దాదాపు ఒక లక్ష కోట్లు ఎక్కువగా నమోదైంది. ఈ గణాంకాల నేపథ్యంలో ఆర్థిక లోటును పూడ్చడానికి తాజాగా ఎలాంటి లక్ష్యాలను కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకుంటుందన్నది ఆర్థిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఏయే రంగాలకు ఎంతెంత?

2019 బడ్జెట్ ప్రవేశపెట్టే సమయం వచ్చేసింది. ప్రజల ఆకాంక్షలకు తగిన బడ్జెట్‌ను రూపొందించడంలో ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ బిజీగా ఉన్నారు. ఫిబ్రవరి ఒకటిన ఓటాన్ బడ్జెట్‌ను పార్లమెంటు ఉభయసభల ముందు ప్రవేశపెట్టనున్న తరుణంలో ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం ఏయే రంగాలపై వ్యయం చేయనుందో ఒకసారి చూద్దాం.




విద్య:

విద్యపై ఎన్డీయే ప్రభుత్వం ఎక్కువ శ్రద్ధ చూపిస్తోంది. కొత్త ఐఐఎమ్‌లు, ఐఐటీలు, ఐఐఎస్ఈఆర్‌లు, ఏఐఐఎమ్ఎస్‌ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోంది. ఈ విద్యాలయాల్లో ప్రపంచస్థాయి మౌలిక సౌకర్యాల కల్పన కోసం ప్రత్యేకంగా హైయ్యర్ ఎడ్యుకేషన్ ఫండింగ్ ఏజెన్సీ కూడా ఏర్పాటు చేసింది. నైపుణ్యాభివృద్ధి కోసం ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజనకి ప్రభుత్వం భారీగా నిధులు సమకూరుస్తోంది. గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన విద్యను అందుబాటు ధరల్లో అందించడానికి ఏకలవ్య పాఠశాలలను ప్రారంభించారు. ఏకలవ్య పాఠశాల్లో పిల్లలకు మంచి విద్యా బోధన చేయడానికి నిధులు కేటాయించారు. దేశంలో పాఠశాలల్లో విద్యా ప్రమాణాల అధ్యయనం కోసం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేని నిర్వహించారు.

వ్యవసాయం:




దేశంలో రైతులు రుణ భారంతో కుంగిపోతున్నారు. సంస్థాగత రుణాలు అందక నానా ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది బడ్జెట్‌లో వ్యవసాయ రుణాలు మంజూరుకి రూ.11 లక్షల కోట్లు కేటాయించారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ బడ్జెట్‌ను రూ.51,576 కోట్ల నుంచి 58,080 కోట్లు పెంచారు. పంట నష్టంతో పాటు రుతు పవనాలు సవ్యంగా లేకపోవడంతో వ్యవసాయ రంగాన్ని కుదేలు చేసింది. దీంతో ప్రధానమంత్రి క్రిషి సించాయ్ యోజన, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కోసం నిధులు కేటాయించారు. బిందు సేద్యం కోసం నాబార్డు ద్వారా సూక్ష్మ వ్యవసాయం నిధిని ఏర్పాటు చేశారు.



ఆరోగ్య సంరక్షణ:

ప్రజలు తమ కష్టార్జితాన్ని ఆరోగ్య సంరక్షణ కోసం వ్యయం చేయడం నుంచి విముక్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో ప్రతిష్టాత్మకమైన ఆయుష్మాన్ భారత్‌ను ప్రవేశపెట్టింది. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రభుత్వం ప్రాయోజిత ఆరోగ్య బీమా కార్యక్రమం ఆయుష్మాన్ భారత్‌కి రూ.12 వందల కోట్లు కేటాయించారు. దీని కింద బీమా పొందిన కుటుంబాలకు వైద్య ఖర్చుల నిమిత్తం ఏటా అయిదు లక్షల లబ్ధి చేకూరుతుంది. ఆయుష్మాన్ భారత్‌కి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకి జరిపిన కేటాయింపుల్లో యాభై అయిదు శాతం కేటాయిస్తున్నారు. అయితే ఈ మంత్రిత్వశాఖకి గత ఏడాది కన్నా ఈసారి తక్కువ నిధులు కేటాంచారు.

మహిళా సమస్యలు




కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వశాఖకి ఈసారి గణనీయంగా నిధులు కేటాయించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గత ఏడాది కన్నా అదనంగా రూ.2,605 కోట్లు కేటాయించారు. ఇది పన్నెండు శాతం అధికంగా ఉంది. ఇందులో ఎక్కువగా మహిళల భద్రత, సాధికారత, విద్య, సమానత్వం, పురోగతికి ప్రాధాన్యత ఇచ్చారు. నిర్భయ నిధికి ఏటా రూ.500 కోట్లు కేటాయిస్తున్నారు. ప్రధాని నరేంద్రమోడీ మానస పుత్రిక బేటి బచావో బేటి పడావో కార్యక్రమానికి అత్యధిక నిధులు కేటాయించారు. 2018 బడ్జెట్‌లో ఈ కార్యక్రమానికి రూ.280 కోట్లు కేటాయించారు. ఉదాన్, ప్రగతి వంటి పథకాలు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల బాలికల విద్యపై దృష్టి పెట్టాయి. ప్రసవం, మరణాలపైనా ప్రభుత్వం నిధులు వ్యయం చేస్తోంది. ప్రధానమంత్రి మాత్రివ వందన యోజన కోసం గత ఏడాది రూ.2,700 కోట్లు కేటాయించారు.

మౌలిక సదుపాయాలు:



భారతదేశ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందాలంటే మౌలిక సౌకర్యాల కల్పన ముఖ్యమని మోడీ ప్రభుత్వం ముందు నుంచి బలంగా విశ్వసిస్తోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బహుళ రవాణా వ్యవస్థల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చింది. సామాన్యుడికి ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకొని రావడానికి ఉడాన్ పథకాన్ని ప్రవేశపెట్టారు. అదే విధంగా అతి పెద్ద జాతీయ రహదారుల నిర్మాణం భారత్‌మాల, ఓడ రేవుల అభివృద్ధికి సాగరమాలకి నిధులు భారీగా కేటాయించారు. భారతీయ రైల్వేలకు 2018 బడ్జెట్‌లో రూ.1.48 లక్షల కోట్లు కేటాయింపులు జరిపారు.

గృహ నిర్మాణం:



ప్రజలకు అందుబాటులో ఉండే గృహ నిర్మాణాల కోసం కేంద్ర ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన వారి కోసం, బలహీన వర్గాల కోసం ఈ సహాయం అందిస్తోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద 2018 బడ్జెట్‌లో రూ.64 వేల కోట్లు కేటాయించారు. 2022 నాటికి ఈ పథకం కింద రెండు కోట్ల గృహాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

సాంఘిక సంక్షేమం:

వికలాంగులు, మైనారిటీలు, ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలు, సీనియర్ సిటిజెన్ల సంక్షేమం, సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు వ్యయం చేస్తోంది. వికలాంగులకు సౌకర్యవంతమైన మౌలిక సౌకర్యాల కల్పనకు నిధులు సమకూరుస్తోంది. దివ్యాంగులు సాంకేతిక విద్య అభ్యసించడానికి సాక్ష్యం పథకం కింద ఉపకార వేతనాలను అందిస్తోంది. సీనియర్ సిటిజెన్లకు పన్ను మినహాయింపులు, ఆరోగ్య సంరక్షణకు నిధులు అందిస్తున్నారు. ప్రధాన మంత్రి వయ వందన యోజన పథకం ద్వారా సీనియర్ సిటిజెన్లకు పెన్షన్ పథకాలను అమలు చేస్తున్నారు.


ఇవే కాకుండా ప్రధానమంత్రి ఉజ్వల యోజన, సౌభాగ్య యోజన పథకాలకూ ప్రభుత్వ నిధులు అందుతున్నాయి. ప్రధానంగా ఈ పథకాలన్ని ప్రజల ఆర్థిక స్వావలంభనను పెంచడానికి వీలుగా ఉండడంతో ఎన్నికల వేళ ప్రవేశపెట్టే ఓటాన్ బడ్జెట్‌లో కూడా వీటికి ప్రాధాన్యపరమైన కేటాయింపులు ఉంటాయని భావిస్తున్నారు.



వేతన జీవులకు ఊరట లభించేనా!

● 2018లో మారని శ్లాబులు ● ఈసారైనా మోక్షం కలుగుతుందా? ● జీఎస్టీ నేపథ్యంలో మారాలంటూ వినతులు ● రూ.5 లక్షల వరకు మినహాయింపు ఇవ్వాలి.. ● ఆర్థిక మంత్రి జైట్లీకి మధ్య తరగతి విజ్ఞప్తులు


ఈ ఏడాది బడ్జెట్‌లో ఏముంటుందో అన్న దానిపై అన్ని వర్గాల ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రధానమైన ఆర్థికపరమైన ప్రకటనలు ఉంటాయా లేదా అన్నది ఇప్పుడు చర్చనీయంశమైంది. ఓటాన్ బడ్జెట్ కావడం, ఎన్నికల సమయం కావడంతో మోడీ ప్రభుత్వం ఏవైనా వరాల జల్లు కురిపిస్తుందా అన్నది కీలకంగా మారింది. ఇందులో ప్రధానంగా ఆదాయ పన్ను తగ్గుతుందా లేదా అని ప్రత్యేకించి మధ్యతరగతి వర్గాలు, వేతన జీవులు ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు అర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రసంగానికి ప్రత్యక్ష సంబంధముందని అంటున్నారు. ఎన్నికల వేళ తాత్కాలిక వ్యయ అవసరాల కోసం ప్రవేశపెట్టే ఓటాన్ బడ్జెట్, ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చే ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను రూపొందించడం ఆనవాయితీగా వస్తోంది. ఇటీవల కాలంలో ఎన్నికల సమయంలో ప్రవేశపెట్టే ఓటాన్ బడ్జెట్‌లలో ప్రధానమైన విధానపరమైన ప్రకటనలను ఏ ప్రభుత్వాలు చేయలేదు. అయితే మోడీ ప్రభుత్వం ఈ సంప్రదాయాన్ని ఈసారి బద్దలు కొడుతుందని ఆర్థిక వర్గాలు అంచనా వేస్తున్నాయి. జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దు, అగ్ర వర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్లు వంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొని విజయవంతంగా అమలు చేసిన ఎన్డీయే ప్రభుత్వం ఓటాన్ బడ్జెట్‌లోనూ వినూత్నంగా వ్యవహరిస్తుందని అంటున్నారు. అదే జరిగితే.. ఓటాన్ బడ్జెట్‌లో ప్రధానంగా మధ్య తరగతికి ఊరటనిచ్చే అంశాలుంటాయని అంటున్నారు. గడిచిన వారంలో ప్రధాని మోడీ స్వయంగా దేశంలో మధ్య తరగతికి న్యాయం చేయాల్సిందేనని చేసిన ప్రకటన దీనికి ఉదాహరణగా చెబుతున్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేసినా.. మధ్య తరగతికి న్యాయం చేయాల్సి ఉందనే భావనను ప్రధాని వ్యక్తం చేయడంలో ప్రధానంగా ఆదాయ పన్ను పరిమితి సవరణ ఉంటుందంటున్నారు. మధ్య తరగతి వర్గాల మనస్సు గెలుచుకోవడానికి ఆదాయపు పన్ను నిర్మాణాన్ని మార్చే విప్లవాత్మక నిర్ణయాలను బడ్జెట్‌లో ప్రకటిస్తారని ఆశిస్తున్నారు.



2018 బడ్జెట్‌లో కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని ఏమాత్రం మార్చలేదు. అయితే కొన్ని మార్పులు చేశారు. వ్యక్తిగత ఆదాయంపై సెస్ విధించడం ద్వారా ఆదాయ పన్ను రేట్లు ప్రభావితం అయ్యాయి. ప్రస్తుతం దేశంలో అరవై సంవత్సరాల లోపు ఉన్న వారి వార్షిక ఆదాయం రూ.2.5 లక్షలు ఉంటే ఎలాంటి పన్ను ఉండదు. అరవై సంవత్సరాల లోపు ఉన్నవారి వార్షిక ఆదాయం రూ.2.5 లక్షలకు, రూ.3 లక్షల మధ్య ఉంటే వారు అయిదు శాతం ఆదాయపు పన్ను చెల్లించాలి. ఇదే కేటగిరిలో సీనియర్ సిటిజెన్లకు పూర్తిస్థాయిలో మినహాయింపు ఉంది. ఇక మూడు నుంచి అయిదు లక్షల మధ్య వార్షిక ఆదాయం ఉన్న అరవై సంవత్సరాల లోపు వ్యక్తులు అయిదు శాతం పన్ను చెల్లించాలి. అదే వీరి ఆదాయం అయిదు నుంచి పది లక్షల మధ్య ఉంటే మాత్రం ఆదాయపు పన్ను కింద ఇరవై శాతం చెల్లించాలి. ఇక పది లక్షలకు పైగా ఆదాయం ఉన్న వారంతా వయసుతో నిమిత్తం లేకుండా ముప్పై శాతం పన్ను చెల్లించాలి.

ఇప్పుడు ఈ ఇన్‌కమ్ టాక్స్ శ్లాబుల్లో మార్పు కోసం మధ్యతరగతి ఎదురు చూస్తోంది. వార్షిక ఆదాయం మూడు లక్షలున్నప్పటికీ పెరిగిన జీవన వ్యయం కారణంగా కుటుంబ అవసరాలకే ఏమాత్రం సరిపోవడం లేదని, అందులో మిగులు లేకపోవడమే కాకుండా ప్రభుత్వానికి అయిదు శాతం ఆదాయ పన్ను కింద చెల్లించడం అదనపు భారంగా మారుతోందని మధ్యతరగతి వాపోతోంది.

అయిదు నుంచి పది లక్షల మధ్య ఆదాయం ఉన్నవారిపై ఇరవై శాతం పన్నుపైనా ఆయా వర్గాలు అసంతృప్తితో ఉన్నాయి. ఇక మూడు నుంచి అయిదు లక్షల వార్షిక ఆదాయం ఉన్నవారు పది శాతం పన్ను చెల్లించాల్సి రావడం పెను భారంగా భావిస్తున్నారు. మూడు లక్షలే సరిపోవడం లేదని, ఏదో రూపంలో ఆదాయం పెంచుకుంటే.. ఆ మూడు లక్షలు దాటి ఒక రూపాయి పెరిగినా.. పదిశాతం పన్ను చెల్లించడమంటే.. అదనంగా పెరిగిన వేతనం మూడు లక్షల లోపలకి పడిపోతోందని, ఇదేం న్యాయమని ఆయా వర్గాలు వాపోతున్నాయి. అధికాదాయ వర్గాలకు ఈ ఓటాన్ బడ్జెట్‌లో న్యాయం చేయకపోయినా, కనీసం మధ్యతరగతి జీవులకు ఊరట అయినా లభిస్తుందని ఆశిస్తున్నారు. ఆదాయ పన్ను శ్లాబుల్లో మార్పులు చేయాల్సిందేనంటున్నారు. జీఎస్టీ అమలు చేస్తున్న నేపథ్యంలోనూ అయిదు లక్షల శ్లాబును పన్ను రహితం చేయాలనే విన్నపాలు వివిధ వర్గాల నుంచి కేంద్ర ఆర్థిక శాఖకి అందినట్లు తెలుస్తోంది. వీటిపై విత్తమంత్రి జైట్లీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.



మాఊరు-మారాజ్యం

తండా..ఏకగ్రీవ జెండా

- మెజార్టీ ప్రాంతాల్లో అదే బాట
- వికారాబాద్ జిల్లాలో 38 పంచాయతీలు ఏకగ్రీవం
- షాద్‌నగర్ నియోజకవర్గంలో 17 జీపీలు
- మెజార్టీ పంచాయతీలు అధికార పక్షం ఖాతాలోనే..



రంగారెడ్డి, ప్రభన్యూస్ : అవి చిన్న చిన్న పంచాయతీలు ఐదువందల జనాభా ఉన్న తండాలు ఎన్నికలకు వెళ్తే ప్రయోజనం ఉండదని భావిస్తున్నారు...ఏకగ్రీవం చేసుకుంటే ప్రభుత్వం ఇచ్చే రూ. 10లక్షల నజరానాతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవచ్చునని తండావాసులు నమ్ముతున్నారు. అందులో భాగంగానే మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో తండాల్లో ఏకగ్రీవాలు అవుతున్నాయి. పార్టీలకు అతీతంగా స్థానికులు ఏక ్మై కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. చిన్న పంచాయతీలు కావడంతో అంతగా నిధులు వచ్చే అవకాశాలు తక్కువే. భూముల రిజిస్ట్రేషన్లు జరిగితే దండిగా వాటా వస్తుంది. కానీ ఆ తండాల పరిధిలో రెవెన్యూ తక్కువే కావడంతో ప్రజలు ఏకగ్రీవాలపై దృష్టిని కేంద్రీకరించారు. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక నిధులతోపాటు ఎమ్మెల్యేలు కూడా నిధులు కేటాయిస్తామని హామీలు ఇవ్వడంతో ప్రజలు ఏకగ్రీవాల వైపు మొగ్గు చూపుతున్నారు.

మొదటి విడత పంచాయతీ ఎన్నికలు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో 461 పంచాయతీల్లో నిర్వహిస్తున్నారు. ఇందులో ఇప్పటికే 55 పంచాయతీల్లో సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇందులో వికారాబాద్ జిల్లా పరిధిలో 38 పంచాయతీలు, రంగారెడ్డి జిల్లా పరిధిలోని షాద్‌నగర్ నియోజకవర్గంలో 17 జీపీలు ఏకగ్రీవమయ్యాయి. ఇందులో మెజార్టీ పంచాయతీలు అధికార తెరాస పక్షమే. ఎన్నో సంవత్సరాలుగా అనుబంధ గ్రామాలుగా కొనసాగిన తండాలను సీఎం కేసీఆర్ పంచాయతీలు చేశారు. 500 జనాభా కంటే తక్కువగా ఉన్న తండాలను కూడా పంచాయతీలు చేశారు. ఎన్నో సంవత్సరాలుగా వారు ఎదురు చూస్తున్న కోరిక నెరవేరింది.

వచ్చిన అవకాశాన్ని తండావాసులు సద్వినియోగం చేసుకుంటున్నారు. తండావాసులు ఏక ్మై ఏకగ్రీవాలు చేసుకుంటున్నారు. తాండాలు ఎక్కు వగా ఉన్న కొడంగల్, తాండూరు, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో ఏకగ్రీ వాలవు తున్నాయి. తాండూరు నియోజకవర్గంలో మొదటి విడతలో భాగంగా 16 జేపీలు ఏకగ్రీవమయ్యాయి. ఇందులో తెరాస ఖాతాలోకి 14 పంచాయతీలు చేరాయి. కొడంగల్ నియోజకవర్గంలో 13 పంచాయతీలు ఏక గ్రీవమ య్యాయి. కొడంగల్, దౌల్తాబాద్, బొమ్మరాజ్‌పేట మండలాలు ఏక గ్రీవాలయ్యాయి. ఇందులో కేవలం ఒక పంచాయతీ ఏక గ్రీవంతో కాంగ్రెస్ సరిపెట్టుకుంది. వికారాబాద్ నియోజకవర్గంలో తొమి ్మది పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

ఆ దంపతుల రికార్డు

ఎనిమిది సార్లు ఏకగ్రీవం



చంపాబాయి



గంగాధర్ రావు

నిజామాబాద్, ప్రభన్యూస్ బ్యూరో : ఒకసారి, రెండు సార్లు కాదు.. ఏకంగా ఎనిమిది సార్లు సర్పంచ్ పీఠం ఏకగ్రీవంగా ఆ కుటుంబానికే దక్కింది. అక్కడి ప్రజలు ఎంతో గౌరవంగా ఆదరించే ఆ కుటుంబం ప్రజాశ్రేయస్సు కోసమే పని చేసింది. వివరాల్లోకి వెళ్తే.. గంగాధర్ రావు స్వగ్రామం నిజామాబాద్ జిల్లా, శ్రీరాంసాగర్ ముంపు గ్రామమైన మగ్గిడి. 1963లో రాజకీయ జీవితంలో అడుగు పెట్టారు. పాత గ్రామంలో నాలుగు పర్యాయాలు ఏకగ్రీవంగా సర్పంచ్ అయ్యారు. 1979-80 మధ్య కాలంలో ఈ కుటుంబం ఖానాపూర్‌కు వచ్చింది. ఇక్కడా రెండు పర్యాయాలు ఏకగ్రీవంగా సర్పంచ్ అయ్యారు. ఆ తర్వాత ఆయన సతీమణి చంపా బాయి మగ్గిడి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ర్మూర్ సమితి తొలి అధ్యక్షుడిగా గంగాధర్ రావు నియమితులయ్యారు. చైనాతో యుద్ధం సమయంలో సైన్యానికి లక్ష రూపాయల విరాళాన్ని సేకరించి నాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ప్రధానితోపాటు రాష్ట్రపతి, గవర్నర్ ప్రశంసించారు. పాతికేళ్ల నాడే తనకున్న రెండు ఎకరాల భూమిని ప్రభుత్వానికి విరాళంగా అందించి దానకర్ణుడిగా కీర్తి గడించారు.

ఏకగ్రీవం చేయాలంటూ ట్యాంకు ఎక్కి నిరసన

కడెం, ప్రభ న్యూస్ : నిర్మల్ జిల్లా, నవాబ్‌పేట్ గ్రామానికి చెందిన సర్పంచ్ అభ్యర్థి సర్పంచ్ పదవి కోసం గ్రామంలోని వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలిపారు. మండలంలోని నవాబ్‌పేట్ గ్రామానికి బీసీ మహిళ రిజర్వేషన్ ఖరారు కాగా దీనికి అనుబంధ గ్రామమైన లక్ష్మీపూర్‌లో నలుగురు అభ్యర్థులు నామి నేసన్ దాఖలు చేశారు. నవాబ్‌పేట్‌లో ఒక అభ్యర్థినే ఉంచాలని గ్రామస్తులు ఏకగ్రీవంగా నిర్ణ యించినప్పటికి మరో ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ వేసి చివరికి విత్‌డ్రా అవుతామని చెప్పి విత్‌డ్రా కాకపోవడంతో ఆదివారం సర్పంచ్ అభ్యర్థి జెల్ల లావణ్య భర్త శంకరయ్య వాటర్‌ట్యాంకు ఎక్కి నిరసన తెలిపారు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని శంకరయ్యకు కౌన్సెలింగ్ ఇచ్చి కిందికి దించాడు. ప్రజాస్వామ్య పద్ధతిలోనే ఎన్నికలు జరుగుతాయన్నారు. దీంతో ఆందోళన సద్దుమణిగింది.

శివార్లలో హోరాహోరీ

శివార్లలో ఏకగ్రీవాలకు దూరంగా ఉంటున్నారు. శివారు నియోజకవర్గాల్లో పంచాయతీల ఎన్నికలకు పోటాపోటీ నెలకొంది. చిన్న పంచాయతీల పరిధిలో క ూడా రూ. 25లక్షలకు పైగానే ఖర్చు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, మేడ్చల్, షాద్‌నగర్, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలోని శివారు ప్రాంతాల్లో పంచాయతీలకు దండిగా ఆదాయం వస్తోంది. దీంతో ఏకగ్రీవాలకు దూరంగా ఉంటున్నారు. శివార్లలో ఏకగ్రీవాలనే మాటే వినిపించడం లేదు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందునుంచేడబ్బులు దండిగా కర్చు చేస్తున్నారు. 4వేల లోపు ఓటర్లు ఉన్న పంచాయతీ పరిధిలో కోటికి తగ్గకుండా కర్చు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. శివార్లలో వెయ్యి ఓటర్ల కంటే ఎక్కువగా ఉన్నారు. వీటిలో లక్షల్లో కర్చు చేస్తున్నారు. కేవలం తాగేందుకే రోజుకు లక్ష చొప్పున కర్చు చేస్తున్నారంటే అక్కడి పరిస్థితులు అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రాంతాల్లో భూముల ధరలు బాగా పెరిగిపోవడం.....ఈసారి రియల్ ఎస్టేట్ వ్యాపారులు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తుండటంతో డబ్బులకు వెనకాడటం లేదు. పోటాపోటీగా డబ్బులు ఖర్చు చేస్తున్నారు. అందులో భాగంగానే పోటీకి సై అంటున్నారు.



2 విడత అదే జోరు

- తొలి విడత పంచాయతీల్లో ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో రెండో విడుత ఎన్నికలు జరగుతున్న గ్రామ పంచాయతీల్లో నామినేషన్ల దాఖలు గడువు ఆదివారం నాటితో ముగిసిపోయింది. చివరి రోజు కావటంతో పోటీకి అభ్యర్థులు పోటెత్తారు. దీంతో ఒక్క రోజే పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. రాష్ట్రంలో రెండో విడత కింద 172 మండలాల పరిధిలోని 4137 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు , ఈ పంచాయతీల పరిధిలోని 36620 వార్డు స్థానాలకు ఈ నెల 11 నుంచి నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది. తొలిరోజు మందకొడిగా ప్రారంభమైన నామినేషన్ల కార్యక్రమం చివరిరోజు వచ్చే సరికి బాగా పుంజుకుంది. సర్పంచ్ స్థానాలకంటే వార్డు లకు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేసినట్టు సమాచారం. తొలివిడత ఎన్నికలు జరుగుతున్న గ్రామ పంచాయతీల్లో నామినేషన్ల కంటే రెండవ విడత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో నామినేషన్లు దాఖలుకు భారీ స్పందన కనబడినట్టు అధికారులు చెబుతున్నారు. తొలివిడతలో 4468 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు 27,940 నామినేషన్లు దాఖలు కాగా, 39,822వార్డు స్థానాలకు 97,690 నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే రెండో విడత ఎన్నికలు జరిగే పంచాయతీలకు నామినేషన్ల సంఖ్య సర్పంచ్, వార్డు పదవులతో కలిపి లక్షన్నరకు పైగానే ఉండే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు. దీంతో నామినేషన్ల ప్రక్రియ సాయత్రం 5 గంటలకే ముగిసినప్పటికీ క్లస్టర్ పంచాయతీలనుంచి జిల్లాలకు, జిల్లాల నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘానికి నామినేషన్ల నివేదికలు అందటంలో జాప్యం చోటు చేసుకుంది.

నేడు పరిశీలన... 17న ఉపసంహరణ

రెండో విడత ఎన్నికలు జరుగుతున్న గ్రామ పంచాయతీల్లో నామినేషన్ల స్క్రూటినీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నారు. మంగళవారం తిరస్కరణ, నామినేషన్ల పై అప్పీళ్లకు సమయం కేటాయించారు. బుధవారం అప్పీళ్లను పరిష్కరించనున్నారు. ఈనెల 17న నామినేషన్ల ఉపసంహారణకు గడువు కేటాయించారు. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాలువెల్లడితోపాటు అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు కూడా కేటాయించనున్నారు. రెండవ విడత గ్రామ పంచాయతీలకు ఈ నెల 25న ఎన్నికలు జరగనున్నాయి.

తొలివిడత ప్రచారంపై అభ్యర్థుల దృష్టి

తొలివిడత ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికల ప్రచారంపై దృష్టి పెడుతున్నారు. ఈ పంచాయతీల్లో ఆదివారం మధ్యాహ్నం నామినేషన్ల ఉపసంహారణకు గడువు ముగిసిపోయింది. పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాలను ఎంపిక చేసిన అధికారులు ఎన్నికల గుర్తులు కూడా కేటాయించారు. దీంతో ఇక గ్రామాల్లో ఎన్నికల ప్రచారం జోరందుకోనుంది. ఇప్పటివరకూ ఎవరు పోటీలో ఉంటారో ఎవరు తప్పుకుంటారో స్పష్టత లేకపోవటంతో అభ్యర్థులు కూడా ప్రచారంపై పెద్దగా దృష్టి పెట్టలేకపోయారు.

నేడు ఏకగ్రీవ పంచాయతీల ప్రకటన

రాష్ట్రంలో తొలివిడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవ పంచాయతీలపై రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. తొలివిడత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో నామినేషన్ల ఘట్టం ముగిసి పోయింది. ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు నామినేషన్ల విత్‌డ్రా సమయం ముగిసింది. సర్పంచ్ పదవులకు, వార్డు సభ్యత్వాలకు సింగిల్ నామినేషన్లు దాఖలైన పంచాయతీలను మాత్రమే రాష్ట్ర ఎన్నికల సంఘం ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలుగా గురి ్తస్తుంది.

రాష్ట్రంలో సింగిల్ నామినేషన్లు ఉన్న పంచాయతీలకు సంబంధించిన నివేదికలు తెప్పిం చుకున్న జిల్లా ఎన్నికల అధికారులు వాటిపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నారు. సోమవారం వీటిపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి జిల్లాల వారీగా నివేదికలు పంప నున్నారు. పోటీ ఉన్న గ్రామ పంచాయతీలకు ఈనెల 21 పోలింగ్ జరగనుంది.

మెదక్ జిల్లాలోనూ అదే తీరు

- 32 పంచాయతీలు ఏకగ్రీవం
- 121గ్రామాల్లో ఎన్నికలు
- సర్పంచ్ పదవి రేసులో 321 మంది పోటాపోటీ



మెదక్, ప్రభన్యూస్ బ్యూరో : తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మెదక్ జిల్లాలో 154 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా 32 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మిగతా 121 పంచాయతీలకు ఈనెల 21న ఎన్నికలు జరగనున్నాయి. ఈనెల 7 నుంచి నామినేషన్ల స్వీకరణ చేపట్టగా కొన్ని పంచాయతీలకు ఏకపత్ర నామినేషన్లు దాఖలయ్యాయి. ఆదివారం ఉపసంహరణ రోజున పోటీ చేయనున్న అభ్యర్థులు నామినేషన్లను ఉపసం ్వారించుకోవడంతో మొత్తంగా జిల్లా వ్యాప్తంగా 32 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి.

ఫలించిన టీఆర్ఎస్ వ్యూహం..

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలి విడత ఎన్నికల్లో ఏకగ్రీవాల వైపు అధికశాతం మొగ్గుచూపారు. నామినేషన్ల పర్వం ముగిసే నాటికి భారీ స్థాయిలోనే దాఖలు చేసినప్పటికీ అధికార టీఆర్ఎస్ పార్టీ వ్యూహాత్మకంగా ప్రవర్తించి చాలావరకు గ్రామాలను ఏకగ్రీవం చేయించడంలో ఫలితం సాధించింది. కొన్ని గ్రామాల్లో టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు పోటీ పడగా రాజకీయ ఒప్పందానికి వచ్చి సర్పంచ్ పదవి ఒకరికి, ఉపసర్పంచ్ పదవి మరొకరికి ఇవ్వడానికి ఒప్పందాలు జరిగాయి. అయితే ఉపసంహరణ నాటికి అధిక శాతం టీఆర్ఎస్ మద్దతుదారులే సర్పంచ్, ఉపసర్పంచ్ స్థానాలను పొందడం గమనార్హం.

తొలి విడతలోని హవేళీ ఘణపురం మండలంలో 28 పంచాయతీలకు గాను 7 పంచాయతీలు ఏకగ్రీవం కాగా 21 పంచాయతీలకు సర్పంచ్ స్థానాలకు 69 మంది బరిలో ఉన్నారు. పాపన్నపేట మండలంలో 36 పంచాయతీలకు గాను 12 మంది ఏకగ్రీవం కాగా 24 గ్రామాలకు 59 మంది బరిలో ఉన్నారు. రేగోడు మండలంలో 18 పంచాయతీలకు గాను ఒకటి ఏకగ్రీవం కాగా 17 పంచాయతీల్లో సర్పంచ్‌లకు 40 మంది బరిలో ఉన్నారు. పెద్దశంకరంపేట మండలంలో 27 పంచాయతీలకు గాను 5 ఏకగ్రీవం కాగా 22 పంచాయతీల్లో సర్పంచ్‌లకు 49 మంది పోటీలో ఉన్నారు. అల్లాదుర్గం మండలంలో 16 పంచాయతీలకు గాను ఇద్దరు ఏకగ్రీవం కాగా 14 గ్రామాల్లో పోటీ ఉండగా 43 మంది రంగంలో ఉన్నారు. టేక్మాల్ మండలంలో 29 పంచాయతీలకు గాను 5 ఏకగ్రీవం కాగా 24 పంచాయతీలకు ఎన్నిక జరగనుండగా సర్పంచ్ పదవి కోసం 61 మంది పోటీలో ఉన్నారు. కాగా 32 పంచాయతీలలో అధిక శాతం టీఆర్ఎస్ మద్దతుదారులే ఉండడం గమనార్హం.

పంచాయతీలే ప్రగతి దిక్సూచీలు

దేశాన్ని పరి పాలిం చడమంటే.. ఆ పాలన ప్రభావం గ్రామాలపై పడినప్పుడే కేంద్ర ప్రభుత్వం సజావుగా పని చేస్తున్నట్లు ఒక కొలమానంగా చెబుతారు. ఏ దేశంలోనైనా గ్రామ పంచా యతీలు సంపూర్ణ అధికారాలతో, అవసరమైన నిధులతో సొంతంగా గ్రామాభివృద్ధి ప్రణాళికలు రూపొం దించుకొని అమలు చేస్తూ ఫలితాలు రాబడుతుంటే ఆ దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవి ల్లుతుందంటారు. దీనికి అధికారం క్షేత్రస్థాయి చేరడం ఒక్కటే మార్గం. అలా కేంద్రీకృత అధికారం వికేంద్రీకరణ చెంది.. గ్రామ పంచాయతీల రూపంలో ప్రతిఫలించడానికి అనేక అంశాలు పని చేస్తాయి.

రానున్న రోజుల్లో పంచాయతీల ప్రాధాన్యత మరింతగా పెరగబోతోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ పంచాతీయల ద్వారానే గ్రామస్థులకు అందుతున్నాయి. ప్రతిష్టాత్మక పథకం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం క ూడా పంచాయతీల కనుసన్నల్లోనే నడుస్తోంది. పంచాయతీల ద్వారా కేంద్ర, ప్రభుత్వ పథకాలు అమలు చేయడమే కాకుండా వాటికి మరికొన్ని బాధ్యతలు కూడా అప్పచెబుతున్నారు. ప్రభుత్వం ఏ విధానం అవలం భించినా పంచాయతీలను దృష్టిలో పెట్టుకోవాలనే అవసరం రోజురోజుకీ పెరు గుతోంది. దీనికి గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి అన్న నినాదం తోడవుతోంది. తాజాగా కేంద్ర సామాజిక న్యాయం, సాధికారతా మంత్రిత్వశాఖ మాదక ద్రవ్య నిరో ధానికి అయిదున్నర సంవ త్సరాల ప్రణాళికను సిద్ధం చేసింది. దీనికి ముందు ఇదే మంత్రిత్వశాఖ జాతీయ మాదవ ద్రవ నిరోధక విధానాన్ని రూపొం దించింది. ఈ విధానాన్ని ఆమో దించడానికి కేంద్ర మంత్రి వర్గంకి తీసు కొచ్చింది.వా

మాదక ద్రవ్యాల నియంత్రణలోనూ పంచాయతీల పాత్ర!

ఈ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారిని దాన్నుంచి విముక్తి కల్పించడానికి అవసరమైన విద్య, అవగాహన, కౌన్సిలింగ్, చికిత్స, పునరావాసం కల్పించడం వంటివి ఉంటాయి. కేంద్ర ప్రభుత్వ కార్యాచరణకి రాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్జీవోల సంయుక్త సహకారం తీసుకుంటారు. దేశవ్యాప్తంగా ఈ కార్యచరణను అమలు చేయడంలో భాగంగా గ్రామ పంచాయతీలకు కీలక బాధ్యతలు అప్పచెప్పారు. స్వయం సహాయ బృందాలు, మహిళా మండళ్లు, పట్టణ స్థాయిలో స్థానిక సంస్థలతో పాటు పంచాయతీ రాజ్ వ్యవ ్స్థను కూడా ఈ బృహత్ కార్యక్రమంలో భాగం చేయనున్నారు. పట్టణాలు, నగరాల కన్నా.. గ్రామాల్లో ఈ మాదక ద్రవ్యాల వినియోగం తక్కువగా ఉన్నప్పటికీ, అది చాపకింద నీరులు వ్యాప్తిస్తోందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారతా మంత్రిత్వశాఖ గుర్తించింది. పట్టణాలు మరీ ముఖ్యంగా నగరాల్లో మాదవ ద్రవ్యాల సరఫరా, వినియోగంపై గట్టి నిఘా ఉండడంతో గ్రామాలను లక్ష్యంగా చేసుకుంటున్నట్లు వచ్చిన నివేదికలు ఆందోళనకు కారణమవుతున్నాయి. గ్రామస్థాయిలో మాదక ద్రవ్యాల వినియోగంలో పంజాబ్ మొదటి స్థానంలో ఉండగా, మిగిలిన రాష్ట్రాల్లోని గ్రామాల్లోనూ నెమ్మదిగా ఈ జాఢ్యం విస్తరిస్తోండడంతో దీని నిరోధానికి పంచాతీయ రాజ్ వ్యవ స్థను కూడా రంగంలోకి దింపుతున్నారు.

వేలంతో ఏకగ్రీవం నేరం

- ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్ట పరమైన కేసులు
- పోలింగ్ శాతం పెంపునకు అవగాహన
- ఎన్నికల ఏర్పాట్లు సంతృప్తికరం
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి. నాగిరెడ్డి , పరిశీలకులు టి. చిరంజీవులు



గౌరవ వందనం స్వీకరిస్తున్న నాగిరెడ్డి

సూర్యాపేట, ప్రభన్యూస్ : వేలంపాటలతో గ్రామసర్పంచ్‌లను ఎన్నుకోవడం చట్ట రీత్యా నేరమని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డి, జనరల్ అబ్జర్వర్ టి.చిరంజీవులు అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ గెస్ట్‌హౌజ్‌లో జిల్లా కలెక్టర్ డి.అమయ్‌కుమార్, ఎస్పీ ఆర్.వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో మూడు విడతలుగా నిర్వహించే గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా ఎన్నికలు నిర్వహించే బాధ్యత అధికారుల ్దనన్నారు. గుర్తించిన సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ బలగాలను ఏర్పాటు చేసి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు. ఎన్నికల అనంతరం కౌంటింగ్ సమయాల్లో పెద్ద గ్రామపంచాయతీల్లో రాత్రి అయ్యే అవకాశాలు ఉన్నందున విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సర్పంచ్, వార్డు మెంబర్‌లు పోటీచేసే అభ్యర్థుల ఖర్చుల విశయాల్లో షాడో రిజిస్టర్‌లో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కువ ఖర్చుచేస్తే ఎన్నిక రద్దు చేయడమే కాకుండా ఏడాది జైలుశిక్ష పడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఏక గ్రీవ సర్పంచ్‌లు ఎన్నికైతే ఆ గ్రామాలకు నిధులు కేటాయిస్తామని ప్రకటించడం నియమనిబంధనలు ఉల్లంగించడమేనన్నారు. ఎన్నికల నిర్వహణలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జేసీ సంజీవరెడ్డి, డీఆర్‌వో చంద్రయ్య, ఆర్డీవోలు మోహన్‌రావు, కిశోర్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, వేణుమనోహర్, నాగేశ్వరరావు, సుదర్శన్‌రెడ్డి, నర్సింహరెడ్డి, రామ్మోహన్‌రాజు, బాబురావు, అశోక్, బెల్లంకొండ శ్రీధర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మీటూ ఉద్యమం వల్ల కొంత మార్పొచ్చింది


తాప్సీ

కొద్ది రోజుల క్రితం మీ టూ ఉద్యమం ఊపందుకుంది. అప్పుడే క్యాస్టింగ్ కౌచ్ గురించి కూడా చర్చకు వచ్చింది. చాలా మంది నాయికలు తమకు ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. ''తనకు మాత్రం ఎలాంటి అనుభవం ఎదురుకాలేదని'' నటి తాప్సీ ఆ సందర్భంగా స్పష్టం చేసింది. ''తన తొలి చిత్రాలు విజయం సాధించడంతో కొత్త అవకాశాల కోసం సినిమా ఆఫీసుల చుట్టు తిరిగే అవసరం రాలేదు. ఈ విషయంలో నేను అదృష్టవంతురాలిని'' అంటూ చెప్పుకొచ్చింది. ''క్యాస్టింగ్ కౌచ్ గురించి అందరూ మాట్లాడటం ప్రారంభించాక, కొంత మార్పు కనిపిస్తోంది. సినిమా షూటింగ్‌లో పురుషుల ప్రవర్తన చాలా మారింది. వాళ్ళు జాగ్రత్తగా ఉంటున్నారు'' అని తెలిపింది. ''ఇలాంటి సంఘటనలు కేవలం సినీరంగానికి మాత్రమే పరిమితం కాదు. ఇతర రంగాల్లో కూడా ఉంటాయని'' తాప్సీ పేర్కొంది.

సెట్స్ మీదకు సిద్ధం


కమల్ హాసన్

కమల్ హాసన్, దర్శకుడు శంకర్‌ల చిత్రం భారతీయుడు ఓ చరిత్రను సృష్టించింది. సందేశాత్మక కథలను ఎంత వాణిజ్య విలువలతో కలిపి చూపించవచ్చో చెప్పేందుకు భారతీయుడు ఒక ఉదాహరణ. ప్రస్తుతం ఈ చిత్రానికి కొనసాగింపు సినిమా చేసేందుకు రంగం సిద్ధమైంది. కమల్ హాసన్ హీరోగా దర్శకుడు శంకర్ భారతీయుడు 2 చిత్రాన్ని రూపొందించనున్నారు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మాణ బాధ్యతలు వహిస్తోంది. అందాల భామ కాజల్ అగర్వాల్ ఈ చిత్రంలో నాయికగా ఎంపికైంది. మరో యువ నటుడి పాత్రకు దుల్కర్ సల్మాన్‌ను ఎంచుకున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో దేశంలోని వర్తమాన సామాజిక, రాజకీయ సమస్యలను ఇతివృత్తంగా ఎంచుకున్నారట. ఈ నెల 18 నుంచి భారతీయుడు 2 సినిమా సెట్స్ మీదకు వెళ్లేందుకు అంతా సిద్ధమైంది. ఈ చిత్ర ప్రచార కార్యక్రమాలను రోబో సీక్వెల్ 2.ఓ. సందర్భంగా దర్శకుడు శంకర్ ప్రారంభించారు. భారతీయుడు 2 ఉంటుందనే విషయంలో అప్పటికే స్పష్టత వచ్చింది. కమల్ విశ్వరూపం లాంటి చిత్రాలతో, శంకర్ 2.ఓ వంటి భారీ విజయాల తర్వాత వస్తున్న చిత్రం కావడంతో భారతీయుడు 2పై అంచనాలు గొప్పగానే ఉన్నాయి.



నా కల తీర్చిన చిత్రమిది

- దర్శకుడు అనిల్ రావిపూడి

ఎఫ్2 చిత్రంతో పూర్తిస్థాయి కుటుంబ కథా చిత్రాన్ని రూపొందించాలనే తన కల తీరిందని దర్శకుడు అనిల్ రావిపూడి సంతోషాన్ని వ్యక్తం చేశారు. వెంకటేష్, వరుణ్ తేజ్, తమన్నా, మెహరీన్ ప్రధాన పాత్రల్లో ఈ యువ దర్శకుడు తెరకెక్కించిన ఫన్ అండ్ ఫ్రస్టేషన్ సినిమా ప్రేక్షకుల నుంచి మంచి స్పందన తెచ్చుకుంటోంది. ఈ చిత్రాన్ని దిల్ రాజు నిర్మించారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ...ఎఫ్2 గొప్ప విజయం సాధించింది. పరిశ్రమలోని చాలా మంది ఫోన్‌లు చేసి అభినందిస్తున్నారు. మేము ఆశించినట్లే ప్రేక్షకాదరణ దక్కింది. వెంకటేష్ గారు మంచి సినిమా చేశానని ఆనందం వ్యక్తం చేశారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా మాకు వరుసగా సినిమాలు చేస్తున్నావని దిల్ రాజు గారు ప్రశంసించారు. నాకు చక్కటి వినోదాత్మక కుటుంబ కథ సినిమా చేయాలని ఉండేది. ఆ కల ఈ చిత్రంతో తీరింది. క్షేమంగా వెళ్లి లాభంగా రండి, పెళ్లాం చెబితే వినాలి, గుండమ్మ కథ లాంటి చిత్రాల స్ఫూర్తి ఎఫ్2 కథలో ఉంది. జంధ్యాల, ఈవీవీ, ఎస్వీకృష్ణా రెడ్డి గారి ప్రభావం దర్శకుడిగా నాపై ఉంది. అయితే నేను వాళ్లతో పోల్చుకునేంత ఎదగలేదు. ఇప్పుడిప్పుడే నా ప్రయాణం ప్రారంభించాను. ఈ చిత్రంలో చాలా పాత్రలున్నాయి. వాటన్నింటికీ తగిన గుర్తింపు దక్కుతోంది. సినిమాలోని అనేక ఉతపదాలు ప్రేక్షకులు తిరిగి చెబుతున్నారు. ముఖ్యంగా అంతేగా అంతేగా అనే పదం బాగా పేరు తీసుకొచ్చింది. టీజర్ ట్రైలర్ లు తీసుకొచ్చిన క్రేజ్ సినిమాకు బాగా పనికొచ్చింది. సంక్రాంతికి పెద్ద పెద్ద సినిమాలు ఉన్నాయి అని ముందు కొంత భయపడ్డాం కానీ పండక్కి అన్ని సినిమాలు చూసే అవకాశం ఉంటుందనుకున్నాం. ఎఫ్2 కు కొనసాగింపు సినిమా చేయాలని ఉంది. వరుణ్, వెంకటేష్ ఎప్పుడంటే అప్పుడు చేద్దామని సిద్ధంగా ఉన్నారు. వెంకటేష్ గారికి, బాలకృష్ణకు కథ లైన్‌గా చెప్పాను. కొంత విశ్రాంతి తీసుకుని కొత్త చిత్రం గురించి ఆలోచిస్తాను. ఇప్పటికైతే ఏ సినిమా అంగీకరించలేదు. అన్నారు.


అఖిల్

ఏమైనదో ఏమైనదో అంటున్న మజ్ను

అఖిల్ అక్కినేని కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం మిస్టర్ మజ్ను. శ్రీ వెంకటేశ్వర సినీచిత్ర, ఎల్ఎల్‌పి పతాకాలపై బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం నిర్మాణానంతర పనుల్లో ఉంది. ఈ నెల 25న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా ఇప్పటివరకు విడుదలైన ఈ చిత్రం టీజర్‌కు, పాటలకు మంచి స్పందన లభిస్తోందని నిర్మాత తెలిపారు. ఏమైనదో...ఏమైనదో, మిస్టర్ మజ్ను టైటిల్ సాంగ్, హార్ట్ బ్రేక్ పాటలు శ్రోతలను ఎంతగానో అలరిస్తున్నాయని ఆయన చెప్పారు. సంక్రాంతి సందర్భంగా సోమవారం ఉదయం ఈ చిత్రం జ్యూక్‌బాక్స్‌ను విడుదల చేయబోతున్నట్లు ఆయన వెల్లడించారు.

అఖిల్ సరసన నిధి అగర్వాల్ నాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది తదితరులు తారాగణం. ఈ చిత్రానికి సంగీతం: తమన్, పాటలు: శ్రీమణి, సినిమాటోగ్రఫీ: జార్జ్ సి.విలియమ్స్, ఎడిటింగ్: నవీన్ నూలి, ఆర్ట్: అవినాష్ కొల్లా.


వాళ్ల ప్రతిభను చూస్తుంటే ముచ్చటేస్తోంది

బాలీవుడ్‌పై అమితాబ్ జైత్రయాత్ర దశాబ్దాలుగా అప్రతిహతంగా కొనసాగుతోంది. వివిధ పాత్రల్లో తనదైన శైలిలో ఆయన వేసిన ముద్ర స్పష్టం. ఇంత కీర్తి సంపాదించినా ఈ దిగ్గజ నటుడు ఇంకా నేర్చుకోవాల్సింది ఉందనే చెబుతున్నారు. కొత్త నటీనటుల ప్రతిభ చూస్తుంటే ముచ్చటేస్తుందని అన్నారు. తొలినాళ్లలో తాము పడిన శ్రమ, తపన ఈతరం నటీనటుల్లో కనిపిస్తోందని అమితాబ్ చెప్పారు. పా, ఆరక్షణ్, సత్యాగ్రహ్, షమితాబ్, వాజిర్, పీకూ, తీన్, పింక్ ఇవన్నీ బిగ్‌బీ అభినయ ప్రతిభకు ఉదాహరణలు. ఇటీవల అమితాబ్ మాట్లాడుతూ...నా వయసు ఇప్పుడు 75. ప్రేక్షకుల్లో నాకున్న హోదాకు...సందేశాత్మక చిత్రాలే బాగుంటాయి. ఓ హీరోగా నన్నిప్పుడు చూడలేరు కదా. నాలుగు దశాబ్దాల నా నట ప్రయాణంలో ఇంకా నటనలో నేర్చుకోవాల్సినవి ఉన్నాయనే భావిస్తా. ఇప్పుడు యువతరం నటీనటులను చూస్తుంటే ముచ్చటేస్తుంది. ఓ సన్నివేశం కోసం మేము తొలినాళ్లలో పడిన కుస్తీపాట్లు...ఇప్పటి వాళ్లలో కనిపించడం లేదు. వాళ్లు హాయిగా సెట్‌లోకి వచ్చి దర్శకుడు చెప్పిన సన్నివేశాల్లో అద్భుతంగా నటిస్తున్నారు. వాళ్లను చూస్తే ఆశ్చర్యమేస్తుంటుంది. నేనింకా వాళ్ల నుంచి నేర్చుకోవాల్సింది ఉందని అనిపిస్తుంటుంది అని వినయంగా చెప్పారు. ఇటీవలే థగ్స్ ఆఫ్ హిందూస్థాన్ చిత్రంలో కనిపించిన అమితాబ్ ప్రస్తుతం బ్రహ్మాస్త్ర, సైరా లాంటి చిత్రాల్లో నటిస్తున్నారు.


అమితాబ్

శ్రియ నటన హైలైట్‌గా మహాచంద్ర

యశ్ (కేజీఎఫ్ ఫేమ్), ప్రేమ్‌కుమార్, శ్రియ ప్రధాన పాత్రలలో రూప అయ్యర్ దర్శకత్వంలో రూపొందిన కన్నడ చిత్రం చంద్ర ఇప్పుడు తెలుగులో మహాచంద్ర పేరుతో అనువాదమైంది. నైనా ఫిలిమ్స్ పతాకంపై షాన్వాజ్ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకుని రాబోతున్న ఈ చిత్రం డబ్బింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా నిర్మాత షాన్వాజ్ మాట్లాడుతూ, యశ్ ఈ చిత్రంలో ఓ ప్రధాన పాత్రను పోషించారు. అలాగే శ్రియ నటన ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. ఫిబ్రవరి రెండోవారంలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: గౌతమ్ శ్రీవాస్తవ, కెమెరా: దాస్, సమర్పణ: దామోదర వనాచార్య.



థ్రిల్లర్‌గా అదృశ్యం

జాన్, ప్రియాంక నాయకానాయికలుగా తెరకెక్కిన చిత్రం అదృశ్యం. వైష్ణవి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై స్వీయ నిర్మాణ దర్శకత్వంలో రవిప్రకాష్ కృష్ణంశెట్టి రూపొందించిన ఈ చిత్రం సెన్సార్ పూర్తిచేసుకుని విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రం ట్రైలర్‌ను ఫిలిం చాంబర్‌లో హీరో జాన్ చేతులమీదుగా విడుదలచేశారు. ఈ సందర్భంగా హీరో జాన్ మాట్లాడుతూ, తెలుగులో ఇది నా మూడవ చిత్రం. అదే నువ్వు...అదే నేను, బంటి ద బ్యాడ్‌బోయ్ చిత్రాల తర్వాత నేను చేస్తున్న చిత్రమిది. నాకు అవకాశం ఇచ్చిన రవిగారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. సీనియర్ దర్శకులు కె.విశ్వనాథ్‌గారిని కలిసి మా ఆడియోను విడుదల చేశాం. ఆయన నన్ను చూసి ప్రభాస్‌లా ఉన్నావని అనడం ఎంతో ఆనందాన్నిచ్చింది అని అన్నారు. దర్శకుడు రవిప్రకాష్ మాట్లాడుతూ, నా కెరీర్ మొదలైంది కె.విశ్వనాథ్‌గారి దగ్గర. కో-డైరెక్టర్‌గా ఆయన దగ్గర చాలా సినిమాలకు పనిచేశాను. తర్వాత సింగీతం శ్రీనివాసరావుగారి దగ్గర 14 సినిమాలకు పనిచేశాను. అలాంటి లెజెండరీ దర్శకుల దగ్గర పనిచేయడం నాకు చాలా గర్వంగా ఉంది. ఇప్పటికే హీరో జాన్ నేను తీసిన బాలల చిత్రం చేశారు. అందుకే ఆయన్ని హీరోగా ఎంచుకున్నా. నేను చేసిన బంటి ద బ్యాడ్‌బాయ్ సినిమాకు ఎన్నో అవార్డులు వచ్చాయి. ఒక రివార్డు సినిమా చెయ్యాలని ఈ సినిమా చేస్తున్నాను. ఇది ఒక థ్రిల్లర్ కథాచిత్రం. సినిమా ఆసక్తికరంగా ఉంటే చాలు బడ్జెట్‌తో పనిలేదు. ఇందులో నలుగురు హీరోయిన్లు నటిస్తున్నారు. జయవాణి మాంత్రికురాలిగా ఓ ప్రత్యేక పాత్ర పోషించారు అని అన్నారు. సంగీత దర్శకుడు ఆల్‌డ్రిన్ మాట్లాడుతూ, తెలుగులో ఇది నా మొదటి చిత్రం. స్వతహాగా నేను తెలుగువాడిని. కాకపోతే చెన్నైలో స్థిరపడ్డాను. తమిళంలో దాదాపు ఏడు చిత్రాలకు సంగీతాన్ని అందించాను. తెలుగులో కూడా బిజీ కావాలని కోరుకుంటున్నా అని అన్నారు.



ప్రముఖ గాయని కల్పన పోలీస్ ఆఫీసర్ పాత్రలో...అంగనారాయ్ నెగెటివ్ షేడ్ పాత్రలో నటించిన ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో జబర్దస్త్ ఆర్.పి.వినోద్, అప్పారావు, హర్షధ తేజారెడ్డి, జయవాణి, కోటేశ్వరరావు, వంశీ తదితరులు తారాగణం. ఈ చిత్రానికి మాటలు: నాగులకొండ నవకాంత్, కెమెరా: రామ్ పినిశెట్టి, పాటలు: వెన్నెలకంటి, ఎడిటింగ్: ఆకుల భాస్కర్, ఫైట్స్: కృష్ణంరాజు, డ్యాన్స్: సుజ్జి, చార్లీ.

ఆడని చిత్రాల్లో ఎందుకని...!

నాలుగు రోజులు ఆడని సినిమాలు చేస్తే ఎంత...చేయకపోతే ఎంత అని ప్రశ్నిస్తోంది బాలీవుడ్ భామ అమీషా పటేల్. అనవసరమైన చిత్రాల్లో నటించే కంటే ఖాళీగా ఉండటమే మంచిదన్నది ఆమె మాట. ఆలస్యమైనా మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తానంటోందీ సుందరి. నాని, నరసింహుడు వంటి పలు చిత్రాలతో టాలీవుడ్‌లోనూ సుపరిచితమీ భామ. హిందీలో ఆమె సినిమా చేసి ఐదేళ్లవుతోంది. అప్పుడెప్పుడో రేస్2 చిత్రంలో నటించింది. ఖాళీగా ఉండటం ఎందుకని తరుచూ ఫొటో షూట్‌లు చేసేస్తోంది. ఇటీవల ఆమె చేసిన ఓ ఫోటోషూట్‌కు సామాజిక మాధ్యమాలలో మిశ్రమ స్పందన వచ్చింది. వయసుకు తగిన ఫొటోలు దిగమంటూ సలహాలు ఇచ్చారు. ఇలాంటివి పట్టించుకోనన్న అమీషా తన కొత్త చిత్రం గురించి వివరించింది. ఆమె మాట్లాడుతూ....ఈ మధ్య మనం చూస్తున్న సినిమాల్లో చాలా వరకు నాలుగు రోజులైనా థియేటర్‌లలో ఉంటున్నాయా.? అలాంటివే కావాలంటే నేను చాలా సినిమాల్లో నటిస్తాను. మంచి సినిమా కోసమే కొంత ఆలస్యమైంది. ప్రేక్షకుల ముందుకు మంచి సినిమాతో రావడం ముఖ్యం. ఇంతకాలం ఎందుకు కనిపించలేదు అని ఎవరూ అనుకోరు. అని చెప్పింది.


అమీషా పటేల్

నేటి నుంచి ఆస్ట్రేలియా ఓపెన్

బిగ్ ఫోర్‌కు యువస్టార్స్ చెక్?



ఈ ఏడాది తొలి గ్రాండ్ స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియా ఓపెన్ పోటీలకు నేడు తెరలేవనుంది. బిగ్‌ఫోర్ ఆటగాళ్లుగా పేరుపొందిన రోజర్ ఫెదరర్, రఫెల్ నాదల్, అండీ ముర్రే, నొవాక్ జకోవిచ్‌లకు యువ స్టార్ ఆటగాళ్లనుంచి గట్టిపోటీ ఎదురుకానుంది. వీరు గెలుపుకోసం ఈసారి గట్టిగా శ్రమించాల్సి ఉంటుంది. జర్మనీకి చెందిన జెవెరెవ్, క్రొయేషియాకు చెందిన బోర్నా, రష్యాకు చెందిన కరెన్ ఖచనొవ్, గ్రీస్‌కు చెందిన స్టెఫానో టిసిట్స్‌పాస్ తమ ఆటతో సీనియర్లకు చెక్ చెప్పనున్నారు. డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెదరర్ తన తొలి మ్యాచ్‌లో ఉజ్బెక్ టెన్నిస్ స్టార్ డెనిస్ ఇస్టోమిన్‌తో తలపడనున్నాడు.



మెల్‌బోర్న్: స్విస్ స్టార్ రోజర్ ఫెదరర్, సెర్బియా స్టార్ నొవాక్ జకోవిచ్‌లు ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ కప్ గెలుచుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. నేడు ఈ టోర్నీ ప్రారంభం కానుంది. మరో దిగ్గజ ఆటగాడు, బ్రిటిన్‌కు చెందిన అండీ ముర్రే గాయంతో సతమవుతుండటంతో ఈ టోర్నీలో రాణించడం కష్టమే. గత ఏడాది ముర్రే, ఫెదరర్, జకోవిచ్, నాదల్‌లు బిగ్ ఫోర్‌గా బరిలోకి దిగారు. ఈ సారి ఆ పరిస్థితి ఉండటం లేదు. ప్రపంచ నెంబర్ 1 జకోవిచ్ నెంబర్ 3 ఫెదరర్‌లు ఈసారి శక్తివంతమైన యువ ఆటగాళ్లలో తలపడనున్నారు. జకోవిచ్ తన ప్రారంభ మ్యాచ్‌లో జర్మనీకి చెందిన అలెగ్జాండర్ జెవెరెవ్‌తో తలపడుతున్నాడు. జెవెరెవ్ క ూడా తన కెరియర్ తొలి మేజర్ టైటిల్‌కోసం ఎదురుచూస్తున్నాడు. గాయంతో సతమతమవుతున్న ముర్రే గ్రాండ్ స్లామ్‌కు ముందే తన రిటైర్మెంట్ ప్రకటించి సంచలనం సృష్టించాడు. తొడ కండరం నొప్పితో ఈ ఏడాది వింబుల్డన్ తర్వాత రిటైర్ కానున్నట్లు తెలిపాడు. ముర్రే తన తొలి మ్యాచ్‌లో స్పెయిన్‌కు చెందిన రాబర్టో బాటిస్టా అగట్‌తో తలపడనున్నాడు. ఫెదరర్ తన ప్రారంభ మ్యాచ్‌లో డెనిస్ ఇస్టోమిన్‌తో నేడు తలపడనున్నాడు. బ్రిస్బేన్ వార్మప్‌లోనే విరమించిన వరల్డ్ నెంబర్ 2 ఆటగాడు ఆరుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత స్పెయిన్‌కు చెందిన రఫెల్ నాదల్ పూర్తి ఫిట్‌నెస్ ఇంకా ప్రశ్నార్థకంగానే ఉంది. తాను ఫిట్‌గా ఉన్నానంటూ అస్ట్రేలియన్ బరిలోకి వచ్చాడు. మరోవైపు సెర్బియాకు చెందిన 31 ఏళ్ల జకోవిచ్ కూడా ఆరుసార్లు ఆస్ట్రేలియా ఓపెన్‌గెలిచి ఏడో టైటిల్‌కోసం బరిలో ఉన్నాడు. 2018 ఆస్ట్రేలియన్ ఒపెన్ ప్రారంభానికి ముందే జకోవిచ్ మోచేయికి శస్త్ర చికిత్స చేయించుకుని బరిలోకి దిగి తొందరగానే ఇంటిదారి పట్టాడు. ఫలితంగా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్ 20 జాబితాలో తన స్థానాన్ని కోల్పోయాడు. అదే ఏడాది జూలైలో జరిగిన వింబుల్డన్ టైటిల్ సాధించి మళ్లీ వరల్డ్ నెంబర్ వన్ ర్యాంకుకు చేరుకున్నాడు. ఇది తన కెరియర్లో నాలుగో టైటిల్. అనంతరం ఆడిన మూడు టోర్నీల్లో ఓటమి చెందాడు. ఇందులో జెవెరెవ్‌తో ఆడిన ఏటీపీ ఫైనల్ మ్యాచ్ కూడా ఉంది. సెప్టెంబర్‌లో తన మూడో యూఎస్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకున్న జకోవిచ్ ఈ గెలుపుతో తన ఖాతాలో 14 గ్రాండ్ స్లామ్ టైటిళ్లను వేసుకున్నాడు. జకోవిచ్ టైటిళ్ల సంఖ్య, స్పెయిన్ స్టార్ రఫెల్ నాదల్ సాధించిన మొత్తం టైటిళ్లకంటే మూడు తక్కువగా ఉండగా, ఫెరరర్ సాధించిన టైటిళ్లకంటే ఆరు తక్కువగా ఉన్నాయి. ఆదివారం జకోవిచ్ మీడియాతో మాట్లాడుతూ.. మెల్‌బోర్న్ బరిలో తిరిగి పాల్గొంటున్నందుకు సంతోషంగా ఉంది. 2008లో ఇక్కడ సాధించిన తొలి గ్రాండ్‌స్లామ్‌తో తన కెరియర్ మలుపు తిరి గిందన్నాడు. జకోవిచ్ తన ప్రారంభ పోటీని మంగ ళవారం అమెరికాకు చెందిన మిచెల్ క్రూగర్‌తో ఆడనున్నాడు.

నేను ఫిట్‌గా ఉన్నా : నాదల్

వరల్డ్ నెంబర్ ర్యాంక్ ఆటగాడు 32 ఏళ్ల రఫెల్ నాదల్ కూడా తన తొడ కండరం పట్టేయడంతో బ్రిస్బేన్ టోర్నీనుంచి అర్థాంతరంగా తప్పుకున్నాడు. అనంతరం సిడ్నీలో ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో మళ్లీ కోర్టులోకి దిగాడు. ఆదివారం నాదల్ మీడియాతో మాట్లాడుతూ.. నా ఫిట్‌నెస్ బాగానే ఉంది. నేను ఫిట్‌గా లేకపోతే.. ఇక్కడ ఉండే వాన్ని కాదుకదా అని అన్నాడు. తన సర్వీస్‌ను మెరుగుపర్చుకున్నా నన్నాడు. అన్ని వేళలా ఆటను మెరుగుపరుచుకుంటూ పోతేనే కొత్త ఆటగాళ్లతో పోటీపడగ లుగుతాము అని నాదల్ పేర్కొన్నాడు. నాదల్ నేడు తన ప్రారంభ పోటీలో వైల్డ్ కార్డ్ ఎంట్రీ పొందిన ఆస్ట్రేలియన్ జేమ్స్ డక్ వర్త్‌తో తలపడనున్నాడు.

ప్రారంభ మ్యాచ్‌లో ఫెదరర్‌కు గట్టిపోటీ

టోర్నీ తొలిరోజు పోటీలోనే 37 ఏళ్ల ఫెదరర్ గట్టి ప్రత్యర్థిని ఎదుర్కోను న్నాడు. ఉజ్బెక్ టెన్నిస్ స్టార్ డెనిస్ ఇస్టోమిన్‌తో తలపడనున్నాడు. నేను మంచి టెన్నిస్ ఆడుతున్నాను. నన్ను ఓడించాలంటే నా ప్రత్యర్థి నాకంటే మంచి స్థాయిలో ఆడాల్సి ఉంటుంది. నా విజయంపై నాకు విశ్వాసముంది అని ఫెదరర్ తెలిపాడు. ఫెదరర్ ఇటీవల పెర్త్‌లో జరిగిన హోప్‌మన్ కప్‌లో విజేతగా నిలిచి ఆత్మ విశ్వాసంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ బరిలోకి దిగుతున్నాడు.

యువ ఆటగాళ్ల సవాల్

ఈ సారి ఆస్ట్రేలియా ఓపెన్లో యువ స్టార్ ఆటగాళ్లు జర్మనీకి చెందిన జెవెరెవ్, క్రొయేషియాకు చెందిన బోర్నా, రష్యాకు చెందిన కరెన్ ఖచనొవ్, గ్రీస్‌కు చెందిన స్టెఫానో టిసిట్స్‌పాస్ తమ ఆటతో సీనియర్లకు చెక్ చెప్పనున్నారు. హోప్‌మన్ కప్ మిక్స్‌డ్ టీంలో ఆటగాడిగా ఫైనల్‌కు చేరిన 21 ఏళ్ల జెవెరెవ్ తన పోరును పూర్ణ విశ్వాసంతో ప్రారంభించనున్నాడు. మెల్‌బోర్న్‌లో ఇప్పటివరకు ఆడిన మ్యచుల్లో జెవెరెవ్ మూడో రౌండ్ కంటే దిగువన ఓడలేదు. గత ఏడాది నాలుగో సీడెడ్‌గా ఉన్న జెవెరెవ్ మంగళవారం తన ఓపెనింగ్ మ్యాచ్‌లో స్లొవేనియాకు చెందిన ఆల్‌జాజ్ బెడెనెతో మంగళవారం తలపడనున్నాడు. ఆస్ట్రేలియాలో అభిమానులు ఈసారి తమ దేశానికి చెందిన ఆటగాళ్లలో ఒకరు కొత్త చాంపియన్‌గా అవిర్భవించాలని కోరుకుంటున్నారు. ఆస్ట్రేలియా యువ ఆటగాడు 27వ సీడెడ్ అలెక్స్ డి మినౌర్ సోమవారం తన ప్రారంభ మ్యాచ్‌లో పోర్చుగల్‌కు చెందిన పెడ్రో సౌసాను ఢీకొనున్నాడు.

ఆస్ట్రేలియాకే చెందిన నిక్ కిర్గియోస్‌కు కఠిన ఓపెనింగ్ లభించింది. తన తొలి మ్యాచ్‌లో వరల్డ్ నెంబర్ త్రీ ఆటగాడు మిలోస్ రానొక్‌తో అనంతరం రెండో రౌండ్లో మాజీ ఆస్ట్రేలియన్ చాంపియన్ స్టాన్ వావ్రింకాతో తలపడే అవకాశముంది.

మహిళల సింగిల్స్ బరిలో గ్రాండ్‌స్లామ్ స్టార్స్



మహిళ సింగిల్స్‌లో గత ఏడాది అన్ని గ్రాండ్ స్లామ్‌లను గెలిచిన క్రీడాకారి ణులు ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్లో బరిలోకి దిగుతున్నారు. రుమేనియాకు చెందిన గత ఆస్ట్రేలియా ఓపెన్ రన్నరప్ గా నిలిచిన సిమోనా హలెప్ తన వరల్డ్ నెంబర్ 1 ర్యాంకును కాపాడుకోవా లనుకుంటోంది. ప్రారంభ పోటీలో ఈస్టోనియాకు చెందిన కాయ కనేపితో తలపడనుంది. హలెప్ 2018 ఫ్రెంచ్ ఓపెన్ గెల్చుకుంది. వరల్డ్ నెంబర్ 2 క్రీడాకారిణి జర్మనీకి చెందిన



అంజెలిక్ కెర్బర్ 2018 వింబుల్డన్, హోప్‌మన్ కప్‌ల విజేతగా నిలిచింది. కెర్బర్ తొలి రౌండ్‌లో స్లొవేనియాకు చెందిన పొలొనా హెర్కాగ్‌ను ఢీకొననుంది. 2018 ఆస్ట్రేలియా ఓపెన్ సింగిల్స్ విజేతగా నిలిచిన డెన్మార్క్‌కు చెందిన కరోలినా వోజ్నియాంకి తన తొలి పోటీలో అలీసన్ వాన్‌తో తలపడనుండగా, 2018 యూఎస్ ఓపెన్‌ను గెలుచుకున్న జపాన్ స్టార్ నవోకి ఒసాకా తొలి రౌండ్లో మగ్దా లినెట్టీని ఢీకొననుంది.

రాయుడు బౌలింగ్ తీరుపై అనుమానాలు

బౌలింగ్‌ను పరీక్షించనున్న ఐసీసీ



దుబాయ్: భారత బ్యాట్స్‌మన్ పార్ట్ టైం బౌలర్ అంబటి రాయుడు బౌలింగ్ యాక్షన్‌ను మ్యాచ్ అఫీషియల్స్ తప్పుబట్టారు. శనివారం ఆస్ట్రేలియాతో ఆడిన తొలి వన్డేలో రాయుడు రెండు ఓవర్లు బౌలింగ్ చేశాడు. 33 ఏళ్ల రాయుడు ఆఫ్ స్పిన్ బౌలింగ్ చేస్తాడు. రాయుడు బౌలింగ్ చేసే తీరు నిర్ణీత ప్రమాణాల మేరకు లేదని మ్యాచ్ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తూ.. ఐసీసీకి తెలిపారు. ఈమే.రకు ఐసీసీ ఆదివారం మీడియాకు ఒక ప్రకటన చేసింది. 'రాయుడు బౌలింగ్ ఆక్షన్ పరిశీలనలో ఉంది. ఐసీసీ నిబంధనలమేరకు అతని బౌలింగ్ తీరు సరిగా లేదు. అతను 14 రోజుల్లో బౌలింగ్ పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ కాలంలో రాయుడు అంతర్జాతీయ క్రికెట్లో బౌలింగ్ చేయవచ్చు. పరీక్షఫలితాలను వెల్లడించేవరకు అతను బౌలింగ్ చేయడానికి అనుమతి ఉంది.' అని ఐసీసీ తెలిపింది. రాయుడు ఇప్పటివరకు 46.1 ఓవర్లు ఆడి 20.1 ఓవర్లు బౌలింగ్ చేశాడు. మూడు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అతని ఎకానమి బౌలింగ్ 6.14. శనివారం నాడు ఆసీస్‌తో ఆడిన తొలి వన్డేలో డకౌటయ్యాడు. పరిమిత ఓవర్ల క్రికెట్ ఫార్మాట్లో దృష్టిని కేంద్రీకరించడానికి రాయుడు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌నుంచి నవం బర్‌లో రిటైరయ్యాడు.

క్రీడాప్రభ

ముర్రే దిగ్గజ ఆటగాడు

- *గాయంతో బాధపడుతూ రిటైర్మెంట్ ప్రకటించడం బాధాకరం:రోజర్ ఫెదరర్*

మెల్‌బోర్న్: టెన్నిస్ దిగ్గజం బ్రిటన్‌కు చెందిన అండీ ముర్రే ఈ ఏడాదిలో టెన్నిస్‌నుంచి రిటైర్మెంట్ అవుతున్నట్లు ప్రకటించడండంపట్ల స్విట్జర్లాండ్‌కు చెందిన టెన్నిస్ స్టార్ రోజర్ ఫెదరర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశాడు. ముర్రే వెలకట్టలేని ఆటగాడని ఒక దిగ్గజ ఆటగాడి సాహచ ర్యాన్ని కోల్పోతున్నందుకు బాధగా ఉంద న్నాడు. ఆదివారం ఫెదరర్ మీడియాతో మాట్లాడాడు. తొడ కండరం గాయంతో బాధపడుతున్న ముర్రే గత ఏడాది శస్త్ర చికిత్స చేయించుకున్నప్పటికి.. గాయం నుంచి విముక్తం కాకపోవడంతో తాను ఇక ఆటలో కొనసాగలేనని ఈ ఏడాది ఆడే వింబుల్డన్ టోర్నీ తన చివరి టోర్నీ అని శుక్రవారం కన్నీళ్లతో ప్రకటించాడు. అయి తే నొప్పి తీవ్రంగా ఉండటంతో ప్రస్తుత ఆస్ట్రేలియన్ ఓపెన్ తన చివరి టోర్నీ కావ చ్చని ముర్రే సంకేతాలిచ్చాడు. ముర్రే ప్రకటనతో నేను విచారానికి లోనయ్యాను. కొంత కాలం తర్వాత ముర్రేతో ఆడే అవకాశం కోల్పోతామన్న ఆలోచన మాకు మింగుడు పడటంలేదు అని ఫెదరర్ అన్నాడు. ఫెదరర్, ముర్రేలు రేపటినుంచి మెల్‌బోర్న్‌లో ప్రారంభం కానున్న ఈ ఏడాది తొలి గ్రాండ్ స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆడనున్నారు. 'ఏదో ఒకరోజు ప్రతీ ఒక్కరిని కోల్పోవాల్సిందే. ముర్రే సాహచర్యం ఇంత తొందరగా ఇప్పుడే ముగుస్తుందన్న విషయం బాధగా ఉంది. బిగ్ ఫోర్ (దిగ్గజ నలుగురు నొవాక్ జకోవిచ్, రఫెల్ నాదల్, అండీ ముర్రే, ఫెదరర్) శకం ముగింపుకు చేరుకోవడం అవశ్యంగా మారింది' అని ఫెదరర్ చెప్పాడు. అండీ గురించి మాకు తెలుసు. అతన్ని బాగా ఇష్టపడతాము. నిజా యితీగా చెప్పాలంటే.. అతనికి ఎక్కువ మంది శత్రువులు లేరు. అతను హాల్ ఆఫ్ ఫేమర్. అతను కోరుకున్న విజయాలను అందుకున్నాడు. అతని లేని లోటు ఎవరి తోనూ పూడ్చలేనిది. అతను గొప్ప ఆటగాడు. వెలకట్టలేని గౌరవాలను అందుకు న్నాడు అని ప్రపంచ నెంబర్ 3 ఆటగాడు ఫెదరర్ తెలిపాడు.

పాండ్యా,రాహుల్ స్థానాల్లో గిల్, విజయ్

ముంబై: టీవీ షోలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి విచారణను ఎదుర్కొంటున్న క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, కెఎల్ రాహుల్‌ల స్థానంలో యువ క్రీడాకారులు శుభ్‌మన్ గిల్, విజయ్ శంకర్‌లను ఎంపిక చేసినట్లు బీసీసీఐ ఆదివారం ప్రకటించింది. గిల్ న్యూజిలాండ్‌తో ఆడే ఐదు వన్డేలు మూడు టీ20ల్లో ఆడనుండగా, విజయ్ శంకర్ ఆస్ట్రేలియాతో ఆడే రెండు వన్డేలు ఆడనున్నాడు.

పీబీఎల్ విజేత బెంగళూరు

ఫైనల్లో ముంబైపై 4-3తేడాతో గెలుపు



బెంగళూరు: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ సీజన్ 4 విజేతగా బెంగళూరు రాప్టర్స్ ఆవిర్భవించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో బెంగళూరు 4-3 పాయింట్ల తేడాతో ముంబై రాకెట్స్‌ను ఓడించి టైటిల్‌ను దక్కించుకుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ముంబై (కెజి జాంగ్- బెర్నాడేత్) ట్రంప్ మ్యాచ్‌గా ఆడి 15-8,15-14తేడాతో విజయం సాధించి రెండు పాయింట్లను పొందింది. పురుషుల సింగిల్స్‌లో బెంగళూరు(కిదాంబి శ్రీకాంత్) 15-7, 15-10తేడాతో ముంబై(అంటోన్‌సెన్)ను ఓడించి ఒక పాయింట్‌ను తన జట్టుకు అందించాడు. మహిళల సింగిల్స్‌లో బెంగళూరు(టిటి వు) ట్రంప్ మ్యాచ్‌గా ఆడి 15-8, 15-9 తేడాతో ముంబై(ఎస్ పర్దేసి)ని ఓడించి మరో రెండు పాయింట్లు జట్టు ఖాతాలో వేయడంతో బెంగళూరు 3-2 ఆధిక్యం సాధించింది. రెండో పురుషుల సింగిల్స్‌లో బెంగళూరు(బి సాయిప్రణీత్), ముంబై(సమీర్ వర్మ) మధ్య పోరు నువ్వానేనా అన్నట్లు సాగింది. చివరికి సమీర్ వర్మ 7-15,15-12, 15-3 తేడాతో విజయం సాధించడంతో పాయింట్లు 3-3తో సమమైంది. మ్యాచ్ నిర్ణాయక పురుషుల డబుల్స్‌లో బెంగళూరు జోడీ(అహ్సాన్-సెతి యావన్) 15-13, 15-10 తేడాతో ముంబై జోడీ(కెజి జాంగ్- ఎల్ వై డే)ను ఓడించడంతో బెంగళూరు 4-3తో విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది.

క్రికెట్ ఆడుతూ మృతి చెందిన రాజేష్

గోవా: మాజీ గోవా రంజీ ఆటగాడు రాజేష్ గోడ్జే (43) క్రికెట్ ఆడుతూ మైదానంలోనే మరణించాడు. ఆదివారం మార్మ్‌గోవా పట్టణం మైదానంలో లోకల్ మ్యాచ్ ఆడుతూ నాన్ స్ట్రైకర్‌ఎండ్‌లో ఉన్న రాజేష్ గుండెపోటు రావడంతో క్రీజులోనే కుప్పకూలిపోయాడు. నిర్వాహకులు రాజేష్‌ను ఆస్పత్రికి తరలించి నప్పటికి ఫలితం లేకపోయింది. దారిలోనే అతను మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. 1999-2000 మధ్య గోవా రంజీ జట్టులో రాజేష్ సభ్యుడిగా ఉన్నాడు.

10 ఏళ్లకే ఖేలో ఇండియా చాంపియన్

షూటింగ్‌లో అభినవ్ షాకు బంగారు పతకం



పుణె: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో 10 ఏళ్ల అభినవ్ షా చాంపియన్‌గా నిలిచి రికార్డు సృష్టించాడు. ఇంత వరకు జరిగిన ఖేలో ఇండియా క్రీడల్లో బంగారు పతకం సాధించిన వారిలో అభినవ్ అతి చిన్నవాడు. ఆదివారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీం ఈవెంట్లో అభినవ్, మెహులీ ఘోష్‌తో కూడిన జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో అభినవ్ రాణించకపోతే... మెహులీ ఘోష్‌తో కూడిన జట్టు బంగారు పతకాన్ని గెలిచివుండేదికాదు. పశ్చిమ బెంగాల్‌లోని అసన్‌సోల్‌కు చెందిన అభినవ్ ఆరో తరగతి విద్యార్థి. తన ప్రతిభతో ఆకట్టుకుని ఆదరణ పొందాడు.

నేడు బహ్రెయిన్‌తో భారత్ ఢీ

ఆసియా కప్

షార్జా: ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీలో ప్రారంభ మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌తో అద్భుత విజయాన్ని నమోదు చేసిన భారత్(97వ ర్యాంకు) తన రెండో మ్యాచ్‌లో యూఏఈ చేతిలో ఓడి నిరాశ పర్చింది. అయితే భారత్ నాకౌట్ చేరడానికి అవకాశాలు మూసుకుపోలేదు. నేడు గ్రూప్ ఎ మ్యాచ్‌లో భాగంగా బహ్రెయిన్(113వ ర్యాంకు)తో భారత్ తలపడనుంది. ఈ మ్యాచ్‌ను డ్రా చేస్తే చాలు.. భారత్ రౌండ్ 16 పోటీకి అర్హత సాధిస్తుంది. 1964లో రన్నరప్‌గా నిలిచిన భారత్ అనంతరం జరిగిన టోర్నీల్లో నాకౌట్ దశకు చేరలేదు. ఈ మ్యాచ్‌తో కెప్టెన్ సునీల్ ఛెత్రీ జాతీయ జట్టు తరపున ఆడుతూ.. మాజీ కెప్టెన్ బైచుంగ్ బూటియా ఆడిన 107 మ్యాచుల రికార్డుతో సమానం చేయనున్నాడు.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.